www.jagritiweekly.com

సంపుటి : 76 సంచిక : 08 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ మార్గశిర బహుళ పంచమి వెల : ₹20/-

01-07 జనవరి 2024





పార్లమెంట్ ముందు మర్కట విన్యాసాలు

# భారతీయ చింతనతో చట్టాలు

150 ఏళ్ల క్రితం తయారైన చట్టాలను 2023లో తొలగించి బీజేపీ ప్రభుత్వం కొత్త రూపునిచ్చింది



జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# శరవేగంగా ఏర్పాట్లు

శరవేగంగా ఏర్పాట్లు ఆలయ నిర్మాణానికి సంబంధించి రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విడుదల చేసిన తాజా చిత్రాలివి. రామాలయ నిర్మాణం శరవేగంగా సాగుతున్నది. జనవరి 22, 2024వ తేదీన రాముని విగ్రహ ప్రతిష్ట జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రాణ ప్రతిష్ట ఏర్పాట్లు కూడా అంతే వేగంగా జరుగుతున్నాయి. అసలు కార్యక్రమం జనవరి 22నే జరగబోతున్నా, అంతకు వారం ముందే అంటే జనవరి 16 నుంచే అక్కడ కార్యక్రమాలు మొదలు పెడుతున్నారు. ఇందుకోసం తీర్థక్షేత్రపురం పేరుతో తాత్కాలిక నగరం ఏర్పాటు చేశారు. ఆరు తాత్కాలిక బావులు, వంటిళ్లు, పది పడకల ఆసుపత్రి కూడా ఏర్పాటు చేశారు. వైద్య సేవలు అందించేందుకు దేశం నలుమూలల నుంచి 150 మంది వైద్యులు కార్యక్రమం సమయంలో అక్కడ ఉంటారు. ఇంకా ఆహార పంపిణీ కేంద్రాలు, భోజనశాలలు కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవానికి 4000 మంది సాధువులు హాజరు కానున్నారు. శంకరాచార్యులు, మహామండలేశ్వరులు, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన ప్రముఖ గురువులు కూడా ఈ ఉత్సవంలో పాల్గొంటారు.





# లక్ష గళాలతో గీతా పారాయణం

ఒకేసారి లక్షమంది  శ్రీమద్ భగవద్గీతను పారాయణం చేసిన అద్భుత ఘట్టం కోల్‌కతా మహానగరంలో డిసెంబర్ 24, 2023 ఆదివారం ఘనంగా జరిగింది. గీతా జయంతి నేపథ్యంలో ఇది ఏర్పాటయింది. అఖిల భారత సంస్కృత పరిషత్, మోతీలాల్ భారత్ తీర్థ సేవా మిషన్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాయి. దీనిని ఒక జాతీయ కార్యక్రమంగా నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి కూడా గీతాపారాయణ కర్తలు ఇందులో పాల్గొన్నారు. వీరితో పాటు విశ్వహిందూ పరిషత్ కూడా ప్రధాన పాత్ర పోషించింది. మూడు గిన్నిస్ రికార్డులు సాధించడం కూడా ఈ కార్యక్రమ నిర్వహణ ఉద్దేశం. లక్షకు పైగా పారాయణ కర్తలు ఇందులో పాల్గొనడం రికార్డు సాధనకు ఉపయోగపడుతుంది. అనేక మందితో శంఖారావం చేయించి ఇందులో కూడా రికార్డు సృష్టించేందుకు ప్రయత్నం చేశారు. ప్రఖ్యాత కవి నజ్రుల్ ఇస్లాం నజ్రుల్ గీతిని అనేక మంది గానం చేసే కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించడం కూడా ఇందులో భాగం చేశారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని మొదట అనుకున్నారు. ఆయన సందేశం పంపారు.







Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/-** (వారానికి రూ. 12/-) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/- చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/- చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040-27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

**- సర్క్యులేషన్ మేనేజర్**

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్

సబ్ ఎడిటర్ 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ


రాజకీయాలు, ఉద్యమాలు వ్యవస్థలకు సమగ్రతనీ, కొత్త దృష్టినీ ఇవ్వాలి. యథాతథ స్థితి నుంచి వ్యవస్థను కదిలించాలి. సానుకూల దృక్పథం కల్పించాలి. మొత్తంగా ఒక మార్పును తీసుకురావాలి. ఇదే వర్తమానంలో, భవిష్యత్తులో చరిత్రగా నమోదవుతుంది. కానీ దారి తప్పిన రాజకీయాలకీ, ఉద్యమాలకీ కూడా చరిత్రలో కొదవ లేదు. చాలా సందర్భాలలో కాంగ్రెస్ రాజకీయాలు, తమిళనాడు కేంద్రంగా జరిగిన ద్రవిడ ఉద్యమం మొత్తంగా దారి తప్పాయని చెప్పడానికి సందేహించనక్కరలేదు. నాగపూర్‌లో 138వ వార్షికోత్సవం జరుపుకున్న కాంగ్రెస్ ఆత్మ పరిశీలన చేసుకుంటే బాగుండేది.

భారతీయ జనతా పార్టీని విమర్శించడం, ఆ పార్టీ ఏలుబడిలో ఉన్నందుకు కన్నూమిన్నూ కానరాక, విచక్షణా రహితంగా భారతదేశం గురించి వ్యాఖ్యానించడం ఒకటి కాదన్న ఇంగితజ్ఞానం ఆ పార్టీ అధిష్ఠానంలో ఎప్పుడో ఇంకిపోయింది. దేశ సమగ్రత గురించిన పట్టింపు నానాటికి నశించిపోతున్నది కూడా. ఇవాళ్టి కాంగ్రెస్ అధిష్ఠానం మొదట వేసుకోవలసిన ప్రశ్న- 1885లో ఆవిర్భవించిన భారత జాతీయ కాంగ్రెస్‌కీ, నేడు తమ నాయకత్వంలో నడుస్తున్న కాంగ్రెస్‌కీ మధ్య ఉన్న ఏకాత్మత ఏమిటి? ఒక దశాబ్దం అధికారంలో లేకపోతే, కాంగ్రెస్ మౌలిక విలువలూ, విశ్వాసాలూ చెత్తబుట్టలోకి వెళ్లిపోవలసిందేనా? నాటి కాంగ్రెస్‌లో పనిచేసిన అశేష శ్రేణుల త్యాగాలు గాలికి కొట్టుకుపోవలసిందేనా? జాతీయోద్యమం స్ఫూర్తి తలదించుకోవలసిందేనా? 'ఇండియా' పేరుతో కాంగ్రెస్ పార్టీ చెట్టపట్టాలు వేసుకు తిరుగుతున్న పార్టీలు ఎలాంటివి? ముఖ్యంగా ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) సిద్ధాంతం ఏమిటి? స్వతంత్ర ద్రవిడదేశం కోరిన సిద్ధాంత వారసత్వం ఉన్న పార్టీ డీఎంకే. భారతదేశ ఏకత్వాన్ని ఆకాంక్షించిన, అందుకు పోరాడినది కాంగ్రెస్. చాలా చిత్రంగా డీఎంకే వేర్పాటువాద పాటను మరచిపోలేదు. కాని కాంగ్రెస్ మాత్రం తన మూలాలను మరచిపోయి డీఎంకే వెంట నడుస్తున్నది.

మూడు హిందీ రాష్ట్రాలలో బీజేపీ అఖండ విజయం సాధిస్తే ఒక


**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ మార్గశిర బహుళ పంచమి**


### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**భారతీయ చింతనతో చట్టాలు**
8లో

కథ
**లోకనింద**
- వి. రాజారామమోహన రావు
18లో





కొవిడ్ - జేఎన్-1
**భయపడొద్దు.. తేలిగ్గా తీసుకోవద్దు**
28లో

# జాగృతి

## సంపాదకీయం

## వి(ష)పక్షాలు

డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ చేసిన వ్యాఖ్య– ఆ విజయం గోమూత్ర రాష్ట్రాలకే పరిమితం. ఇతడు దక్షిణాదికి బీజేపీని ప్రవేశించనివ్వడట. దీని మీద తీవ్ర అసహనం వ్యక్తం చేసిన తరువాత మాత్రమే ఆ నాయకుడు ఆ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాడు. ఉత్తరాదివారు తమిళనాడుకు వచ్చి పాయఖానాలు శుభ్రం చేస్తున్నారని డీఎంకే పార్టీ నాయకుడు, కేంద్ర మాజీమంత్రి దయానిధి మారన్ గతంలో చేసిన వ్యాఖ్యానం కూడా ఇప్పుడు వైరల్ అయింది. ఈ వ్యాఖ్యలు సమీప గతంలో చేసినవే. అంటే సుదూర గతంలోను, సమీప గతంలోను కూడా డీఎంకే తన ధోరణిని మార్చుకోలేదు. డీఎంకేను గుడ్డిగా అనుసరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి ఇవి అర్థం కాకపోవచ్చు. 'భారతదర్శనం' రాసినా భారతీయ ఆత్మను దర్శించలేకపోయారని నెహ్రూ మీద విమర్శ. ఇక ఆయన ముని మనుమడి అంతరంగం సంగతి చెప్పేదేముంది? కాలం గడిచినా ఆ కుటుంబంలో మార్పు రాలేదన్నదే జనాభిప్రాయం. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ కుమార్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ రాసిన జ్ఞాపకాలలో రాహుల్ గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇందుకు తగ్గట్టే ఉన్నాయి. నెహ్రూ–గాంధీ కుటుంబం అహంకారం తప్పితే, వారి రాజకీయ సామర్థ్యం రాహుల్‌కి అబ్బలేదని స్వర్గీయ ప్రణబ్ ఆనాడు నిర్మొహమాటంగానే వ్యాఖ్యానించినట్టు శర్మిష్ఠ రచన చెబుతోంది.

సనాతన హిందూ ధర్మాన్ని సమూలంగా నాశనం చేయవలసిందేనని డీఎంకే యువరాజు ఉదయనిధి వ్యాఖ్యానించినా ఖండించే ధైర్యం ఈ గాంధీ–నెహ్రూ కుటుంబ వారసునికి లేకపోయింది. అదైనా అర్థం చేసుకోవచ్చు. ప్రధాన మంత్రి పదవి కోసం తహతహ లాడిపోతున్న రాహుల్ ఆ పని చేయడం కష్టమే. కానీ దేశ ప్రజల దృష్టిలో తన స్థాయిని తానే రోజురోజుకీ ఎంత దిగజార్చుకుంటున్నారో రాహుల్ ఇప్పటికైనా అంచనా వేసుకుని, ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. ఉపరాష్ట్రపతిని వెక్కిరిస్తూ, పాఠశాల విద్యార్థి కంటే వికారంగా ప్రవర్తించిన తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విన్యాసాలని రాహుల్ గాంధీ సెల్‌తో వీడియో తీయడం దేశ ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన ఏం చేసినా సమర్థించుకునే అలవాటు ఉంది. ఇప్పుడు కూడా అదే చేశారు. ఇవన్నీ కేవలం దిగజారుడు రాజకీయాలని సరిపెట్టుకునేందుకు, కొట్టి పారేసేందుకు ఇప్పుడు వీలు కాదు.

డీఎంకే రోజురోజుకూ రెచ్చిపోవడం వెనుక ఉద్దేశం క్రమంగా రూపు కడుతున్నది. ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం అన్న నినాదానికి బలం చేకూర్చే ఒక ప్రయత్నం అందులో స్పష్టమవుతున్నది. ఇది ఎంత ప్రమాదకర విధ్వంసక ధోరణో చరిత్ర ఎన్నోసార్లు చెప్పింది. తమిళనాడులో అన్నామలై నాయకత్వంలో అటు బీజేపీ బలపడుతూ ఉంటే, ఇటు అధికార డీఎంకే నోట హిందీ, హిందూ వ్యతిరేక నినాదాల జోరు పెరుగుతోంది. ఇలాంటి ధోరణి కోసమే ఎదురుచూసే వామపక్షాలు సందిట్లో సడేమియాల్లా వ్యవహరిస్తున్నాయి. వరస తుపాన్లతో రాష్ట్ర ప్రజలు నరకయాతనలు పడుతున్నా డీఎంకేకు పట్టడం లేదు. పార్లమెంటుకు ఇద్దరు యువకులు పొగ పెట్టిన ఉదంతం, దాని మీద ప్రభుత్వ ప్రకటన చేయడం గురించి జరుగుతున్న రగడకే డీఎంకే ఎంపీలు తుపాను నష్టాలకు మించిన ప్రాధాన్యం ఇచ్చారు. ఈ విపరీత పోకడలని మొదట అర్థం చేసుకోవలసింది తమిళులే. ఇప్పుడు అందరి దృష్టి ఉండవలసింది విజయవంతంగా ముగిసిన రెండో దశ కాశీ–తమిళ సంగమ సందేశం మీద. అంతేకాని ఉత్తర, దక్షిణ భారత విభజన; హిందూ, హిందీ వ్యతిరేకత మీద కాదు. ★

01 జనవరి 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**छाया चित्र కథనం**

– విజయార్కె





| | | |
|---|---|---|
| త్రిశంకుస్వర్గంలో టీఎస్‌పీఎస్సీ భవితవ్యం.. (తెలంగాణ) | – | 14 |
| ఉపాధి నాస్తి... వలసలు జాస్తి (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| కులగణన కుంపట్లో విపక్షాలు (జాతీయం) | – | 20 |
| సేవా సుధారసధార (మహిళ) | – | 26 |
| జాతీయోద్యమంలో తెలుగు 'కలాలు' (సాహిత్యం) | – | 30 |
| పారదర్శక దృష్టి కోసం పతంజలి అన్వేషణ (పురస్కారం) | – | 34 |
| విజయాల హోరు–పతకాల జోరు– 2023! (క్రీడ) | – | 43 |
| హింసను గ్లోరిఫై చేసిన 'సలార్' (సినిమా) | – | 50 |



**వీధిపోరాటాలే ఆధారంగా; దొమ్మీలూ, రక్తపాతమే పంథాగా మనుగడ సాగించే తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీ నుంచి ఇంతకు మించి ఆశించలేం. రాజ్యసభ ఛైర్మన్ అంటే ఉపరాష్ట్రపతిని పార్లమెంట్ భవనం ముందే అపహాస్యం చేయడం, అవహేళన చేయడం అలాంటి పార్టీకి మాత్రమే సాధ్యం. కానీ 'కాంగ్రెస్ విలువలు కూడా ఇంతగా అడుగంటి పోయాయా?' అంటూ ఉపరాష్ట్రపతి నిలదీయవలసిన పరిస్థితిని తన దాయాదితో కలసిన 138 ఏళ్ల కాంగ్రెస్ కూడా కల్పించుకుంది. ఒక మర్కట విన్యాసాన్ని కాంగ్రెస్ ప్రముఖుడు రాహుల్ గాంధీ తన సెల్ ద్వారా వీడియో తీశారు. డిసెంబర్ 19న కొత్త పార్లమెంట్ భవనంలోని మకరద్వారం దగ్గర జరిగిన మర్కట విన్యాసం అంతా విస్తుపోయేటట్టు చేసింది.**

లోక్‌సభకు శ్రీరామ్‌పూర్ నియోజక వర్గం నుంచి టీఎంసీ సభ్యుననిగా ప్రాతినిధ్యం వహిస్తున్న కల్యాణ్ బెనర్జీ ఒక హీనమైన విన్యాసానికి పాల్పడ్డారు. దీనిని దేశమంతా చీదరించుకున్నా కూడా కల్యాణ్ బెనర్జీ తన ధోరణిని వీడలేదు. బుద్ధి తెచ్చుకోలేదు. డిసెంబర్ 24వ తేదీన మరొకసారి శ్రీరామ్‌పూర్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను 'మిమిక్రీ' చేశారు. మళ్లీ అదే పాచిపాట– దాని పేరు భావప్రకటనా స్వేచ్ఛ. అది అతడి ప్రాథమిక హక్కుగా కూడా చెప్పుకున్నారు. అక్కడితో ఆగితే ఆయన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఎలా అవుతారు? గంధోళిగాడికీ, కేతిగాడికీ ఏ మాత్రం తీసిపోని ఆ టీఎంసీ సభ్యుడు అవసరమైతే మరొక వేయిసార్లయినా ఆ 'మిమిక్రీ' కళను ప్రదర్శిస్తానని బీరాలు పలికారు. దానిని గౌరవిస్తారట కూడా. మీరు వెక్కిరిస్తున్నది జగదీప్ ధన్‌ఖడ్ అనే వ్యక్తిని కాదు, రాజ్యసభ అధ్యక్ష స్థానాన్ని అంటూ బీజేపీ వ్యతిరేకత అనే గుడ్డిద్వేషంలో, మత్తులో అన్ని విలువలకూ తిలోదకాలు ఇచ్చిన విపక్షాలను ఆయన మేలుకొలిపే ప్రయత్నం చేశారు. ఇదంతా వినిపించుకునే స్థితిలో విపక్షం లేదు.

అధినేత్రి కటాక్షవీక్షణాల కోసం కల్యాణ్ అనే ఈ నాయకుడు ఎన్ని మర్కట విన్యాసాలు చేయడానికైనా వెనుదీయడని తేలిపోయింది. 'నేను మిమిక్రీ (ధ్వన్యనుకరణ) చేస్తూనే ఉంటాను. నా భావాలు వ్యక్తీకరించడానికి నాకు అన్ని విధాల హక్కు ఉంది. మీరు నన్ను జైలుకు పంపించవచ్చు. అయినా వెనక్కి తగ్గే ప్రశ్న లేదు' అని తన అతిని కూడా ఆయన మిమిక్రీతో పాటే జనానికి పంచుతున్నారు. డిసెంబర్ 19, 2023న ఇలాంటి చేష్టలు ప్రదర్శించి కల్యాణ్ దేశప్రజల కంట్లో పడ్డారు. చాలా విమర్శలు వచ్చాయి. అయినా ఉపరాష్ట్రపతిని లేదా రాజ్యసభ అధ్యక్షుడిని కల్యాణ్ 'అవమానించే' పని ఆపలేదు. పైగా ఇంత చిన్న విషయానికే ఆయనకి అంత కోపం రావాలా ఏమిటి? అంటున్నాడు ఈ ఎంపీ.

డిసెంబర్ 13న లోక్‌సభలో జరిగిన దుర్ఘటనపై హోంమంత్రి ప్రకటన చేయాలని, రాజీనామా చేయాలని పట్టుబట్టిన 146 మంది ఎంపీలను దశల వారీగా సభ నుంచి బహిష్కరించారు. అందులో

# మకరద్వారం ముందు మర్కట విన్యాసాలు

జాగృతి డెస్క్

డిసెంబర్ 19న విపక్ష ఎంపీలు కొత్త పార్లమెంట్ మకర ద్వారం దగ్గర నిరసన చేపట్టారు. ఆ సందర్భంలోనే కల్యాణ్ బెనర్జీ ఈ మర్కట విన్యాసాలు చేశారు. ఈ విన్యాసాలను గాంధీ–నెహ్రూ వంశీకుడు రాహుల్ గాంధీ తన సెల్‌లో వీడియో తీశారు. దీనికి ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు కూడా. తాను జాట్ వర్గం నుంచి వచ్చినందుకే, రైతు నేపథ్యం ఉన్నందుకు కల్యాణ్ ఇలాంటి చర్యకు పాల్పడ్డారని ధన్‌ఖడ్ ఆరోపించారు. అయితే ఇతరులను అనుకరించడానికి తనకు హక్కు ఉన్నదని చెబుతున్న కల్యాణ్, ధన్‌ఖడ్ చేసిన విమర్శను మాత్రం తప్పు పట్టారు. ఇది కదా, ప్రతిపక్ష మార్కు ఇంకా చెప్పాలంటే టీఎంసీ మార్కు ప్రజాస్వామ్యం. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కూడా కల్యాణ్ చర్య పట్ల తమ నిరసన వ్యక్తం చేశారు. 'నా వెన్నెముక చాలా నిటారుగా ఉంటుంది. నేను పొడవైన మనిషిని!' అంటూ ధన్‌ఖడ్‌ను దృష్టిలో పెట్టుకుని కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైనాయి.

విపక్ష నాయకుల విజ్ఞత మీద దేశ ప్రజలకు ఎప్పుడో నమ్మకం పోయింది. కానీ ఇలాంటి వాటిని సమర్ధిస్తున్నందువల్ల మేధావులుగా చెప్పుకునే కొందరు మీడియా వారి మీద కూడా దేశ ప్రజలకు గౌరవం పూర్తిగా పోయే పరిస్థితులు వస్తున్నాయి. కల్యాణ్ విన్యాసాలను తన సెల్‌లో బంధించడం గురించి విలేకరులు రాహుల్ గాంధీని ప్రశ్నించారు. కానీ రాహుల్ విలేకరులనే ఎదురు ప్రశ్నించారు. 'విలేకరులు తనను వీడియో తీయడం గురించి ప్రశ్నించడం ఆశ్చర్యపరుస్తున్నదని, నిజానికి 146 మంది ఎంపీల సస్పెన్షన్ గురించి వారు అడుగుతారని ఆశించా'నని అన్నారట. ఇది కదా మేధావి లక్షణం అంటూ ఒక కాలమిస్ట్ రాయడమే విశేషం. రాహుల్ ప్రశ్న పత్రికా లోకాన్ని మేలుకొలిపే విధంగా ఉన్నదంటూ ఆ మహిళా కాలమిస్ట్ రాహుల్ మీద ప్రశంసలు కురిపించారు. కానీ దేశంలో కల్యాణ్ చర్య పట్ల జనం అసహ్యించుకున్న మాట వాస్తవం.

ఇప్పుడు ఉపరాష్ట్రపతిని 'మిమిక్రీ' చేయడం దేశ ప్రజలందరికీ తెలిసినప్పటికీ ఈ కళను చిరకాలంగా కల్యాణ్ ప్రదర్శిస్తున్నారు. అంటే నోటికి వచ్చినట్టు వదరే కళకు ఆయన చాలాకాలం నుంచే సాధన చేస్తున్నారు. చాలాకాలం క్రితం నాటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యను కూడా కల్యాణ్ ఇలాగే అనుకరించారు. ఆ తరువాత నరేంద్ర మోదీని కూడా అనుకరించారని వార్తలు వచ్చాయి. బెంగాల్ రాజకీయ వర్గాలు కల్యాణ్‌ను నోటివాటపు నేత అని ముద్దుగా పిలుచుకుంటారు. టీఎంసీ నేత మమతా బెనర్జీకి అత్యంత ఆప్తుడు కల్యాణ్. ఆమె ఆశీస్సులతోనే 2001లో తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వృత్తికి న్యాయవాది అయిన కల్యాణ్ తన పార్టీ కేసులను ఎక్కువగా వాదిస్తారు. ఈయన చేష్టలంటే ఇలా పిల్లచేష్టలనిపిస్తాయి కానీ, ఈయన మూడుసార్లు శ్రీరామ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 2009లో నందన్ అనేచోట బుద్ధదేవ్‌ను అనుకరించి, వార్తలకెక్కారు. 2012లో కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి టీఎంసీ వీడ్కోలు చెప్పింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అంశం మీద అప్పుడు కేంద్ర మంత్రి ఆనంద్ శర్మను కూడా కల్యాణ్ మిమిక్రీ చేశారు. ఇక పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో టీఎంసీ ఆధ్వర్యంలో కోల్‌కతాలోని రిజర్వు బ్యాంక్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలోను కల్యాణ్ ప్రధాని నరేంద్ర మోదీ మీద నోరు పారేసుకున్నారు. ఈ చర్యను అప్పుడు చాలామంది ఖండించారు. ఇతడి నోటి దురదకు హద్దులు లేవు. హత్రాస్ (ఉత్తరప్రదేశ్) వివాదం నేపథ్యంలో 2021లో కల్యాణ్ సీతారాముల మీద కారుకూతలు కూశారు. ఈ తుంటరి వ్యాఖ్యలకు నాడు బీజేపీ, విశ్వహిందూ పరిషత్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, అతడిని అరెస్టు చేయాలని ఆందోళన చేశాయి. కానీ అక్కడ ఉన్నదే ఒక అరాచక ప్రభుత్వం ఇలాంటి వాడిని ఎందుకు అరెస్టు చేస్తుంది? ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి పదవి చేపట్టక ముందు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పనిచేశారు. అప్పుడు టీఎంసీకీ, గవర్నర్‌కూ నడుమ అనేక వివాదాలు చెలరేగాయి. గవర్నర్ నివాసం ఎదుట టీఎంసీ కార్యకర్తలు ధర్నా చేయడమే కాదు,



ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

ఆయన మీద కేసు పెట్టాలంటూ గగ్గోలు పెట్టాయి. ఏమైనా టీఎంసీ అరాచకాలను బయటి ప్రపంచానికి అధికారికంగా తెలియ చేయడంలో గవర్నర్ కొన్ని ప్రకటనలు ఉపయోగ పడినాయి. అందుకు ప్రతీకారం తీర్చుకోవాలన్న కోరికే లోక్‌సభ సభ్యుడు కల్యాణ్ బెనర్జీలోను, రాజ్యసభ సభ్యుడు డిరెక్ ఓబ్రీన్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటుంది. లోక్‌సభలో మరొక ఎంపీ సౌగత్‌రాయ్ సరళి కూడా ఇదే పంథాలో ఉంటుంది. దీనికి సహజంగానే కాంగ్రెస్ కూడా తోడైంది. లోక్‌సభలో ఇద్దరు యువకుల అక్రమ ప్రవేశం వివాదాన్ని పక్కతోవ పట్టించడానికే ప్రధాని నరేంద్ర మోదీ రాహుల్ వీడియో తీసిన ఉదంతాన్ని ముందుకు తీసుకువస్తున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించడం విశేషం. మహువా మొయిత్రా కూడా మరొకసారి ప్రభుత్వం మీద కక్ష తీర్చుకోవడానికి వచ్చిన అవకాశాన్ని జార విడుచుకోలేదు. ఔను మిమిక్రీ ఒక కళ కల్యాణ్ ప్రదర్శించినది ఆ కళే అని వ్యాఖ్యానించారు.

కల్యాణ్ బెనర్జీ నిర్వాకం మీద సుప్రీం కోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ పార్లమెంట్ ఉభయ సభల నియమావళి సంఘాలకీ ఫిర్యాదు చేశారు. కల్యాణ్ మీదనే కాకుండా, ఆ వికృత విన్యాసాన్ని సెల్‌లో రికార్డు చేసే విపరీత చర్యకు పాల్పడిన రాహుల్ గాంధీ, ఇదంతా చూస్తూ వెకిలి నవ్వులు

నవ్విన 141 మంది ఎంపీల మీద కూడా చర్యలు తీసుకోవాలని జిందాల్ ఆ ఫిర్యాదులో కోరారు. కల్యాణ్ విన్యాసం, దానిని వీడియో తీసే పని రెండూ కూడా అత్యంత అవమానకరమైన చర్యలని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అవమానం గురించి ప్రధాని స్పందిస్తూ తాను గత ఇరవై ఏళ్లుగా ఇలాంటి అవమానాలకు గురి అవుతూనే ఉన్నానని చెప్పారని ధన్‌ఖడ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఈ ఉదంతం మొత్తంలో కనిపించే మెరుపు, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్య. 'మేం ఎవరినీ తక్కువ చేసి చూడం. అందరినీ గౌరవిస్తాం. ఇది చట్టసభ సభ్యుడు ఒకరు చేసిన చిన్న పని. కానీ రాహుల్ గాంధీ దానిని వీడియో తీయడం వల్ల వివాదం పెద్దదయింది' అన్నారామె. రాహుల్‌ను కాకుండా కాంగ్రెస్ నుంచి మల్లికార్జున ఖర్గేను ప్రధానిగా ప్రకటించాలంటూ తరువాతే మమత ఇండీ సభలో చెప్పిన విషయం తెలిసిందే.

భారత పార్లమెంట్‌లో రాజ్యసభను ఎగువ సభగా, పెద్దల సభగా గౌరవిస్తారు. కానీ లోక్‌సభలో పొగదాడి ఘటన నేపథ్యంలో జరిగిన సస్పెన్షన్లలో రాజ్యసభ సభ్యులు ఎక్కువగా ఉండడం విచారకరం. ధన్‌ఖడ్‌కు ముందు రాజ్యసభ చైర్మన్ పదవిని నిర్వహించిన ఎం. వెంకయ్యనాయుడు కూడా అనేక సందర్భాలలో అవాంఛనీయ వాతావరణాన్ని చూడవలసి వచ్చింది. భారత అత్యున్నత చట్టసభలో



కల్యాణ్ బెనర్జీ విన్యాసాలు

ఎగువ సభ వర్తమాన పరిస్థితి ఇది.


సభలో అలజడి సృష్టించి దేశ ప్రజల కంట్లో పడదామన్న అవాంఛనీయ పోకడ సభ్యులలో పెరగడమే ఇందుకు కారణమన్న వాదన ఉంది. అలాగే పార్లమెంట్‌ను స్తంభింప చేయడం ఇటీవలి కాలంలో సర్వసాధారణంగా మారిపోయింది. ఇలాంటి వాతావరణం తరచు కనపడడానికి మీడియా కూడా కారణమన్న అభిప్రాయం బలపడుతున్నది. సభ సజావుగా సాగుతూ, అర్థవంతమైన చర్చలు జరిపితే మీడియా దాని గురించి పట్టించుకోవడం లేదు. అదే సభలో అలజడి సృష్టించి, సభా నిర్వాహకుని మీద కాగితాలు విసరడం, పోడియంలోకి ప్రవేశించడం వంటి చర్యలు జరిగితే మీడియా దానిని విశేష ప్రాధాన్యం ఇస్తున్నది. ఇలా అలజడి సృష్టించడానికే ప్రజా సమస్యల ప్రస్తావనగా కొన్ని ప్రతిపక్షాలు పేరు పెడుతున్నాయి. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించమే పనిగా చాలామంది సభ్యులు ఇలాంటి అప్రజాస్వామిక ధోరణికి పాల్పడుతున్నారని పలువురు సభ్యులు అంగీకరిస్తున్నారు కూడా. రాజకీయ పార్టీలలో వస్తున్న విపరీత పోకడలు కూడా ఇందుకు కారణమన్న విమర్శ ఉంది. అధికార పార్టీ మీద ఉన్న అక్కసును తీర్చుకోవడానికీ, ప్రజాక్షేత్రంలో తమకు ఎదురవుతున్న అపజయాలను కప్పి పుచ్చుకోవడానికి పలు పార్టీలు ఈ ధోరణిని ఆశ్రయిస్తున్నాయి. అధికార పార్టీ మీద అసహనం, తమ అధిష్ఠాన దేవతల కరుణ కోసం కూడా కొందరు సభ్యులు గందరగోళాన్ని నమ్ముకుంటున్న సంగతి వాస్తవం. సిద్ధాంత నిబద్ధత లేకపోవడం, ప్రజా ఉద్యమాలతో సంబంధం లేనివారే ఎక్కువగా సభలో ప్రవేశించడం కూడా హుందాతనం లుప్తమైపోవడానికి కారణమన్న ఆరోపణను ఎవరూ నిరాకరించలేరు. ★

# భారతీయ

**ఈస్టిండియా కంపెనీ, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నేర శిక్షాస్మృతికి ఇంతకాలానికి విముక్తి లభించింది. 150 ఏళ్ల క్రితం తయారైన ఈ చట్టాలను 2023లో తొలగించి బీజేపీ ప్రభుత్వం నేర చట్టాలకు కొత్త రూపునిచ్చింది. దీనితో భారతీయ చింతనతో కూడిన నేర స్మృతి అమలులోకి వచ్చినట్టయింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ ఉభయసభల్లో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. మొత్తం నేర న్యాయవ్యవస్థలోనే సమూలమైన మార్పులకు ఈ చట్టాలు దోహదం చేస్తున్నాయి. అవి 1. 1860 నాటి ఐపీసీ చట్టం స్థానంలో ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత బిల్లు. 2. 1898 నాటి సీఆర్‌పీసీ చట్టం స్థానంలో ప్రవేశపెట్టిన భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు. 3.1872 నాటి ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో ప్రవేశపెట్టిన భారతీయ సాక్ష్య బిల్లు. పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం పొందగా, రాష్ట్రపతి డిసెంబర్ 25న సంతకంచేశారు. దీంతో ఈ కొత్తచట్టాలు అమల్లోకి వచ్చినట్లయింది. మైనర్ల మీద లైంగిక అత్యాచారానికీ, అత్యాచారం చేసి హత్య చేసిన కేసులలోను శిక్షను తీవ్రం చేశారు. ఈ కేసులో మైనర్‌ను చంపితే ఉరిశిక్షను ఎదుర్కొన్నవలసి ఉంటుంది. ఇలాంటి కేసులలో శిక్ష ఇంత తీవ్రంగా ఉండాలన్నదే చిరకాలంగా భారతీయ సమాజం కోరుతున్నది. నేరాలు చేసి తప్పించుకు తిరిగే అవకాశం ఇక ఉండదు.**

డిసెంబర్ 12న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ మూడు బిల్లులకు డిసెంబర్ 20న ఆమోదం లభించింది. అదేవిధంగా రాజ్యసభ డిసెంబర్ 21న ఆమోదం తెలిపింది. భారతీయ న్యాయచట్టాల్లో ఈ బిల్లుల ద్వారా సమూల మార్పులు చేశారు. శిక్షించడం కంటే, సత్వర న్యాయం అందించడమే ఈ బిల్లుల ప్రధాన లక్ష్యమని అమిత్‌షా బిల్లులను ప్రవేశ పెట్టే సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ బిల్లుల్లో రాజద్రోహం విషయంలో మార్పు చేశారు. భిన్నాభిప్రాయాలను అణచివేస్తున్నారన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో రాజద్రోహాన్ని తొలగించారు. హింస నుంచి మహిళలు, చిన్నపిల్లల రక్షణకు కొత్త నిబంధనలు చేర్చారు. బాధితులకు తేలిగ్గా సత్వర న్యాయం సమకూరే విధంగా ఈ బిల్లులను ప్రభుత్వం రూపొందించింది. న్యాయ వ్యవస్థ స్వేచ్ఛను ఈ బిల్లు మరింత బలోపేతం చేస్తుంది. కొత్త చట్టాల ప్రకారం డిజిటల్, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను సైతం సాక్ష్యంగా పరిగణలోకి తీసుకుంటారు. వందేళ్ల వరకు ఈ చట్టాలు దేశ న్యాయ ప్రక్రియలో ఉపయోగపడతాయి. నిజానికి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు 150 ఏళ్ల క్రితం నాటివి. 1833 చార్టర్ చట్టం కింద, 1834లో మొట్టమొదటి లా కమిషన్‌ను ఈస్టిండియా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బ్రిటిష్ ఇండియా ఆధ్వర్యంలో 1860లో అధికారిక ఇండియన్ పీనల్ కోడ్‌ను (ఐపీసీ)ని రూపొందించారు. దేశంలో నేర న్యాయ చట్టం అమలుకు అవసరమైన విధివిధానాలను కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ)లో పొందుపరిచారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ను 1872లో ఇంపీరియల్

# చింతనతో చట్టాలు



నేర శిక్షాస్మృతి బిల్లుపై పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్న అమిత్ షా

లెజిస్లేటివ్ కౌన్సిల్ అమల్లోకి తీసుకొచ్చింది. భారతీయ కోర్టుల్లో అనుమతించదగ్గ సాక్ష్యాలకు సంబంధించిన వివరాలు ఇందులో వివరించారు. పౌరుల భద్రత, హక్కుల పరిరక్షణకోసం రూపొందించిన ఈ చట్టాలు, విధివిధానాలు ముఖ్యంగా నేరగాళ్లను గుర్తించి విచారించి తగిన శిక్షలు విధించడం నేర న్యాయ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, శాసన సంస్థలు, ఫోరెన్సిక్ వంటి అనుబంధ సంస్థలు ఇందులో భాగంగా ఉంటాయి.

కొత్తగా పార్లమెంట్ ఆమోదించిన మూడు న్యాయ సంస్కరణ బిల్లులు ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ క్రిమినల్ చట్టాలను సమూలంగా మార్చివేస్తున్నాయి. ఒక క్రిమినల్ విచారణను 30-45 రోజుల్లోగా పూర్తి చేసి తీర్పునివ్వాలని నూతన నాగరిక సురక్షా సంహిత నిర్దేశిస్తున్నది. 258(1) ప్రకారం కేసుకు సంబంధించి వాదోపవాదాలు ముగిసిన తర్వాత న్యాయమూర్తి సాధ్యమైనంత త్వరగా అంటే 30రోజుల్లోగా తీర్పు చెప్పాలి. అయితే తగిన కారణాలను లిఖితపూర్వకంగా చూపుతూ 45 రోజుల వరకు తీర్పు చెప్పే కాలాన్ని పొడిగించవచ్చు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం వాదోపవాదాలు ముగిసిన తర్వాత 30 రోజుల్లోగా తీర్పు చెప్పేందుకు న్యాయమూర్తి కృషి చేయాలి. అయితే ఇందుకు గరిష్ఠ కాలపరిమితి 60 రోజులుగా నిర్దేశించింది. దిగువ కోర్టులు తీర్పు చెప్పడానికి ఆరువారాల నుంచి రెండు నెలల వరకు కాలపరిమితి విధిస్తూ సుప్రీం కోర్టు 2001లో తీర్పు చెప్పింది. కోర్టులు పాటిస్తున్న దాఖలాలు లేవు. తీర్పులు చెప్పడంలో కొనసాగుతున్న తీవ్ర జాప్యం సామాన్యులకు న్యాయవ్యవస్థ పట్ల అపనమ్మకాన్ని పెంచుతుందని సుప్రీంకోర్టు, హైకోర్టులు పదేపదే పేర్కొంటున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు.

**భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)**

భారతీయ న్యాయసంహితలో మొత్తం 19 అధ్యాయాలు, 356 సెక్షన్లు ఉన్నాయి. దీని నిర్మాణం ఇప్పటివరకు అమల్లో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ మాదిరిగానే ఉంటుంది.

**శారీరక దాడులు:** ఐపీసీలో పేర్కొన్న హత్య, ఆత్మహత్యకు పురికొల్పడం, తీవ్రంగా గాయపరచడం వంటి అంశాలను యథాతథంగా ఉంచారు. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదం, హత్య లేదా మూకదాడుల ద్వారా తీవ్రంగా గాయపరచడం వంటి కొత్త అంశాలను చేర్చారు. మూకదాడులకు పాల్పడితే గరిష్ఠంగా మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. ఇటీవలి కాలంలో ఈ మూకదాడులు సమస్యగా మారాయి.

**మహిళలపై లైంగిక నేరాలు:** అత్యాచారం, ఇతరుల కష్టాలు, బాధలు చూసి ఆనందించే తత్వం, స్త్రీలలోని అణకువను అవహేళన చేయడం వంటి ఐపీసీ అంశాలను యథాతథంగా ఉంచారు. సామూహిక అత్యాచారానికి గురైన బాధితురాలిని మేజర్‌గా పరిగణించే వయసును 16 నుంచి 18కి పెంచారు. వివాహం చేసుకుంటానని నమ్మించి ఒక మహిళతో లైంగిక సంబంధం పెట్టుకొని మోసగించినట్లయితే పదేళ్ల వరకు జైలుశిక్ష విధించవచ్చు.

**ఆస్తులకు వ్యతిరేక నేరాలు:** దొంగతనం, దోపిడీ, కన్నపు దొంగతనం, మోసం వంటి ఐపీసీలోని అంశాలను కూడా యథాతథంగా ఉంచారు. సైబర్, ఆర్థిక నేరాలను కొత్తగా చేర్చారు.


**రాజ్యవ్యతిరేక నేరాలు:** ఐపీసీలో పేర్కొన్న రాజద్రోహ నేరాన్ని తొలగించారు. దీని స్థానంలో భారత ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి భంగం వాటిల్లజేసే నేరాలను చేర్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని సవాలుచేసే ఉగ్రవాదం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటులను ఇందులో స్పష్టంగా నిర్వచించారు. అంతకు ముందు వీటిని వివిధ చట్టాల కింద పేర్కొనేవారు. వాక్‌స్వాతంత్ర్యానికి, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు అడ్డంకిగా ఉన్న వలసవాద కాలంనాటి దేశద్రోహ చట్టాన్ని తొలగించారు.

**ప్రజావ్యతిరేక నేరాలు:** వాతావరణ కాలుష్యం, మానవ అక్రమరవాణాను ఇందులో కొత్తగా చేర్చారు. కొన్ని ప్రత్యేక నేరాల్లో, నేరగాళ్లకు సామాజిక సేవను శిక్షగా విధించేందుకు ఈ చట్టం వీలు కల్పి స్తుంది. ముఖ్యంగా నేరగాళ్లలో మానసిక పరివర్తనను తీసుకొని రావడం దీని ప్రధాన ఉద్దేశం. చార్జ్‌షీటు దాఖలుచేయడానికి గరిష్ఠంగా 180 రోజుల కాల వ్యవధిని ఈ చట్టం విధిస్తోంది. కేసు విచారణలో నిరవధిక ఆలస్యాన్ని నివారించడం దీని ప్రధాన ఉద్దేశం.

**భారతీయ సాక్ష్య అభినియం**

ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (1872)స్థానంలో పార్లమెంట్ ఆమోదించిన భారతీయ సాక్ష్య అభినియం-2023 లేదా బీఎస్ఏలో మొత్తం 170 సెక్షన్‌లు ఉన్నాయి. అదే ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో ఇవి 167 మాత్రమే ఉండేవి. ఇందులోని 23 సెక్షన్‌లకు మార్పులు చేశారు. ఐదు సెక్షన్లను తొలగించగా మరో సెక్షన్‌ను కలిపారు.

* ఎలక్ట్రానిక్ సాక్ష్యాన్ని భద్రపరచే ఉపకరణాన్ని ఇది నిర్వచించింది. ఎలక్ట్రానిక్ సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకోవడానికి కావలసిన అభి



**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్

లక్షణాలను ఇందులో వివరించారు. డిజిటల్ సమాచారాన్ని మార్పు చేయకుండా, దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఇవి ఉపకరిస్తాయి.

- డీఎన్ఏకు సంబంధించిన సాక్ష్యాలను అనుమతించడంలో పాటించాల్సిన నిబంధనలు ఇందులో పొందుపరచారు. ఇది జీవసంబంధ సాక్ష్యంలోని విశ్వసనీయత, కచ్చితత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది.
- వైద్య సలహా, చేతిరాత విశ్లేషణ వంటి అంశాల్లో నిపుణుల అభిప్రాయాన్ని తీసుకోవడానికి ఇది వీలు కల్పిస్తుంది. కేసుకు సంబంధించిన పరిస్థితులు లేదా వాస్తవాలను నిర్ధారించడం దీని ఉద్దేశం.
- నిరపరాధి భావన అనేది నేర న్యాయవ్యవస్థలో ప్రాథమిక సూత్రం. అంటే నేరాభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తిని నేరం రుజువయ్యేవరకు నిరపరాధిగానే పరిగణిస్తారు.

**భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)**

భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లు -2023, చట్టాన్ని మరింత ఏకీకృతం, సరళీకృతం చేసింది. ముఖ్యంగా సీఆర్పీసీలోని చాలా నిబంధనలను తొలగించడమో లేక సవరించడమో జరిగింది. ఇందులో మొత్తం 38 చాప్టర్లు, 533 సెక్షన్లు ఉన్నాయి. పాత చట్టంలోని 160 సెక్షన్లలో మార్పులు చేయగా, 9 కొత్త సెక్షన్లను చేర్చి, మరో 9 సెక్షన్లు తొలగించారు. నిందితుడి హక్కులను మరింత బలోపేతం చేశారు. ముఖ్యంగా న్యాయవాదిని నియమించుకునే హక్కు, మౌనంగా ఉండే హక్కు, న్యాయబద్ధమైన విచారణ హక్కు కల్పించారు.

నేర న్యాయచట్టాన్ని మరింత బలోపేతం చేయడానికి బీఎన్ఎస్ఎస్ దోహదం చేస్తుంది. ముఖ్యంగా అనవసర ఆలస్యాలను నిరోధించడం, విధి విధానాలను క్రమబద్ధీకరించడం ద్వారా చట్టం బలోపేతానికి దోహద పడుతుంది.

**చేసిన మార్పులు**

- చాలా కేసుల్లో ఏ విధమైన వారంట్ లేకుండా నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఇది కల్పిస్తోంది.
- పోలీసులు బెయిల్‌ను వ్యతిరేకించడం కష్టమవుతుంది. చాలా కేసుల్లో నిందితులకు బెయిల్ వచ్చే అవకాశాలు ఎక్కువ.
- నేర విచారణలో పోలీసులకు మరిన్ని అధికారాలు దఖలు పడతాయి. నిర్దేశిత కాలంలో కేసు దర్యాప్తు పూర్తిచేయాలి కనుక వారికి ఈ వెసులుబాటు అవసరం.
- కోర్టులు నిర్దేశిత కాలంలో కేసు విచారణ జరిపి తీర్పులు వెలువరించాలి.



- విచారణలు, అప్పీళ్లు, వాంగ్మూలాల నమోదు వంటి అంశాల్లో సాంకేతి కత వినియోగానికి ఇది వీలు కల్పిస్తుంది. అంతేకాదు విచారణను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టేందుకు ఇది వెసులుబాటు కల్పిస్తుంది. లైంగిక హింస కేసుల్లో బాధితుల వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ రూపంలో నమోదు చేయడం తప్పనిసరి. దీనివల్ల సాక్ష్యాన్ని భద్రపరచడమే కాకుండా, తారుమారు చేసే అవకాశాలను ఇది నిరోధిస్తుంది.
- ఒక ఫిర్యాదుకు సంబంధించిన స్థితి ఏ దశలో ఉన్నదీ 90రోజుల్లో పోలీసులు తప్పనిసరిగా వివరించాలి. దీనివల్ల బాధ్యత, జవాబుదారీతనం పెరుగుతాయి.
- సీఆర్పీసీలోని 41ఎ సెక్షన్‌ను ఇందులో సెక్షన్-35గా పేర్కొన్నారు. దీని ప్రకారం, నిందితుడి వయసు 60ఏళ్లు దాటినా లేక మూడు సంవత్సరాలలోపు జైలుశిక్ష పడే కేసుల్లో పోలీసులు అరెస్ట్ చేయాలంటే ముందుగా డీఎస్పీ ర్యాంకు అధికారినుంచి అనుమతి పొందాలి.
- ఏడేళ్లు లేదా అంతకు మించి శిక్షపడే కేసును ఉపసంహరించుకునే ముందు పోలీసులు బాధితులను తప్పనిసరిగా సంప్రదించాలి. తద్వారా న్యాయ నిరాకరణ లేదా రాజీపడే అవకాశానికి తావుండదు.
- నేరగాళ్లు తప్పించుకొని తిరుగుతున్న కేసుల్లో, కోర్టులు వారి పరోక్షంలో కేసును విచారించి శిక్షలు విధించవచ్చు. తద్వారా నేరగాడిని న్యాయచట్టం నుంచి తప్పించుకోకుండా చూడవచ్చునన్నదే దీని ప్రధాన ఉద్దేశం.
- ఈ-మెయిళ్లు, ఎస్ఎంఎస్‌లు వంటి ఎలక్ట్రానిక్ రికార్డుల ఆధారంగా మేజిస్ట్రేట్లు గుర్తించదగిన నేరాలను నమోదు చేయవచ్చు. సాక్ష్యాల సేకరణకు, వాటిని సరిచూడటానికి ఇది వీలు కల్పిస్తుంది.
- మరణశిక్ష పడిన కేసుల్లో క్షమాభిక్ష కోసం గవర్నర్‌కు 30 రోజుల్లోగా, రాష్ట్రపతికి 60 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాన్ని ఏ కోర్టులో సవాలు చేయడానికి వీల్లేదు.

**ఈ బిల్లుల ప్రకారం విధించే శిక్షలు ఈవిధంగా ఉన్నాయి**

- యాక్సిడెంట్ చేసి పారిపోతే పదేళ్ల జైలు, అదే యాక్సిడెంట్‌కు గురైన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళితే శిక్షలో సగానికి తగ్గింపు.
- మూకదాడికి పాల్పడితే ఏడేళ్ల జైలు, ఉరిశిక్ష
- మైనర్‌పై అత్యాచారం చేస్తే జీవితకాలం జైలు శిక్ష. ఒకవేళ మైనర్ చనిపోతే నిందితులకు ఉరిశిక్ష.
- దేశద్రోహానికి జీవితకాల శిక్ష నుంచి ఏడేళ్ళకు మార్పు.
- నేరంచేసి విదేశాలకు పారిపోయినవారు 90 రోజుల్లోగాలొంగిపోవాలి. లేదంటే వారి తరపున ప్రభుత్వ న్యాయవాదిని నియమించి తీర్పును ప్రకటిస్తారు. అటువంటి నేరగాళ్లను విదేశాల నుంచి రప్పించి ఉరిశిక్ష విధిస్తారు.
- మహిళలకు ఈ-ఎఫ్ఐఆర్ నమోదు చేసుకునే అవకాశం.
- అరెస్టయిన వ్యక్తి కుటుంబీకులకు సమాచారం ఇవ్వాలి. దర్యాప్తు,సోదాలను వీడియోగ్రఫీ చేయాలి.
- ఎవరైనా ఎక్కడి నుంచైనా జీరో ఎఫ్ఐఆర్ దాఖలు చేయవచ్చు. 24 గంటల్లో దాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు మార్చుకోవచ్చు.
- నిరాధారంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచడానికి వీల్లేదు.
- అరెస్టయినవారి వివరాలు కుటుంబ సభ్యులకు తెలిపేందుకు, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక అధికారి నియామకం.

* ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను వేలం వేసి, ఆ సొమ్ములు ప్రభుత్వ ఖజానాకు మళ్లిస్తారు.
* నేరం సందర్భంగా పట్టుకున్న వాహనాలను 30 రోజుల్లో కోర్టుద్వారా అమ్మేస్తారు.
* ఏడేళ్ల జైలుశిక్ష పడే కేసుల్లో, ఫోరెన్సిక్ టీమ్ దర్యాప్తు తప్పనిసరి.

**ఎఫ్ఐఆర్, చార్జ్‌షీటు, విచారణకు సంబంధించిన నిబంధనలు**

* సీఆర్‌పీసీ చార్జ్‌షీటు దాఖలు చేయడానికి ఎటువంటి కాలావధిని పేర్కొనలేదు. అయితే బీఎన్ఎస్ఎస్ ఇందుకు కాలావధిని నిర్దేశిస్తుంది. సాధారణ ఉల్లంఘనలకు మూడురోజుల్లోగా చార్జ్‌షీటు లాంఛనంగా దాఖలు చేయాలి. మూడు నుంచి ఏడేళ్ల శిక్షపడే నేరాలకు సంబంధించిన దర్యాప్తు 14 రోజుల్లోగా పూర్తి చేయాలి. అప్పటికి తెలిసిన అంశాల ఆధారంగా ఫిర్యాదును నమోదు చేయాలి.
* 90 రోజుల్లోగా మొదటి చార్జ్‌షీటును దాఖలు చేసే సమయానికి, మిగిలిన దర్యాప్తును పూర్తి చేయాలి.
* చార్జ్‌షీటు విచారణార్హమైనదా కాదా అన్న అంశాన్ని మేజిస్ట్రేట్ 14 రోజుల్లోగా నిర్ణయించాలి.
* లైంగిక దాడికి గురైన బాధితుల నివేదికలను నిర్ణీత కాలావధిలోగా పంపాలి.
* ఆరోపణలు రాసేందుకు, డిస్చార్జ్ పిటిషన్లపై తగిన నిర్ణయం తీసుకునేందుకు, డిస్చార్జ్ కోసం దరఖాస్తును దాఖలు చేసేందుకు కాలావధులను నిర్ణయించారు.
* కేసు విచారణకు నిందితుడు 90 రోజుల్లోగా హాజరు కాకపోతే, అతని పరోక్షంలోనే విచారణ జరుపవచ్చు.
* మొట్టమొదట నేరానికి పాల్పడినవారు, వారి శిక్షాకాలంలో 1/3వంతు కాలం విచారణ ఖైదీగా కొనసాగితే విడుదల కావచ్చు. ఇతర సందర్భాల్లో శిక్షాకాలంలో సగం పూర్తిచేయాల్సి ఉంటుంది.
* నేర నిర్ధారణ జరిగిన వారు మాత్రమే క్షమాభిక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బయటి పార్టీలు లేదా ఎన్‌జీవోలు అటువంటి పిటిషన్లను దాఖలు చేయరాదు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన 30రోజుల్లోగా ఈ దరఖాస్తు చేసుకోవాలి. ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఎఫ్ఐఆర్‌లను దాఖలు చేసేందుకు వెసులుబాటు కల్పించారు. ముఖ్యంగా లైంగికదాడుల కేసుల్లో పోలీస్ స్టేషన్లకు రావడానికి విముఖత చూపే మహిళలకు ఈ-ఎఫ్ఐఆర్ ఉపయోగకారి.
* నేరం జరిగిన ప్రదేశాలను ఫోరెన్సిక్ టీమ్ సభ్యులు సందర్శించాలి. ఫోరెన్సిక్ సాక్ష్యాల వల్ల నేరనిర్ధారణ మరింత కచ్చితంగా జరుగుతుంది.
* గరిష్టంగా మూడేళ్ల శిక్ష పడే కేసుల్లో శీఘ్ర విచారణ జరుపుతారు. గ తంలో ఇది రెండేళ్లుగా ఉండేది.
* గతంలో మొత్తం 19 కేసుల్లో పరారీలో ఉన్న అపరాధుల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం జరిగేది. ప్రస్తుతం ఈ కేసుల సంఖ్యను 120కి పెంచారు.

**నేర న్యాయవ్యవస్థలో సమస్యలు**

నేషనల్ జ్యుడిసియల్ డేటా గ్రిడ్ ప్రకారం ప్రస్తుతం దేశంలోని వివిధ కోర్టుల్లో 4.7కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనివల్ల సత్వర న్యాయం అందకపోవడం, విచారణ వేగం హక్కు ఉల్లంఘన, ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం సన్నగిల్లడం జరుగుతోంది. నేర న్యాయవ్యవస్థ ప్రస్తుతం మానవ వనరులు, నిధులు వంటి మౌలిక వసతుల కొరతను ఎదుర్కొంటున్నది. న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు, న్యాయపరమైన మద్దతు ఇచ్చే లాయర్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. 2023, ఫిబ్రవరి నాటికి 135 మిలియన్ జనాభా కలిగిన దేశంలో, ప్రతి మిలియన్ (పది లక్షలు)కు 21 న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. హైకోర్టుల్లో 400 ఖాళీలున్నాయి. దిగువ స్థాయి కోర్టుల్లో 35% పోస్టులు ఇంకా భర్తీకాలేదు. విచారణాసంస్థలు వృత్తిపరంగా నాణ్యమైన, నిష్పక్షపాత విచారణ జరపడంలో విఫలమవుతున్నాయి. రాజకీయ, మరేఇతర ప్రమేయాల కారణంగా విచారణలో బాధ్యతారాహిత్యం కొనసాగుతోంది. నిందితులు, సాక్షులు, బాధితుల పట్ల నేర న్యాయవ్యవస్థ చాలా సందర్భాల్లో మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. కస్టడీ మరణాలు, హింస, చట్ట విరుద్ధంగా నిర్బంధించడం, బలవంతంగా నేరాలను ఒప్పించడం, అనుచిత విచారణ, కఠినశిక్షలు వంటి ఆరోపణలను నేర న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్నది.

**కాలం చెల్లిన చట్టాలు, విధానాలు**

1860 ప్రాంతంలో నాటి బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, విధానాలే ఇప్పటికీ అమలవుతున్నాయి. ఇవి పాతబడిపోవడమే కాదు, ఇప్పటికాలానికి ఎంతమాత్రం తగినవి కావు. సైబర్ నేరాలు, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, మూకహింస వంటి నేరాలకు ఈ చట్టాల్లో ఏ విధమైన శిక్షలు లేవు. పోలీసులు-ప్రజల మధ్య సంబంధాలు ఎంతమాత్రం సంతృప్తికరంగా లేవని రెండో ఏఆర్‌సీ స్పష్టం చేసింది. అవినీతి, అసమర్థత, స్పందన లేనితనం నిండివున్న పోలీసులను కలవడానికి ప్రజల్లో సుముఖత వ్యక్తం కావడంలేదు.

**వివిధ కమిటీల సిఫారసులు**

రాజకీయ నాయకులు, నేరగాళ్లు, బ్యూరోక్రాట్లు, సంఘ విద్రోహశక్తుల మధ్య అనైతిక సంబంధాలు నెలకొన్న నేపథ్యంలో, అ సమస్యను పరిష్కరించేందుకు, అన్ని కోణాల్లో సమాచారాన్ని సేకరించే ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఓహ్రా కమిటీ (1993) సిఫారసు చేసింది. నేర న్యాయ వ్యవస్థలో సమూల మార్పుల కోసం మలిమాథ్ కమిటీ (2003) కొన్ని సిఫారసులు చేసింది. "సామాజిక సంక్షేమ నేరాలు" పేరుతో కొత్తతరహా నేరాలను ప్రవేశపెట్టాలి. కొద్దిపాటి జరిమానాలు, సామాజిక సేవ వంటి శిక్షలు విధించేందుకు ఇది అవసరం. ప్రస్తుత 'ప్రతిస్పర్థి వ్యవస్థ' స్థానంలో 'మిశ్రమవ్యవస్థ'ను తీసుకురావాలి. అంటే సాక్ష్యాధారాల సేకరణ, సాక్షుల విచారణలో న్యాయమూర్తులు కూడా చురుగ్గా పాలుపంచుకునేలా చేయాలి. నేర నిరూపణకు ప్రస్తుతం ఉన్న ప్రామాణిక రుజువు స్థాయిని తగ్గించాలి. అంటే "ఎటువంటి అనుమానాలకు తావులేకుండా" అనే దాని నుంచి "స్పష్టమైన, నమ్మదగిన సాక్ష్యం" అనే స్థాయికి మార్పు చేయాలి. సీనియర్ పోలీసు అధికారి ఎదుట నేరాంగీకారాన్ని సాక్ష్యంగా పరిగణించవచ్చు. ఇవన్నీ ఈ కమిటీ చేసిన సిఫారసులు. నేర న్యాయంపై ఒక జాతీయ ముసాయిదాను రూపొందించేందుకు మాధవ్ మీనన్ కమిటీ (2007) ఏర్పాటైంది. నేరన్యాయంలోని ప్రతి దశలో మానవహక్కులు,



మానవ మర్యాదకు ఎటువంటి భంగం వాటిల్ల కూడదు. శిక్షించడం కంటే, నేరం వల్ల కలిగిన హానిని ఏ విధంగా సరిచేయాలన్నదానిపై దృష్టి కేంద్రీకరించాలి. పోలీసు, న్యాయవ్యవస్థ, ప్రాసిక్యూషన్ వంటి సంస్థల మధ్య మరింత సమన్వయం అవసరమని తన సిఫారసుల్లో కమిటీ స్పష్టం చేసింది. ఎన్.కె. సింగ్, ప్రకాశ్ సింగ్ అనే ఇద్దరు మాజీ పోలీసు అధికార్లు పోలీసు సంస్కరణలు అవసరమని పేర్కొంటూ, సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సర్వోచ్ఛ న్యాయస్థానం 2006లో పోలీసు సంస్కరణలపై ఏడు నిర్దేశాలను జారీ చేసింది. అవి వరుసగా పోలీసుల పనితీరును మూల్యాంకనం చేసి తగిన విధానాల రూపకల్పనకు ఒక రాష్ట్రస్థాయి సెక్యూరిటీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట కాలపరిమితితో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నియామకం జరగాలి. దర్యాప్తును చట్టాన్ని వేరుచేయాలి. దీనివల్ల దర్యాప్తు వేగం పుంజుకోవడమే కాదు ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పడతాయి. అధికార దుర్వినియోగం, ప్రవర్తన సరిగ్గా లేని పోలీసులపై విచారణ జరిపేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పోలీసు ఫిర్యాదు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి.

**నూతన సంస్కరణల ప్రాముఖ్యత**

ఇప్పటివరకు అత్యంత సంక్లిష్టంగా, కాలం చెల్లిన నేర చట్టాలను ఆధునికీకరించి మరింత సరళీకృతం చేయడం కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణల ప్రధాన లక్ష్యం. ఇప్పటివరకు తీవ్రమైనదిగా పరిగణించిన ఐపీసీ 124ఎ సెక్షన్‌ను తొలగించారు. ముఖ్యంగా ప్రభుత్వ విమర్శకులు, అసమ్మతివాదులపై దీన్ని ప్రయోగించారన్న విమర్శ ఉంది. కొత్తగా ఉగ్రవాదం, అవినీతి, మూకదాడులు, వ్యవస్థీకృత నేరాలు వంటివాటిని చేర్చారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న చట్టాలు ఈ నేరాలను సమగ్రంగా నిర్వచించలేదు.

ఇప్పటివరకు అత్యంత సంక్లిష్టంగా, కాలం చెల్లిన నేర చట్టాలను ఆధునికీకరించి మరింత సరళీకృతం చేయడం కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణల ప్రధాన లక్ష్యం. ఇప్పటివరకు తీవ్రమైనదిగా పరిగణించిన ఐపీసీ 124ఎ సెక్షన్‌ను తొలగించారు. ముఖ్యంగా ప్రభుత్వ విమర్శకులు, అసమ్మతివాదులపై దీన్ని ప్రయోగించారన్న విమర్శ ఉంది.




మహిళలతో పాటు పురుషులు, ట్రాన్స్‌జెండర్లను కూడా లైంగిక నేరాల్లో బాధితులుగా చేర్చడం ద్వారా లింగతాటస్థ్యాన్ని పాటించినట్లయింది. ఎలక్ట్రానిక్, ఫోరెన్సిక్ సాక్ష్యాలను దర్యాప్తు, విచారణ, తీర్పు చెప్పే సమయాల్లో మరింత ఎక్కువగా ఉపయోగించడానికి వీలవుతుంది. నేరం జరిగిన ప్రదేశంతో సంబంధం లేకుండా పౌరులు ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేసే వెసులుబాటు కలుగుతుంది. పౌరుల రాజ్యాంగ హక్కులకు ఈ సంస్కరణలు మరింత రక్షణ కల్పిస్తాయి. ముఖ్యంగా జీవించే హక్కు, స్వేచ్ఛ, మర్యాద, గోప్యత, పారదర్శక విచారణకు ఈ సంస్కరణలు వీలుకల్పిస్తాయి.

**విస్తృత చర్చకు స్థానం లేదు**

ఈ బిల్లుల ముసాయిదాను క్రిమినల్ లా రీఫార్మ్స్ కమిటీ–2020 రూపొందించింది. ఈ కమిటీలో న్యాయవ్యవస్థ, బార్, పౌరసమాజం, ఉపాంత వర్గాలకు ప్రాతినిధ్యం లేదు. ఈ బిల్లు ముసాయిదాకు సంబంధించి విస్తృత చర్చ జరగలేదు. కేసుకు సంబంధించిన నిందితులు, సాక్షులు, బాధితులు, భాగస్వాములపై మానవహక్కుల ఉల్లంఘన జరిగే అవకాశాలున్నాయి. ఉదాహరణకు భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) బిల్లులో "భారత సమగ్రత, ఐక్యత, సార్వభౌమాధికారానికి ప్రమాదం వాటిల్లినప్పుడు" అనే నేరాన్ని సెక్షన్–150 కింద చేర్చారు. ఐపీసీలోని 124ఎ సెక్షన్‌లో పేర్కొన్న "రాజద్రోహం" కింద వివరించిన నేరాలను ఇవి సరిపోలి ఉండటం గమనార్హం. వాక్‌స్వాతంత్ర్యాన్ని దెబ్బతీయడానికి ఈ సెక్షన్‌ను దుర్వినియోగం చేసే అవకాశాలున్నాయని ప్రతిపక్షాల ఆరోపణ. అదేవిధంగా భారతీయ సాక్ష్య బిల్లు (బీఎస్‌బీ)–2023లో "ఒక పోలీసు అధికారి ఎదుట నేరాంగీకారాన్ని సాక్ష్యంగా పరిగణించవచ్చు" అని సెక్షన్ 27ఎలో పేర్కొన్నారు. దీనివల్ల కస్టడీ హింస మరింత పెరిగి ఇది దుర్వినియోగం అయ్యే అవకాశాలున్నాయి.

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు–2023, పోలీసులు అరెస్ట్ చేయడానికి విపరీతమైన అధికారాలు కల్పిస్తోంది. న్యాయవ్యవస్థ పర్యవేక్షణ లేదా మరే ఇతర పరిరక్షణలు లేకుండానే పోలీసులు తనిఖీలు, స్వాధీనం, నిర్బంధించడం వంటి చర్యలకు పూనుకోవచ్చు. బిల్లులో పేర్కొన్న అంశాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఉదాహరణకు నేర నిర్ధారణకు రుజువుగా బీఎస్‌పీ సరికొత్త ప్రమాణాన్ని పేర్కొంది. "ఏవిధమైన అనుమానాలకు తావులేని విధంగా" స్థానంలో "స్పష్టమైన, విశ్వసించదగ్గ సాక్ష్యం" అనే పదాలను బిల్లులో చేర్చారు. అయితే వీటికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. "సామాజిక సంక్షేమ నేరాలు" పేరుతో సరికొత్త నేరాలను బిఎన్ఎస్ఎస్‌లో చేర్చారు. అయితే ఈ కేటగిరీలోకి ఏఏ నేరాలు వస్తాయన్నది వివరించలేదు. వీటన్నింటికి సమాధానాలు కేవలం విస్తృత చర్చ ద్వారా మాత్రమే లభిస్తాయి. ఏదైనా ఒక వ్యవస్థలో మార్పు తీసుకొని రావాలంటే పారదర్శకమైన చర్చ అత్యంత అవసరం. అది జరగక పోవడమే ఇక్కడ ప్రధాన లోపమని అంగీకరించాలి. ఈ నేపథ్యంలో పోలీసులకు తగినంత శిక్షణలేమి, ఆరకొర సదుపాయాలున్న ఇళ్లు వంటి సమస్యలకు ఇప్పటికీ పరిష్కారంలేదు. పోలీస్ స్టేషన్లలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం, సర్వసాధారణ విషయం. నూతన చట్టాల నేపథ్యంలో పోలీసు సిబ్బందిపై మరింత ఒత్తిడి పెరుగుతుంది. భవిష్యత్తులో నేర న్యాయ చట్టాల రూపకల్పనకు, ప్రస్తుత బిల్లులు సంభావ్య ఆధారాన్నిస్తాయనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. ★





# వినదగు నెవ్వరు చెప్పిన...

2024 జనవరి 4న ఉన్నత న్యాయస్థానం తన కింది న్యాయస్థానం ఇచ్చిన ఒకానొక తీర్పును పునఃపరిశీలించబోతున్నది. గౌరవనీయులు న్యాయ మూర్తులు అభయ్ ఎస్ ఓ.కా, పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం, కోల్‌కత్తా హైకోర్టు అటు మైనర్, ఇటు మేజరు కాని యువతీయువకుల లైంగిక సంబంధం గురించి ఇచ్చిన తీర్పును సమీక్షించడానికి ముహూర్తం కూడా

సదరు హైకోర్టు న్యాయమూర్తి దోషిని విడుదల చేస్తూ, నైతిక విలువల గురించి ప్రస్తావించడం అప్రస్తుతంగా, అనవసరంగా పైకోర్టు భావించడం వల్లే ఇలాంటి పరిస్థితి ఎదురయింది. రాజ్యాంగ సూత్రం 21 ప్రకారం హైకోర్టు, యవ్వన దశలోని యువత రాజ్యాంగ హక్కును ఉల్లంఘించిందని, స్థానిక న్యాయ స్థానం లైంగిక నేరానికి విధించిన శిక్షను రద్దు చేసిందని సుప్రీంకోర్టు ధర్మాసనం కన్నెర్ర చేసింది.

ఒక విధంగా హైకోర్టు తీర్పు మెచ్చుకోదగ్గదిగానే పామర దృష్టికి కనిపిస్తున్నది. శీల పరిరక్షణ గురించి చేసిన వ్యాఖ్యానం పక్కనపెడితే, తెలిసీ తెలియని వయసులో ఆ యువతీ యువకులు చేసిన తప్పును విశాల దృక్పథంతో మన్నించి అంతకుముందు కింది న్యాయస్థానం ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. చిత్రం ఏమిటంటే, ఏలినవారి న్యాయస్థానం ఒకవైపు హక్కుల పరిరక్షణ అంటూ, మరోవైపు మానవతా దృక్పథంతో హైకోర్టు చేసిన నిర్ణయాన్ని అభిశంసించడం. ఇది కూచుంటే తప్పు, నిలబడితే తప్పు అన్నట్టుగా, దానం చేసిన కోడలిని అత్తగారు తప్పు పట్టి తన ఆధిక్యతను ప్రకటించే ధోరణికి ఉదాహరణగా అనిపిస్తుంది.

నిజానికి, కోల్‌కతా న్యాయస్థానం కేవలం చట్టప్రకారం తు.చ. తప్పకుండా ప్రవర్తించడానికి బదులు, యువత భవితను కూలదోయకుండా, నాలుగు మంచి మాటలు చెప్పడం సముచితం, సమంజసం. నేరస్తులను శిక్షించడం కన్నా, వారిలో పరివర్తన కలిగే అవకాశం కల్పించడం సామాజిక బాధ్యత. సామాజిక స్పృహతో న్యాయ పరిశీలన సామాజిక ఆరోగ్యానికి, అభ్యుదయానికి, ఎంతగానో ఉపయోగపడుతుంది.

పోక్సో చట్టం కింద యవ్వన దశలో ఉన్న యువతను కఠినంగా శిక్షించడం ఎంతవరకు సమర్థనీయం అన్న ప్రశ్న ఉదయిస్తున్నది. కత్తికి రెండువైపులా పదును ఉన్నట్టు హక్కుకూ, ధన, రుణ కోణాలున్నాయి. ఒకరి హక్కు మరొకరికి ఆటంకం కాని, కష్టం కాని, కలిగించకూడదని, న్యాయ శాస్త్రజ్ఞులు హద్దులు, సరిహద్దులు నిర్ణయించారు. రాజ్యాంగంలో కొన్ని దర్శక సూత్రాలను పొందు పరిచారు. ఏ విషయంలోనైనా పారదర్శకతకు ప్రథమ తాంబూలం ఉండాలి. ప్రజలు చైతన్య వంతులుగా తమ బాధ్యతలను తెలుసుకుని, చట్టానికి కట్టుబడినప్పుడే సమాజం ఆదర్శప్రాయంగా, సుఖశాంతులతో తులతూగుతుంది.

“నీకు నీ చేతి కర్రను నీ ఇష్ట ప్రకారం ఆడించే హక్కు ఉన్నది. కాని, ఆ స్వేచ్ఛ అవతలి వ్యక్తి ముక్కుకు ప్రమాదకరంగా కూడదు” అంటాడు న్యాయవేత్త లార్డ్ యాక్టన్. కోల్‌కతా తీర్పులో చేసిన నైతిక ఉపదేశం, ప్రతి తండ్రి మనసులో కోరుకుంటున్నదే. బడిలో ఉపాధ్యాయుడు, జీవితంలో ఆచార్యుడు అదే పని చేస్తాడు. ‘బుద్ధి చెప్పువాడు గుద్దితే నేరుమా?’ అంటున్నది వేమన్న వేదం. లోకాలన్నీ క్షేమంగా, జనమంతా సుఖంగా ఉండాలని వేదం చెబుతున్నది. అక్టోబర్ 18, 2023న కోల్‌కతా హైకోర్టు తీర్పు 30.3 సూత్రం ప్రకారం గర్హనీయం అంటూ ఇలా చెప్పిందంటే, తప్పకుండా ఆలోచించవలసిందే.

‘యువతరం చీకటి నుంచి మరింత చీకట్లోకి తమ జీవితాన్ని తరలించడం మాకు అంగీకారం కాదు. యువతరం నూతన యవ్వన దశలో పరస్పరం ఆకర్షితమై స్నేహం చేయడం సహజం. లైంగిక సంబంధం పెట్టుకోవడం అనుచితం. బాధ్యతా రాహిత్యం, ప్రతి యువతికి తన శరీరాన్ని, ఆత్మాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని, కాపాడుకోవలసిన హక్కు ఉన్నది. ఒక శీలవతిగా ఎదగవలసిన బాధ్యత ఉన్నది. లైంగిక ఆకర్షణను రెండు నిమిషాల ఆనందానికి, అతీతంగా, తనను తాను నియంత్రించు కోకపోవడంవల్ల, తనదైన వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, శారీరక గోప్యత సంరక్షణను విడిచిపెట్టినందు వల్ల సమాజం దృష్టిలో చులకన అవుతుంది.’

వ్యక్తిత్వపు వికాసానికి లైంగిక అవరోధాల్ని ఆమె విశిష్టంగా భావించి, అధిగమించాలని ఆశించడం తప్పేమి కాదు. భార్యాభర్తల మధ్య కూడా ఏకపక్షంగా లైంగిక చర్య నిషిద్ధంగా భావించే ఈ నవ సమాజంలో, అవివాహిత శీల పవిత్రతను ఆకాంక్షించడంలో తప్పేమిటో అర్థం కావడం లేదు. శరీరం, మనసు, చైతన్యం– ఈ మూడింటి సంయోగమే మానవుడు. ఈ మూడు ఒకటి కన్నా మరొకటి పరిపూర్ణత్వం సాధించడానికి ఉపయోగ పడతాయి. ఆత్మసాక్షిగా, శారీరక, మానసిక, పరిణతి సాధించడానికి పాటుపడడమే మానవత్వానికి గీటురాయి. సూక్తులు, ఛలోక్తులు, నీతులు, నియమాలు ఆ దిశగా సాగడానికి పనికి వచ్చే పరికరాలు. ఎవరు చెప్పినా వినదగినవే! ★




# త్రిశంకుస్వర్గంలో టీ

**తెలంగాణలో ఉద్యోగాల కోసం చకోర పక్షుల్లా ఎదురుచూస్తోన్న నిరుద్యోగుల పరిస్థితి గత ప్రభుత్వం నిర్వాకంతో ఇంకా దీనంగానే ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎలాంటి అప్‌డేట్స్ కనిపించకపోవడం, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రక్షాళన దిశగా ప్రయత్నాలు పెద్దగా సాగకపోవడం యువకుల్లో నిరాశను నింపుతోంది. ఫలితంగా ముమ్ముందు జరగబోయే పోటీ పరీక్షల పరిస్థితి ఏమిటన్నది సందిగ్ధంగా మారింది.**

టీఎస్‌పీఎస్సీ పరీక్షలు, ఫలితాల స్పష్టత కోసం నిరుద్యోగులు ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మరో పదిరోజుల్లో గ్రూప్-2 పరీక్షలు జరగాల్సి ఉండగా..ఏర్పాట్లు చేస్తున్న సంకేతాలు మాత్రం కనిపించడం లేదు. ఫలితంగా పరీక్షలు మళ్లీ వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక, రాజీనామాలతో పాటు.. పలు పోస్టులకు సంబంధించిన పరీక్షల ఫలితాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పరీక్షలను నిర్వహిస్తుందా? లేదంటే.. జాబ్ క్యాలెండర్ వైపే మొగ్గు చూపుతుందా? అనే ప్రశ్నలు, సందేహాలు తలెత్తుతున్నాయి. మరోవైపు.. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ అదే జరిగితే.. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ, పలు పరీక్షల తేదీల ప్రకటనపై స్పష్టత కొరవడింది. గత ఏడాది వరుస నోటిఫికేషన్లు విడుదలైనా.. 2023 ఆరంభంలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో పలు పరీక్షలు రద్దయిన విషయం తెలిసిందే..! మరికొన్ని పరీక్షల తేదీలను రీషెడ్యూల్ చేశారు. అయినా.. నియామకాల ప్రక్రియ డోలాయమానంగా ఉంది. అప్పట్లో నిరుద్యోగులకు అండగా ఉండి.. పోరాటాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వ మార్పులో నిరుద్యోగుల భాగస్వామ్యం కూడా కీలకంగా నిలిచింది. సీఎం రేవంత్‌రెడ్డి వరుస సమీక్షలతో పాలనను ఉరుకులు-పరుగులు పెట్టిస్తున్నట్లే, టీఎస్‌పీఎస్సీ విషయంలో కూడా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు. గ్రూప్-2 పరీక్షకు పట్టుమని పదిరోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో.. షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందా? లేక తొలుత ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌నే కాంగ్రెస్ సర్కారు అనుసరిస్తుందా? అనే దానిపై స్పష్టత లేదు. ఒకవేళ జాబ్ క్యాలెండర్ మేరకు సర్కారు ముందుకెళ్తే.. ఫిబ్రవరి దాకా ఆగాల్సిందే. ఆలోగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వస్తే.. మళ్లీ కథ మొదటికే అని నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

ఇక, గ్రూప్-1 పోస్టులకు సంబంధించి చూస్తే.. అభ్యర్థుల భవిత కోర్టు నిర్ణయంపై ఆధారపడి ఉంది. 503 గ్రూప్-1 పోస్టుల కోసం మొదటిసారి 2022 అక్టోబరు 16న నిర్వహించిన ప్రిలిమ్స్‌ను ప్రశ్నపత్రాల లీకేజీ కారణంగా రద్దు చేశారు. 2023 జూన్‌లో రెండోసారి నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలలో లోపాలుండడంతో పలువురు అభ్యర్థులు హైకోర్టు కెక్కారు. అధికారులు పొరపాట్లు చేశారని నిర్ధారించిన కోర్టు.. పరీక్షను రద్దు చేసింది. దాంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ కేసు విచారణకు రావాల్సి ఉంది. సుప్రీంకోర్టు తీర్పును బట్టి గ్రూప్-1 పరీక్ష ఉంటుందా? రద్దవుతుందా? అనేది తేలుతుంది.

మరోవైపు.. గ్రూప్-2 వ్యవహారం చూస్తే.. షెడ్యూల్ ప్రకారం..2023 ఆగస్టు 29, 30 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు, లీకేజీ నేపథ్యంలో నిరుద్యోగుల ఆందోళనతో నవంబరు 2, 3 తేదీలకు వాయిదా వేశారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడం, నవంబరు 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ కారణంగా పరీక్షలకు బందోబస్తు కుదరదని పోలీసుశాఖ పరోక్షంగా తేల్చిచెప్పడంతో ఆ పరీక్షలు 2024 జనవరి 6, 7 తేదీలకు వాయిదా వేశారు. 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా, 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. తాజా తేదీలకు కేవలం 10 రోజుల వ్యవధే ఉంది. ప్రశ్నపత్రాల తయారీ విషయాన్ని పక్కనపెడితే.. పరీక్ష కేంద్రాల ఎంపిక, హాల్‌టికెట్ల జారీకి కూడా సమయం పెద్దగా లేదు. దీంతో.. ఆ పరీక్ష మళ్లీ వాయిదా పడే సూచనలు కనిపిస్తున్నాయి.

అటు.. టీఎస్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్-3, గ్రూప్-4 ఫలితాలయితే వత్తా లేకుండా ఓయాయి. 1,363 గ్రూపు-3 పోస్టుల నియామకానికి గత ఏడాది నోటిఫికేషన్ విడుదలైనా.. ఇప్పటికీ




# ఎస్పీఎస్సీ భవితవ్యం!

సుజాత గోపగోని, 6302164068

పరీక్షలను ప్రకటించలేదు. ఈ పోస్టులకు 5.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇక లీకేజీ కారణంగా డివిజనల్ అకౌంట్స్ అధికారి ఉద్యోగాల పరీక్షలు రద్దయినా, తదుపరి పరీక్షల తేదీని ప్రకటించలేదు. అలాగే, 8,039 గ్రూప్-4 పోస్టుల కోసం పరీక్షలను నిర్వహించారు. గ్రూప్-1 మాదిరిగా తప్పులు చేయకుండా.. నిర్వహణలో లోటుపాట్లు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఫైనల్ కీని కూడా ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫలితాల విడుదలను టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసింది. అయితే.. డిసెంబర్10, 2023న ఫలితాలను విడుదల చేస్తామంటూ ప్రకటన వెలువడ్డా.. ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి కోర్టులో కేసు కొనసాగుతుండడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

వీటితో పాటు.. మరికొన్ని పోస్టుల విషయంలోనూ ఫలితాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. 71 లైబ్రేరియన్ పోస్టులు, 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, 1392 జూనియర్ లెక్చరర్ల పోస్టులు, 833 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు, 185 వెటర్నరీ సర్జన్ల పోస్టులు, 175 టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ పోస్టులు, 22 ఉద్యాన అధికారుల పోస్టులతో పాటు అకౌంట్స్ ఆఫీసర్స్, పాలిటెక్నికల్ లెక్చరర్లు, భూగర్భ అధికారులు, ఏఎంవీఐ, వ్యవసాయ అధికారుల పోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించినా.. ఫలితాలను పెండింగ్‌లో పెట్టారు.



గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

ఇప్పటికే నిర్వహించిన పరీక్షల ఫలితాలు, నిర్వహించాల్సిన పరీక్షల షెడ్యూల్‌పై టీఎస్‌పీఎస్సీ స్పష్టత ఇవ్వడం లేదు. ఒక పక్క చైర్మన్, సభ్యుల రాజీనామాలతో టీఎస్‌పీఎస్సీలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మరో 10 రోజుల్లో గ్రూపు-2 పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నా, అందుకు కమిషన్ సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఈ పరీక్షలను నిర్వహించాలంటే.. ఇప్పటికే ప్రశ్నపత్రాలకు తుది రూపునివ్వడం, హాల్‌టికెట్ల జారీ, సెంటర్ల ఏర్పాటు వంటి చర్యలను తీసుకోవాలి. మరో పక్క ప్రభుత్వం కూడా కమిషన్ విషయంలో ఒక నిర్ణయానికి రావడం లేదు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాల భర్తీ షెడ్యూల్ ఫిబ్రవరి నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. పాత, కొత్త నోటిఫికేషన్లపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందన్న అంశంపై నిరుద్యోగుల్లో చర్చలు సాగుతున్నాయి.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి, సభ్యులు లింగారెడ్డి, కారెం రవీందర్‌రెడ్డి, ఆర్.సత్యనారాయణ రాజీనామాలను గవర్నర్ డా॥తమిళిసై సౌందర రాజన్ గారు ఇంకా ఆమోదించలేదు. కోట్ల అరుణ కుమారి, సుమిత్ర ఆనంద్ మాత్రం సభ్యులుగా కొనసాగుతున్నారు. రాజీనామాలు ఆమోదం పొందకపోవడంతో కమిషన్ మనుగడలో ఉన్నట్లా..? లేనట్లా..? అనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి. గవర్నర్ మరికొంతకాలం రాజీనామాలను పెండింగ్‌లో పెడితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. గవర్నర్ నిర్ణయం తీసుకునేవరకు టీఎస్‌పీఎస్సీ కార్యకలాపాలు స్తంభించి పోతాయా? అనే చర్చ జరుగుతోంది. గవర్నర్ ఆ రాజీనామాలను పెండింగ్‌లోనే పెడితే.. ప్రభుత్వం ముందు ప్రత్యామ్నాయం ఉందని నిపుణులు చెబుతున్నారు. టీఎస్‌పీఎస్సీలో చైర్మన్ సహా.. మొత్తం 11 మంది సభ్యులు ఉండాలి. చైర్మన్, ముగ్గురు సభ్యులు రాజీనామా చేయగా.. ఇద్దరు సభ్యులు కొనసాగు తున్నారు. మరో ఐదు పదవులు ఖాళీగానే ఉన్నాయి. ఈ ఐదు పదవులను భర్తీ చేసి.. వారిలో ఒకరిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించవచ్చని నిపుణులు వివరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆ అంశం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులు తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నారు. ఎన్నో ఆశలతో పట్టభద్రులైన వారు ఏళ్ల తరబడి ఖాళీగా ఉంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయకపోవడం, ప్రైవేటు ఉద్యోగాలు కూడా రాకపోవడం వీరిని కుంగదీస్తోంది. చిన్నచితకా ఉద్యోగాలతో కొందరు బతుకు వెళ్లదీస్తుంటే, మరికొందరు పక్కనున్న హైదరాబాదు, బెంగుళూరు, చెన్నైలకు ఉపాధి కోసం వలస పోతున్నారు. ఎక్కడకూ వెళ్లలేని వారిని పోషించలేక తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఒక్కో ఇంటిలో కనీసం ఒకరిద్దరు డిగ్రీ చదివినవారు ఖాళీగా ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవ్యథకు గురవుతున్నారు. తమ పార్టీ అధికారంలో వస్తే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తానని హామీ ఇచ్చిన వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని నిరుద్యోగులు ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు. జాబ్ క్యాలెండర్ల జాడ లేదు...డీఎస్సీ మాటే లేదు... పోలీసు కానిస్టేబుళ్ల భర్తీ ఎప్పుడో తెలీదు. గ్రూప్-1, 2 కొలువుల భర్తీకి ఎన్నికలు అడ్డువచ్చే పరిస్థితి. సాఫ్ట్‌వేర్ రంగంలోకి తీసుకోకపోవడం, కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది.



# ఉపాధి నాస్తి... వల

గ్రాడ్యుయేట్లలో 24 శాతం నిరుద్యోగ రేటుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే అంశం. పట్టభద్రుల్లో నిరుద్యోగిత జాతీయ సగటు కంటే రాష్ట్రంలో 11 శాతం అధికంగా ఉంది. వెనుకబడిన బీహార్ రాష్ట్రం కూడా ఈ విషయంలో ఏపీ కంటే మెరుగ్గా ఉంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక ఈ గణాంకాలను వెల్లడించింది. జులై 2022-జూన్ 2023 మధ్య కాలంలో నిర్వహించిన సర్వే వివరాలు తాజాగా విడుదల య్యాయి. డిగ్రీ చదువుకున్న వారిలో నిరుద్యోగిత రేటు ఏపీలో 24 శాతం ఉండగా, జాతీయ సరాసరి 13.4 శాతం. తెలంగాణ 9వ స్థానంలో, తమిళనాడు 10వ స్థానంలో నిలిచాయి. కర్ణాటక రాష్ట్రంలో జాతీయ సగటు కంటే తక్కువగా 9.4 శాతమే నిరుద్యోగిత ఉంది. గ్రాడ్యుయేషన్ చేసిన మహిళల్లో 34.6 శాతం నిరుద్యోగిత ఉండగా.. పురుషుల్లో 20.3 శాతం. మహిళల జాతీయ సరాసరి నిరుద్యోగ రేటు 20.6 శాతం కంటే ఏపీలో 14 శాతం అధికంగా ఉంది. పురుషుల్లో జాతీయ సగటు 11.2 శాతం కాగా.. రాష్ట్రంలో నిరుద్యోగిత 9 శాతం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో పట్టభద్రుల్లో నిరుద్యోగం అధికంగా ఉన్నట్లు ప్రతి సర్వే బహిర్గతం చేస్తోంది. పట్టభద్రుల్లో నిరుద్యోగం ఎక్కువగా ఉన్నట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామీ (సీఎంఐఈ) గతేడాది విడుదల చేసిన వినియోగదారుల పిరమిడ్ల గృహ సర్వేలోనూ బహిర్గతమైంది. ఆ సర్వే ప్రకారం రాష్ట్రంలోని నిరక్షరాస్యుల్లో ఉపాధి లేనివారు 3.03 శాతంగా ఉంటే పట్టభద్రుల్లో 35.14 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు.

**నైపుణ్యాలేవి?**

యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అంటూ నాలుగున్నరేళ్ల పాటు మాటలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఇంతవరకు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయలేదు. ఇంజినీరింగ్ వారికి విశాఖలో హైఎండ్ వర్సిటీని ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పి దానినీ అటకెక్కించారు. సీమెన్స్ లాంటి నైపుణ్య కేంద్రాలను మూసేసి యువతకు నైపుణ్యాన్ని దూరం చేశారు. శిక్షణ, పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగిత పెరుగుతోంది. ఏటా 2.30 లక్షల మంది డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతరత్రా కోర్సులు పూర్తి చేస్తున్నా, వారికి తగినంతగా నైపుణ్య శిక్షణ దొరకడంలేదు. వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులు శిక్షణ కోసం రూ. వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలో ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం కావాలంటే పక్క రాష్ట్రాలకు వెళ్లిపోవాల్సి వస్తోంది. ఇక్కడ ఉద్యోగం, ఉపాధి అంటే పొరుగుసేవల ఉద్యోగం, లేదంటే చిన్నచిన్న పనులే. రాష్ట్రంలో పేరుకే నగరాలు. సాఫ్ట్వేర్ కంపెనీలు, పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సరిగా లేవు. ఫలితంగా చాలామంది వలస వెళుతున్నారు. బీటెక్, సాధారణ డిగ్రీ చదివిన వారికి తగిన ఉద్యోగాలు రాకపోవడంతో ఆన్లైన్ కోర్సులు, అదనపు అర్హతలు పెంచుకునేందుకు భారీగా వ్యయం చేస్తున్నారు.

**ఐటీకి నిరుత్సాహం**

ప్రస్తుతం ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ప్రాంగణ నియామకాలకు సాఫ్ట్వేర్ కంపెనీలు రావడం లేదు. ఈసారి బీటెక్ వారికి లభించే ఉద్యోగాలు భారీగా తగ్గిపోయాయి. సాధారణ డిగ్రీ చదువుకున్న వారి పరిస్థితి చెప్పాల్సిన పని లేదు. ఐటీ పరిశ్రమలకు ప్రోత్సాహం లేదు. కొత్తవి రాకపోగా.. ఉన్నవే రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయాయి. దీనికి కారణం రాష్ట్రంలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వాతావరణం లేకపోవడమే. విశాఖ పట్నంలో సుమారు 100 అంకుర సంస్థలు మూతపడ్డాయి. ఐబీఎం, హెచ్ఎస్బీసీ లాంటి సంస్థలు వెళ్లిపోయాయి. సిరిపురంలోని హెచ్ఎస్బీసీ కార్యాలయం, కాల్ సెంటర్లలో ఒకప్పుడు 3,500 మంది పనిచేయగా.. ఆ సంస్థ ఖాళీ చేసి వెళ్లిపోయింది. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న కంపెనీకి సగం అద్దెకే ఇచ్చేవారు. ఇంటర్నెట్, విద్యుత్తు సదుపాయం కల్పించేవారు. ఈ ప్రభుత్వం వీటిని నిలిపివేయడంతో చాలా సంస్థలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఏపీలో ఐటీ అభివృద్ధికి అవకాశం ఉన్న విశాఖ పరిస్థితే అధ్వానంగా తయారైంది. దీంతో యువత ఉపాధి కోసం వలస

టీఎన్. భూషణ్

# సలు జాస్తి

పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయవాడలో హెచ్సీఎల్, టెక్ మహీంద్ర లాంటి సంస్థలున్నా పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టట్లేదు. విశాఖ, విజయవాడ సహా రాష్ట్రంలో పెద్ద ప్యాకేజీలతో ఉద్యోగాలు ఇచ్చే సంస్థల్లేవు. పెద్ద ప్యాకేజీలు వచ్చేవారు వేరే రాష్ట్రాలకు వెళ్లడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందిన వారు తమ ఆదాయాన్ని అక్కడే ఖర్చు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు యువత వలస వెళ్లడంతో చాలా గ్రామాల్లో వృద్ధులే మిగులుతున్నారు. ఇలాగైతే రాబోయే రోజుల్లో ఊళ్లన్నీ వృద్ధులతోనే నిండి పోతాయని సామాజికవేత్తలు పేర్కొంటున్నారు.

**ఉత్తుత్తి ఉద్యోగ నోటిఫికేషన్లు !**

ఐదేళ్ల కాలంలో ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. విడుదల చేసిన ఒక్కటీ అమలు చేయలేదు. ఇప్పుడు మూడు నెలల్లో ఎన్నికలు ఉండగా హడావిడిగా ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్స్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ప్రకారం ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ పెడతారు. మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. ఇక ప్రక్రియ ఎలా కొనసాగుతుంది? ఏపీపీఎస్సీని మాజీ డీజీపీ గౌతం సవాంగ్ నడుపుతున్నారు. ఆయన ప్రభుత్వం ఏది చెబితే అది చేస్తారు తప్ప, నిజంగా ఉద్యోగాలు భర్తీ చేయాలన్న ఆలోచన చేయడం లేదు. గత ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల విషయంలో జరిగిన అవకతవకలు కోర్టు సాక్షిగా బయటపడ్డాయి. ఇప్పుడు జరగని నియామకాలకు నోటిఫికేషన్లు ఇస్తున్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అని నాటి ప్రతిపక్షనేత, నేటి సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఐదేళ్లలో కొన్ని వేల మంది టీచర్లు రిటైరయ్యారు కానీ, ఒక్కటంటే ఒక ఖాళీని కూడా భర్తీ చేయలేదు. ఒక్క డీఎస్సీ వేయలేదు. కానీ నియామకాలు జరిగే చాన్స్ లేని డీఎస్సీని కూడా త్వరలో ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు యువతను మోసం చేయడానికి ఈ నోటిఫికేషన్లు ప్రకటించినట్లు స్పష్టమవుతుంది.




ఉద్యోగ నోటిఫికేషన్‌ల జారీ కోసి నిరుద్యోగ యువత ధర్నా

**టీచర్ పోస్టుల భర్తీకి నిరుద్యోగుల ర్యాలీ, ధర్నా**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 23 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తానని ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఇచ్చిన హామీని ఇప్పటికైనా అమలు చేయాలని కోరుతూ విజయవాడ, గుంటూరు, అవనిగడ్డ, విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, శ్రీకాకుళం, ఒంగోలు, అనంతపురం, కడపలలోని డీఎస్సీ శిక్షణ కేంద్రాల అభ్యర్థులు ఇటీవల భారీ ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ వేలమంది భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటివరకు ఒక్క డీఎస్సీని నిర్వహించలేదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి పంపిస్తున్న డబ్బుతో శిక్షణ తీసుకుంటున్నామని, వైసీపీ మాట నమ్మినందుకు తమ కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ రెవిన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

**టీచర్లు లేకుండా కొత్త భాషా బోధన ఎలా?**

ఉపాధ్యాయ నియామకాలు లేకుండా బడి పిల్లలకు జపనీస్, జర్మన్ భాషలు ఎలా నేర్పుతారని డిఎస్సి అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మాతృభాషను చిన్నచూపు చూస్తూ, ఇంగ్లీషు భాషపై అసాధారణ ప్రేమను ఒలకబోసే వైసీపీ ప్రభుత్వానికి ఇప్పుడు జపనీస్, జర్మన్ భాషలపై అనురాగం కలిగింది. త్వరలో ప్రభుత్వ బడుల్లో ఆ భాషలు నేర్పుతామని ప్రకటించింది. ఆషామాషీగా ప్రభుత్వం ఈ విషయాన్ని చెప్పదని గత పరిణామా లను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఎవరికీ తెలియని ఐబీ కరికులం తెస్తామని ఇలా సమీక్షల్లో చెప్పి.. రెండు నెలల్లో ఒప్పందం చేసుకున్నారు. అసలు ఈ ఐబీ ఏమిటి? మనకు పనికొస్తుందా? అన్నది పట్టించు కోలేదు. దీని వెనుక పెద్ద స్కాం ఉందని పార్టీలు ఆరోపిస్తున్నాయి. టోఫెల్ విషయంలోనూ అంతే. అసలు టోఫెల్ ఎంత మందికి అవసరం అన్నది చెప్పలేదు. టోఫెల్ అంటే ఇంగ్లిష్ పరీక్ష మాత్రమే అన్నట్లుగా ఒప్పందం చేసుకుని సింగపూర్ సంస్థకు రూ. వందల కోట్లు చెల్లిస్తున్నారు. ఇక బైజూస్ ట్యాబ్స్ సీబీఎస్ఈ గురించి చెప్పాల్సిన పని లేదు. ఇప్పుడు జపనీస్, జర్మన్ కూడా నేర్పేందుకు ఏదో ఓ కంపెనీతో మాట్లాడుకునే ఉంటారని అన్ని లెక్కలు పూర్తయినందునే ఇప్పుడు సమీక్షలో వైసీపీ పెద్దలు ఆ మాట అన్నారని.. త్వరలో ఒప్పందాలు జరిగిపోవడం. డబ్బులు చెల్లించేయడం వంటివి కూడా ఉంటాయని అనుమానిస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. ఇక ప్రక్రియ ఎలా కొనసాగుతుంది? ఏపీపీఎస్సీని మాజీ డీజీపీ గౌతం సవాంగ్ నడుపుతున్నారు. ఆయన ప్రభుత్వం ఏది చెబితే అది చేస్తారు తప్ప, నిజంగా ఉద్యోగాలు భర్తీ చేయాలన్న ఆలోచన చేయడం లేదు. గత ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల విషయంలో జరిగిన అవకతవకలు కోర్టు సాక్షిగా బయటపడ్డాయి. ఇప్పుడు జరగని నియామకాలకు నోటిఫికేషన్లు ఇస్తున్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అని నాటి ప్రతిపక్షనేత, నేటి సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఐదేళ్లలో కొన్ని వేల మంది టీచర్లు రిటైరయ్యారు కానీ, ఒక్కటంటే ఒక ఖాళీని కూడా భర్తీవ చేయలేదు.

## కథ

సువర్చలని ఇష్టపడే, ఆ పెళ్లి సంబంధానికి వెళ్లాడు. అతనంత అతనుగా అలా వెళ్లటం, మంచి ఉద్యోగంలో ఉండటం, ఆ కుటుంబం అంతా ఎంతో సంతోషించింది.

పోతే చిన్న అడ్డొచ్చింది. సువర్చలకన్నా పెద్దది, అక్క భారతికి పెళ్లికాలేదు. పెద్దపిల్ల పెళ్లికాకుండా, చిన్నమ్మాయి పెళ్లి చెయ్యకూడదన్న సంప్రదాయం అమలులో ఉన్న రోజులవి. వాళ్ల పరిస్థితి ఏం బాగాలేదు. చాలా పేదరికం. ఆడపిల్లల పెళ్లిళ్లు చేసే శక్తి ఆ పెద్దాయనకిలేదు.

సువర్చలే నోరు తెరిచింది. “మీరు ఇలా రావటం మా అందరికీ ఎంతో సంతోషం. మా అదృష్టం. నా బదులు మా అక్కని చేసుకుంటే మాకెంతో మేలు చేసిన వారవుతారు. ఓసారి ఆలోచించండి” అంది బతిమాలుతున్నట్టు.

అవసరార్థమే సువర్చల మాట్లాడినా, చాలా తెలివిగా మాట్లాడింది అనిపించింది జగన్నాథానికి. ఒకరకంగా సువర్చల మాటలవల్లే భారతిని పెళ్లి చేసుకున్నాడు.

ఆ తర్వాత సువర్చల పెళ్లి అయిందనిపించారు. అది అంతగా అనుకూలమైనది కాదు, సువర్చలకి తగినదికాదు. అతను సువర్చలకన్నా పాతికేళ్లు పెద్ద. ఏదో కొట్లో గుమాస్తా. పట్టుమని పదేళ్లేనా కాలేదు వాళ్లపెళ్లయి. అతను పోయాడన్న వార్త ఫోన్‌లో.

పెద్దదూరం కాదు. విజయవాడ నుంచి ఏలూరు వెళ్లాలి. గంటలో చేరిపోయారు జగన్నాథం, భారతి. ఇంకా అప్పటికి కార్యక్రమం ఏం మొదలుకాలేదు. ఎవరూ ఏం కదలటంలేదు.

కాసేపటికి విషయం అర్థమైంది. జగన్నాథానికి డబ్బుసమస్య. అతని వేపు వాళ్లు



వాకాటి
పాండురంగరావు
స్మారక దీపావళి కథల
పోటీకి
ఎంపికైనది

# లోకనింద

**వి.రాజారామమోహన రావు**

పదమూడురోజులు గడిచిపోయి, కార్యక్రమాలు అయిపోయాయి. కానీ సువర్చల పరిస్థితి ఏమిటి? అన్నదే సమస్య.
ఆమె అత్తగారివేపు ఎవ్వరూ సువర్చలని తమ వెంట తీసుకెళ్లటానికి సిద్ధంగాలేరు. అదిస్పష్టంగా చెప్పేశారు.
వాళ్లలో సువర్చలని తీసుకెళ్లగలిగిన స్థోమత లేక కాదు. తమకెందుకీ తద్దినం అని.
ఇది వరకు రోజుల్లో అయితే ఓ సమిష్టి బాధ్యత ఓ ఆచారంలాగే ఉండేది. ఇలాంటి ఆడదున్నా, పసిపిల్లలున్నా, వాళ్ల పరిస్థితి ఏమిటని ఆలోచించి, ఓ పరిష్కారం చేసేవారు.

పదిమంది దాకా వచ్చారు.

సువర్చల వేపు జగన్నాథం, భారతే. తల్లీతండ్రీ సువర్చల పెళ్లయిన రెండేళ్ల లోపే పోయారు.

చివరికి వాళ్లల్లో ఓ పెద్దాయన అన్నాడు. “నాకు తెలిసిన బ్రాహ్మణ సంఘం ఒకటుంది. దిక్కులేని శవం అంటే వాళ్లే సాయం పడతారు” అని.

ఆడాళ్లు రకరకాల మాటలు మొదలెట్టారు. అనాథ ప్రేతంలా దహన సంస్కారమా? అని గొణుగుడు. సువర్చల ప్రాణం ఉన్న శవంలా ఉంది. అలా కనపడింది జగన్నాథానికి.

అంతే వెంటనే “అక్కర్లేదు. ఖర్చులు నేను పెట్టుకుంటాను. మనమే చేద్దాం” అన్నాడు.

జగన్నాథం అలా అన్నాక వాళ్లు కదిలారు. కార్యక్రమం అయి శ్మశానం నుంచి మగవాళ్లు వెనక్కి వచ్చేటప్పటికి మూడున్నరైంది.

సాయంత్రంలోపు అమ్మలక్కల సంభాషణలో మరిన్ని మాటలు దొర్లాయి.

“అతను ముందుకొచ్చాడు కాబట్టి దహనం సక్రమంగా జరిగింది” అందొకావిడ.

“ఎందుకురాదు. మరదలి మీద చావని మోజు” అంది మరోపెద్దనోరావిడ.

ముందు సువర్చలనే జగన్నాథం చేసుకోవాలనుకున్నాడని, తను చెప్పబట్టే భారతిని చేసుకున్నాడని బంధువర్గంలో అందరికీ తెలుసు. ఆ రోజుల్లో అదో వింతవార్త.

* * *

పదమూడురోజులు గడిచిపోయి, కార్యక్రమాలు అయిపోయాయి. కానీ సువర్చల పరిస్థితి ఏమిటి? అన్నదే సమస్య.

ఆమె అత్తగారివేపు ఎవ్వరూ సువర్చలని తమ వెంట తీసుకెళ్లటానికి సిద్ధంగాలేరు. అదిస్పష్టంగా చెప్పేశారు.

వాళ్లలో సువర్చలని తీసుకెళ్లగలిగిన స్థోమత లేక కాదు. తమకెందుకీ తద్దినం అని.

ఇది వరకు రోజుల్లో అయితే ఓ సమిష్టి బాధ్యత ఓ ఆచారంలాగే ఉండేది. ఇలాంటి ఆడదున్నా, పసిపిల్లలున్నా, వాళ్ల పరిస్థితి ఏమిటని ఆలోచించి, ఓ పరిష్కారం చేసేవారు.

ఒకవేళ బంధువులు ముందుకు రాకపోతే ఊరిపెద్దలు ఆ పనికి పూనుకునేవారు. చర్చించి ఏదోదారి చూపేవారు.

ఈ రోజుల్లో ఎవరేనా పోతే, ఎలా తప్పించుకుందామా.. అని చూసేవాళ్లే ఎక్కువ.

ఎవరూ తీసికెళ్లకపోతే సువర్చలకి గడిచే అవకాశం లేదు. ఇంటి అద్దె కట్టగలిగే ఆదాయం కూడా లేదు.

ఇంత ఎక్కడేనా ఉద్యోగం చెయ్యాలి. ఉద్యోగం దొరకటం అది ఎలా ఉంటుందో, దాన్ని చెయ్య గలగటం అంత తెలిక్కాదు.

సువర్చలకి సంతానం లేదు. ఒక్క ప్రాణికోసం ఇన్ని గుంపితంపీలు.

“ఏముంది, నాలుగిళ్లల్లో పని చేసుకు బతకటమే” అందొకావిడ.

“సువర్చల పనిమనిషిగానా” అనుకున్నాడు జగన్నాథం. బ్రాహ్మణస్త్రీ, ఇంకా సంప్రదాయాను సారంగా బతుకుతున్నది. ఏ ఇంట్లోపడితే, ఆ ఇంట్లో పని చెయ్యలేదు.

మద్య, మాంసాలు అలవాటున్న ఇల్లయితే సువర్చల పనిచెయ్యలేదు.

“ఏమిటక్కా మీ అనవసర ఆలోచనలు దాని పుట్టింటి వాళ్లున్నారుగా” అంది ఇందాకటి ఆవిడ.

అది తమని ఉద్దేశించి అంటున్న మాటేనని జగన్నాథానికి తెలుసు.

“అవును. అభిమానం, ప్రేమ ఉన్న బావగారున్నాడు. వదలమన్నా వదలడు. వెర్రివాడేంటి, ఈ అవకాశం వదిలెయ్యటానికి” అంది పెద్ద నోరావిడ.

జగన్నాథానికి చురుక్కుమంది మనసు. ‘అంటే ఏం చేసినా ఈ అపవాదు క్కూడా సిద్ధంగా ఉండాలన్నమాట’ అనుకున్నాడు.

పెద్దనోరావిడ అలా అనగానే మిగిలిన వాళ్ల నోళ్లులేచాయి.

“కొంచంలో తప్పిపోయింది కానీ, అసలు సువర్చల జగన్నాథం పెళ్లాం లాంటిదే” అన్నారొకరు. “ఇప్పుడైతే ఏం పోయిందిలే” అంది ఇంకొకావిడ.

అంతా అమానుషంగా ఉంది జగన్నాథానికి. తమకి ఎలాగూ ఎవరూ లేరు. సువర్చల పోషణ భారమేం కాదు. అదీకాక అటువంటి స్థితిలో సువర్చలని ఎలా వదిలెయ్యటం.

అదేకాదు, సువర్చల మనస్థితి, తను అనుభవిస్తున్న అవమాన నరకం గురించి ఎవరూ పట్టించుకోటం లేదు అనుకున్నాడు.

చివరికి, ఇంక తట్టుకోలేక భార్య భారతిని పక్కకి తీసికెళ్లి సంప్రదించాడు.

“నాకైతే సువర్చలని మనతో తీసికెళ్లటమే మానవత్వం అనిపిస్తోంది. నలుగురు అంటున్నవి విన్నావుగా. నువ్వు తట్టుకోగలవా” అనడిగాడు.

“అది నాతోడబుట్టిందండీ, ఏ సుఖం ఎరగనిది. ఎవరేం అన్నా, ఏం జరిగినా, తీసికెళ్లిపోదాం” అంది భారతి దృఢంగా.

లోకనింద కొత్తదికాదు. అనాదిగా ఉన్నదే. దానికి దడిసి కొన్ని పనులు మానేస్తే మనుషులమే కాదు. జగన్నాథం మానుషానికి నిలబడ్డాడు. అతని సహధర్మచారిణిగా దన్నుగా నిలిచింది భారతి. ★

మూడోసారీ మోదీ సర్కారే అన్న మాట ఏనాడో రూఢి అయింది. తాజాగా సర్వేలన్నీ ఘోషించాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి దిక్కుతోచని స్థితి. కొన్ని విపక్షాలని ఏకతాటి మీదకు తెచ్చి ఐ.ఎన్.డీ.ఐ.ఏ. కూటమిని ఏర్పాటు చేసినా ప్రధాని అభ్యర్థి ఎవరో తేలడంలేదు. సీట్లు పంపకంలోనూ గందరగోళమే. ఈ పరిస్థితుల్లో కులగణన అనే తేనెతుట్టెను బిహార్ ప్రభుత్వం కదిపింది. విపక్ష కూటమి నుంచి ఇదొక ఆఖరి తుంటరియత్నం. సమాజాన్ని కులపరంగా విభజిస్తే హిందువుల ఓట్లు చీలి, బీజేపీ కుంగుతుందని విపక్షాల అంచనా. కానీ అది మొదటికే మోసమని అవి గ్రహించలేపోతున్నాయి. ఇటీవల ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ కూడా ఇచ్చింది. చిత్రంగా తాను అధికారంలో ఉన్న కర్ణాటకలోనే కులగణన వ్యవహారం బెడిసికొట్టే సూచనలు కనిపించాయి.

# కులగణన కుంపట్లో విపక్షాలు




జనగణనలో కులగణన కోసం ఇప్పటికే బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిషా, జార్ఖండ్ ముఖ్యమంత్రులు అసెంబ్లీలలో తీర్మానాలు చేసి, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచారు. కేసీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో బీసీ కులగణన చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం తెస్తామని ప్రకటించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కూడా తీర్మానాలు చేసింది. ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్, సమాజ్‌వాదీ అధినేత అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత మాయావతి సహా మిగిలిన జాతీయ రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు కులగణనకు అనుకూలంగా ఉన్నాయి. అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకు కాంగ్రెస్ సంతుష్టీకరణ రాజకీయాలు సాగించింది. ఏ వర్గానికీ ప్రయోజనం కలగలేదు. పైగా అపోహలు పెరిగాయి. కులాలను అడ్డు పెట్టుకొని హిందూ సమాజాన్ని మరింత చీల్చేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టి కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది. తాము సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పుడు చేయని కుల గణనను ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేసి తీరాలంటున్నది. ఇందులో రాజకీయ స్వార్ధాన్ని అర్థం చేసుకోవచ్చు.

**బిహార్ కులగణన, విమర్శలు**

కుల గణనలో బిహార్ ప్రభుత్వం ఒక అడుగు ముందే ఉంది. రెండు మూడేళ్లు చేసిన కులగణన సర్వేను నివేదికను ఆ మధ్య రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ వివేక్ సింగ్ విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభా దాదాపు 13.07 కోట్లు. వీరిలో అత్యంత వెనుబడిన తరగతుల (ఈబీసీ) వారు 36 శాతం. ఇతర వెనుకబడిన తరగతుల (ఓఈసీ) వారి వాటా 27.13 శాతం. కులాల వారీగా ఓబీసీ వర్గానికి చెందిన యాదవుల జనాభా అత్యధికం. మొత్తం రాష్ట్ర జనాభాలో వీరి వాటా 14.27 శాతం. ఎస్సీ జనాభా 19.7 శాతం, ఎస్టీ జనాభా 1.7 శాతంగా నమోదైంది. జనరల్ కేటగిరీ 15.5 శాతం.

అయితే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టడం వీలుకాదని కేంద్రం ప్రభుత్వం తేల్చి చెప్పిన నేపథ్యంలో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గత ఏడాది జూన్‌లో కులగణన చేపట్టనున్నట్టు ప్రకటించారు. 2023, జనవరిలో కులాల వారీ లెక్కల సేకరణ ప్రారంభమైంది. 38 జిల్లాల్లో, రెండు దశల్లో ఈ ప్రక్రియను పూర్తిచేశారు. కులగణనను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని న్యాయస్థానం కొట్టివేస్తూ సర్వేకు అనుమతించింది. దీంతో విషయం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ప్రస్తుతం ఈ అంశం సర్వోన్నత న్యాయస్థానం పరిధిలో ఉంది.

బిహార్ కులగణన ఆధారంగా ఓబీసీ రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్లు వినిపించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆ రిజర్వేషన్లు 27 శాతం. సర్వే ప్రకారం బిహార్‌లో మూడింట రెండొంతుల జనాభా వెనుబడిన తరగతులకు చెందినవారని తేలింది. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ నివేదిక వెల్లడైంది. దాంతో ఎన్నికల ప్రచారంలో ఈ అంశం అన్ని పార్టీలకు కీలకం కానుంది. కులగణన నివేదికను ఆర్జేడీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ స్వాగతించారు. ఈ గణాంకాలు అభివృద్ధి విధానాలను రూపొందించడంలో దేశానికి మార్గదర్శకంగా నిలిచి, వెనుకబడిన, పేద ప్రజలకు నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడానికి తోడ్పడుతాయని అన్నారు. ఈ సర్వేతో కులాల శాతం మాత్రమే బయటకు రాలేదని, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు సైతం తెలిశాయని ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ అన్నారు. కులగణన సర్వే నివేదిక బయటకు రాగానే బిహార్‌లో ప్రభుత్వ విద్యాసంస్థలు,

ఉద్యోగాల్లో కుల రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచే బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. దీంతో, రాష్ట్రంలో అన్ని రిజర్వేషన్లు కలిపి 75 శాతానికి చేరతాయి.

**యాదవులు, ముస్లింలకే పెద్దపీట**

బిహార్ ప్రభుత్వ సర్వే కంటి తుడుపు చర్య అని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. తాజాగా వెల్లడైన గణాంకాల పట్ల ప్రజల్లో ఎన్నో సందేహాలున్నా యని చెప్పారు. ఈ సర్వే నితీశ్, బీజేపీ ప్రభుత్వ హయాంలోనే మొదలయింది. అంటే బీజేపీ మద్దతు కూడా ఉంది. ఈ కులగణనలో యాదవులు, ముస్లింల గణాంకాలు వాస్తవాలు కావనే విమర్శలు వచ్చాయి. బిహార్ ప్రభుత్వం ఆ వర్గాలను అధిక సంఖ్యాకులుగా చూపించాలని కోరుకుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు.

దేశవ్యాప్తంగా బీసీ కేటగిరీలో వందల కులాలు ఉన్నాయి. చిన్నకులాలకు చెందిన ప్రజలు సామాజిక, ఆర్థిక తదితర కారణాలతో వారికి కేటాయించిన ఉద్యోగ, రాజకీయ అవకాశాలు అందిపుచ్చుకోలేరు. ఎందుకంటే మళ్లీ ఆధిపత్య బీసీ కులాలే ప్రయోజనాలు పొందుతుంటాయి. తెలుగు రాష్ట్రాల్లో కేవలం ఆరు బీసీ కులాలవారికే అన్ని పదవులు దక్కుతున్నాయి. భారతదేశ వ్యాప్తంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే కొన్ని ఆధిపత్య బీసీ కులాల నాయకులే బీసీలకు కేటాయించిన అన్ని స్థానాలను కైవసం చేసుకుంటున్న పరిస్థితి. దీంతో బీసీల్లోనే ఉన్న అణగారిన వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**8 శాతం జనాభాకు, 70 మంది ఎమ్మెల్యేలు**


1977 నుంచి ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని యాదవులు వంటి ఆధిపత్య బీసీ కులాలు ఎక్కువ లబ్ధి పొందుతున్నాయనేది వాస్తవం. బిహార్ జనాభాలో యాదవులు 8 శాతం. కానీ, శాసనసభలో ఆ వర్గం నుంచి 70 మంది ఉన్నారు. ఇది 26 శాతానికి సమానం. ఇది న్యాయమని ఎవరూ అనలేరు. చిన్న కులాలవారు కేంద్రీకృతం కాక పోవడంతో ఆ వర్గం నుంచి ఎమ్మెల్యేలను చేయడం అసాధ్యం. అయితే యాదవులు ఇతర ఆధిపత్య బీసీలే కుల గణనకు డిమాండ్ చేస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లో కులగణన జరిగినప్పుడు బీసీలలోని అణగారిన వర్గాలు తమను అత్యంత వెనుకబడిన తరగతులుగా వర్గీకరించాలని, ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయవచ్చు. ఒకటి నిజం. బీసీ, ఎస్సీ, ఎస్టీలలోని ఆధిపత్య వర్గాలను కులగణన బహిర్గతం చేస్తుంది. అందుకే ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లోని అనేక చిన్న పార్టీలు వెనుకబడిన కులాలు, షెడ్యూల్ కులాలను వర్గీకరించాలని డిమాండ్ చేస్తున్నాయి. చిన్న కులాల మద్దతు ఉన్న పార్టీలు తమ వర్గాల ఓట్లను సమీకరించుకుని పెద్ద పార్టీలతో పొత్తులు పెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎంపీల స్థానాలను పొందు తున్నాయి. కులగణన రికార్డుల్లో తప్పులు ఉంటాయ నేది వాస్తవం. ప్రతివారు తమ కుల జనాభా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు చూపించాలనుకుంటారు. ప్రస్తుతం కులగణన దేశవ్యాప్తంగా కచ్చితంగా నిర్వహిస్తే బీసీ వర్గాల్లో విభజన వచ్చే అవకాశం ఉంది. కాగా, ఎస్సీలలోనే మాదిగలు తమను మాలల నుంచి వేరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వర్గీకరణ ద్వారా మాత్రమే అట్టడుగున ఉన్న బీసీల అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంటుంది.

**రాహుల్ వాదన**

ఇటీవలి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ కులగణన అంశాన్ని ప్రధానంగా వాడుకున్నారు. అన్ని రుగ్మతలకు కులగణనను 'ఎక్స్ రే' అంటూ అభివర్ణించారు. ఛత్తీస్ గఢ్‌లో అయితే 'అధికారంలోకి రాగానే రెండు గంటల్లో కుల గణన చేపడతాం' అని ప్రకటించారు. వాస్తవం ఏమిటంటే, కుల గణనపై ఇండియా కూటమిలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేపట్టలేదని సమాజ్‌వాదీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో కులగణన వంకతో హిందువులను విభజించేందుకు, తద్వారా దేశాన్ని నాశనం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపణ. 'కుల గణన చేపట్టి జనాభా ఆధారంగా వనరులను పంచాలనడంలో కాంగ్రెస్ ఉద్దేశం ఏమిటి? తద్వారా ముస్లింలు, మైనారిటీల హక్కులను తగ్గించాలను కుంటోందా? దేశంలో ఎవరి జనాభా ఎక్కువగా ఉంది? అత్యధిక జనాభాగా ఉన్న హిందువులే ముందుకొచ్చి హక్కులన్నీ తమకే కావాలని డిమాండ్ చేయాలా? కాంగ్రెస్ ఆశిస్తున్నదేమిటి?' అని ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచార సభల్లో తన విధానాన్ని స్పష్టం చేశారు.

**కర్ణాటక చిక్కుముడి**

కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటకలో పరిస్థితి ఇది. దేశవ్యాప్తంగా కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించాలని డిమాండ్ చేస్తూ తాము అధికారంలో ఉన్న కర్ణాటకలో చేపట్టక పోవడంతో సొంత పార్టీ నాయకుల నుంచే వ్యతిరేకత మొదలైంది. 2017 లోనే కులాల లెక్కలు సేకరించినా, నివేదికను ఇప్పటికీ బహిర్గతం చేయలేక సతమత మవుతోంది. ఇందుకు కారణం రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా నిర్ణయాత్మక శక్తులుగా ఉన్న రెండు ప్రధాన కులాలు లింగాయత్‌లు, వొక్కలిగలు ఈ నివేదికపై అభ్యంతరాలు వ్యక్తం చేయడమే. ఓబీసీ వర్గానికి చెందిన సిద్దరామయ్య నివేదికను విడుదల చేయడానికి సుముఖంగా ఉంటే.. వొక్కలిగ సామాజిక వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు డీకే శివకుమార్ వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆరేళ్లుగా కోల్డ్ స్టోరేజిలో ఉన్న ఈ నివేదిక వెలుగు చూస్తుందా, లేదా అన్నది ప్రశ్నార్థకమైంది. నిజానికి నివేదిక లీకైంది. నివేదికలో లింగాయత్‌లు, వొక్కలిగ వంటి ప్రధాన వర్గాల సంఖ్య తగ్గిందని తేలింది. దీంతో సర్వే శాస్త్రీయంగా జరగలేదని ఈ వర్గాలు ఆరోపిస్తున్నాయి. లింగాయత్ వర్గంపై చిన్నప్పరెడ్డి కమిషన్ కులగణన నిర్వహిం చింది. దాని ప్రకారం లింగాయత్‌లు రాష్ట్ర జనాభాలో 17 శాతం. 2017 నాటి సర్వేలో ఆ సంఖ్య 14 శాతంగా ఉంది. అందుకే సర్వే శాస్త్రీయంగా జరగలేదని ఆరోపిస్తున్నారు. వొక్కలిగలవీ ఇలాంటి




1977 నుంచి ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని యాదవులు వంటి ఆధిపత్య బీసీ కులాలు ఎక్కువ లబ్ధి పొందుతున్నాయనేది వాస్తవం. బిహార్ జనాభాలో యాదవులు 8 శాతం. కానీ, శాసనసభలో ఆ వర్గం నుంచి 70 మంది ఉన్నారు. ఇది 26 శాతానికి సమానం. ఇది న్యాయమని ఎవరూ అనలేరు. చిన్న కులాలవారు కేంద్రీకృతం కాక పోవడంతో ఆ వర్గం నుంచి ఎమ్మెల్యేలను చేయడం అసాధ్యం. అయితే యాదవులు ఇతర ఆధిపత్య బీసీలే కుల గణనకు డిమాండ్ చేస్తున్నాయి.

అభ్యంతరాలే. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఈ రెండు వర్గాలు లేఖలు రాశాయి. ఆ లేఖపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా సంతకం చేయడం గమనార్హం. ఆరేళ్ల క్రితమే సిద్ధం చేసిన నివేదికను ఇప్పటికైనా బయటపెట్టకపోతే ఆ పార్టీ చేస్తున్న డిమాండ్‌కు అర్థం ఉండదు. ఇస్తున్న హామీపై జనానికి నమ్మకం ఏర్పడదు. అందుకే ఈ నివేదికను బహిర్గతం చేయక తప్పని పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడింది. కానీ ఈ నివేదికను విడుదల చేస్తే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎదురుదెబ్బలు తినక తప్పదు.



తమ రాష్ట్రంలో ఓబీసీ కులగణన నివేదిక విడుదలకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో పాటు కొందరు మంత్రులు అడ్డుపడుతున్నారని ఇటీవల స్వయానా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో వాపోవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. ఓబీసీ కులగణనకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, కర్ణాటకలో ఆ నివేదికను ఎందుకు విడుదల చేయడం లేదని రాజ్యసభలో ఖర్గేను ఉద్దేశించి బీజేపీ సభ్యుడు సుశీల్‌కుమార్ మోదీ నిలదీశారు. దీనిపై స్పందించిన ఖర్గే, 'అక్కడ అతను(డీకే) వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ మీరూ (బీజేపీ) వ్యతిరేకిస్తున్నారు. దీనిని బట్టి అగ్రవర్ణాల వారంతా అంతర్గతంగా ఐక్యంగా ఉన్నారు' అని పరోక్షంగా శివకుమార్ చర్యను తప్పుపట్టారు.

కాగా ఖర్గే వ్యాఖ్యలపై డీకే శివకుమార్ కూడా గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో ఓబీసీ కులగణన శాస్త్రీయంగా జరగలేదనే తాము తిరిగి కులగణనకు డిమాండ్ చేస్తున్నట్టు ఆయన బాహాటంగానే ఖర్గే వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. అయితే కులగణన కేంద్రం బాధ్యత అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి గుర్తు చేశారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు జాతీయ స్థాయిలో బజారున పడటంతో ఆ పార్టీకి కక్కలేక మింగలేని పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కులగణన హామీ ఇచ్చారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే కులగణన నిర్వహిస్తామని, బీసీ కులాల లెక్కలు తీస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో బీసీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వెంటనే కులగణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, బీసీ విద్యార్థులకు పూర్తి బోధన రుసుములను చెల్లించాలని ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ నాయకులు కోరారు. రిజర్వేషన్లు పెంచకుండా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. దీనిపై సీఎం రేవంత్ మాట్లాడుతూ, కులగణనపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కులాల వారీగా అధికారిక సర్వేకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. వలంటీర్లతో సంబంధం లేకుండా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ద్వారా ఈ సర్వే చేపడతారు. కులగణన అంశంలో బిహార్ దారిలో ఒడిశా కూడా ముందడుగు వేస్తోంది. ఒడిశాలో ఇప్పటికే ఓబీసీ జాబితాను నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం లెక్కగట్టింది. ఆ జాబితాను ఎప్పుడు విడుదల చేయాలా..? అని ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వెనకబడిన ఐదు ముస్లిం వర్గాలపై సర్వే చేయనున్నట్లు అసోం ఇప్పటికే ప్రకటించింది. సోషియో–ఎకానమిక్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా వారి అభివృద్ధికి పాటుపడనున్నట్లు స్పష్టం చేసింది.




**వివాహాలలో...**

ప్రస్తుతం మన సమాజంలో కులాంతర వివాహాలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి జన్మించిన పిల్లల సంఖ్యను కులగణన వెల్లడించదు. కాబట్టి, ప్రస్తుతం అవలంబిస్తున్న పద్ధతి ప్రకారం కులాంతరం వివాహం చేసుకున్నవారికి పుట్టిన బిడ్డ తన తల్లిదండ్రుల తక్కువ కులాన్ని క్లెయిమ్ చేయవచ్చు. ఇదేవిధంగా ఇక ముందు జరిగితే రిజర్వుడు కులాల సంఖ్య త్వరలోనే మరింత పెరుగుతుంది. ఎందుకంటే రిజర్వేషను కోరుకునే ఏ కుమారుడు లేదా కుమార్తె అయినా తల్లిదండ్రుల ఉన్నత కులాన్ని క్లెయిమ్ చేయరు.

ఉదాహరణకు ఒక అగ్రవర్ణ కులానికి చెందిన మహిళ షెడ్యూల్ కులానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే.. వారికి పుట్టిన సంతానం రిజర్వేషన్ల ఫలాలు పొందటానికి షెడ్యూల్ క్యాస్ట్ కావాలని కోరుకుంటారు.

**(కులగణన చరిత్ర, ఆర్ఎస్ఎస్ అభిప్రాయం.. వచ్చేవారం)**

**(కులగణన చరిత్ర, ఆర్ఎస్ఎస్ అభిప్రాయం.. వచ్చేవారం)**

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

డి. అరుణ



# పాత స్నేహాలతో కొత్త ప్రపంచం

**ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాల మధ్య సమీకరణాలు శరవేగంతో మారుతున్న క్రమం మనకు కళ్లకు కట్టినట్టు కనిపిస్తూనే ఉన్నది. నిన్నటివరకూ ఏకఛత్రాధిపత్యంతో ప్రపంచానికి సుద్దులు చెప్పిన అమెరికాకు, ఇప్పుడు స్వంత ఇంటిని దిద్దుకోవలసిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం ప్రపంచంలో కొత్త శక్తులు బలపడుతున్నాయి. ఉత్సాహంతో పరుగులు తీస్తున్నాయి. అందులో ముందు వరుసలో ఉన్నది భారతదేశమే. సర్వతోముఖాభివృద్ధిని సాధించాలనే సంకల్పంతో మోదీ ప్రభుత్వం చేపడుతున్న కార్యాలకు ఎన్ని ఆటంకాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయో, అన్ని మన్ననలూ అందుతున్నాయి.**

తమ ప్రయోజనాలకు దేశాలు ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు, భౌగోళిక ఆర్థిక రంగంలో సహకరించుకోవడానికి క్రమంగా విస్తరిస్తున్న బహుళ ధ్రువ ప్రపంచం నూతన మార్గాలను తెరుస్తున్నదన్న విశ్లేషకుల అభిప్రాయంలో నిజం లేకపోలేదు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ అని చెప్పే దక్షిణ ధ్రువంలోని దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని అంగీకరించడానికి ఇష్టపడడం లేదు. కేవలం డాలర్ మాత్రమే రిజర్వ్ కరెన్సీగా ఉండటాన్ని వారు అభ్యంతరపెడుతున్నారు. ఈ క్రమంలోనే వారు గత ఏడాది జరిగిన బ్రిక్స్ సదస్సులో వ్యవసాయ ఆన్‌లైన్ వ్యాపార వ్యవస్థను ప్రవేశపెట్టాలన్న చర్చతో పాటుగా కొత్త సభ్యులను చేర్చుకోవడం, నూతన చెల్లింపుల విధానం గురించి ప్రస్తావనకు తెచ్చారు. బ్రిక్స్ కరెన్సీ గురించి వారు చేసిన ప్రకటనలో ఇవి లేకపోయినప్పటికీ, ఇవన్నీ కూడా 2024లో జరుగనున్న బ్రిక్స్ సదస్సుకు సన్నద్ధ చర్యలుగా భావించాలి. ఈ క్రమంలోనే రానున్న ఏడాది సదస్సును నిర్వహించవలసిన బ్రెజిల్ తాము నిర్వహించలేమంటూ చేతులెత్తయ్యడంతో, ఆ బాధ్యత ప్రస్తుతం రష్యా తీసుకున్నది. ఈ నేపథ్యంలో నూతన ప్రపంచ క్రమాన్ని గురించి రష్యా అధ్యక్షుడు వ్లాదమిర్ పుతిన్ చేస్తున్న ప్రకటనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. అక్కడ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయనే విషయం అవగతమవుతోంది.

అమెరికాతో సంబంధాలలో ఏర్పడిన ఇబ్బందిని ఈ నేపథ్యంలోనే ప్రస్తావించు కోవచ్చు. భారత్ వృద్ధి చెందుతున్న వేగం అమెరికాను అసహనానికి లోను చేస్తున్నదన్న వాస్తవాన్ని కాదనలేం. నిన్నటి వరకూ ప్రతిదేశంపైనా పెత్తనం చేసిన అమెరికా, నేడు వెన్నెముకతో వ్యవహరిస్తున్న భారత్ తీరును సహించలేక పోతున్నది. కొందరు విశ్లేషకుల ప్రకారం నిజ్జర్ వ్యవహారాన్ని అంతర్జాతీయంగా వెలుగులోకి తెచ్చేందుకు కెనడాను రెచ్చగొట్టింది అమెరికాయే. ఈ విషయంలో కెనడాకు ఎటువంటి మద్దతు లభించకపోవడమే కాదు, 41మంది దౌత్య సిబ్బందిని భారత్ వెనక్కి పంపడంతో పాశ్చాత్యదేశాలన్నీ కూడా

కంగుతిన్నాయి. ఇది ఒకప్పటి భారతదేశం కాదనే విషయాన్ని తెలుసుకున్నాయి. ఆ తర్వాతే, అమెరికా స్వయంగా రంగంలోకి దిగి ఖలిస్తానీ నాయకుడు పన్నుపై హత్యాయత్నానికి భారత్ నిఘా సంస్థలు ప్రయత్నిస్తున్నాయంటూ ఆరోపణలను చేసి, ఆధారాలంటూ ఏవో చూపింది. అయితే, తమ దేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించే తీవ్రవాది ఎవరు? అది పాకిస్తాన్ అయినా, అగ్రదేశ మైనా పెంచి పోషించినా, మద్దతు ఇచ్చినా సహించేదే లేదన్న వైఖరినే భారత్ అనుసరిస్తోంది. ఈ క్రమంలోనే గణతంత్ర వేడుకలకు బైడెన్ ముఖ్య అతిథిగా రావాలంటూ మౌఖికంగా భారత్ ఇచ్చిన ఆహ్వానాన్ని ఉపసంహరించుకుని, ఇప్పుడు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాకరోన్‌ను అధికారికంగా ఆహ్వానించి, తన వైఖరిని స్పష్టం చేసింది. అమెరికా ఎస్ 400 గురించి అభ్యంతరాలు లేవనెత్తిన సమయంలో ఎఫ్ 16, ఎఫ్ 18కి బదులుగా రఫేల్ ఒప్పందాన్ని ఫ్రాన్స్‌తో చేసుకుని భారత్ తన స్వతంత్ర విధానాన్ని చాటుకుంది. రష్యాతో సంబంధాల గురించి అమెరికా ఎప్పుడు అభ్యంతరాలు లేవనెత్తినా, వెంటనే ఫ్రాన్స్‌తో సంబంధాలను పెంచుకోవడం జరుగుతున్నది. ప్రస్తుతం కేవలం రష్యాతోనే కాక ఫ్రాన్స్, యుకె, యుఎస్‌లతో సంబంధాలను పెంపొందించు కునేందుకు భారత్ వెనుకాడడం లేదు.



'రష్యా కాలింగ్! ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం!'లో ప్రసంగిస్తున్న పుతిన్

భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్ డిసెంబర్ 25 నుంచి రష్యా ఐదు రోజుల పర్యటనను కూడా ఈ నేపథ్యంలోనే చూడాల్సి ఉంటుంది. మరే దేశంతో లేనంతగా రష్యాతో ప్రజల మధ్య సంబంధాలను ముందెన్నడూ లేని స్థాయిలో పెంపొందించడం ఒక లక్ష్యంగా చర్చలు జరుగుతాయని తెలుస్తోంది. ప్రస్తుతం యుఏఈతో ఉన్నంత సన్నిహిత ప్రాంతంగా (రెసిప్రొకేటింగ్ టెరిటరీ) రష్యాను పరిగణించి, సంబంధాలను పెంచుకునేందుకు భారత్ ప్రయత్ని స్తోందని విశ్లేషకులు అంటున్నారు. అంటే, అక్కడ న్యాయస్థానాలలో తీర్పులను ఇక్కడి న్యాయ స్థానాల్లోనూ, ఇక్కడివి అక్కడ పరిగణిస్తారు. అలాగే, విద్యాసంబంధ అర్హతల విషయంలో కూడా. ఇందుకు కారణం లేకపోలేదు. రష్యా వనరుల విషయంలో అత్యంత సుసంపన్నమైన దేశం. అందుకే, ఆయుధాల విషయంలో కాక ఇతర వనరుల విషయంలో రష్యాతో వ్యాపారవాణిజ్యాలను సాగించాలని భారత్ భావిస్తోంది.

నూతన ప్రపంచ క్రమం ఏర్పడిన సందర్భంలో వనరులు, ఉత్పత్తులు అన్నవి అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకోనున్నాయి. ఇందులో రష్యా అత్యంత సుసంపన్నం కనుక దానితో సన్నిహిత సంబంధాలు మనకు అవసరం. దీని కారణంగా మాస్కో కీలకమైన నూతన మార్కెట్లతో లావాదేవీలు జరిపే అవకాశాన్ని ఇచ్చింది. ఒక రకంగా చెప్పాలంటే, స్వదేశీ ప్రయోజనాల కోసం యుఎస్, ఐరోపాలు వదిలివెళ్లిన వ్యాపారాలను అందిపుచ్చుకోవలసిందిగా భారత్‌ను కోరుతోంది. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే, ప్రస్తుతం చైనాతో ఎంతో సన్నిహిత సంబంధాలను నెరపుతున్నా, రష్యా ఈ అవకాశాన్ని భారత్‌కు మాత్రమే ఇవ్వడం.

ఈ పర్యటనలో భాగంగా, వచ్చే ఏడాది జరుగనున్న భారత్– రష్యా సదస్సు కోసం ముందస్తు చర్చలు జరుగుతున్నాయి. ప్రజల మధ్య సంబంధా లను పెంచడం, రష్యాలో వ్యాపారం చేసుకునేందుకు ద్వారాలను పూర్తిగా తెరవడం వంటి ప్రకటనలు సదస్సు అనంతరం వెలువడే అవకాశాలు ఉన్నాయి. దీని కారణంగా రష్యాతో రక్షణయేతర రంగాలలో వాణిజ్యం పెరిగిపోయే అవకాశాలు ఉన్నాయి. రక్షణ రంగంలో వ్యాపారాలు ప్రధానంగా ఫ్రాన్స్, ఇతర పాశ్చాత్య దేశాలతో పెరిగే అవకాశముంది. ఇందుకు కారణం, ఉక్రెయిన్‌తో యుద్ధంతో రష్యా తన ఆయుధాగారాన్ని పెద్ద ఎత్తున ఖాళీ చేసుకుంటోంది. అందువల్ల ప్రస్తుతం రక్షణ రంగంలోకన్నా రక్షణయేతర రంగంలో వ్యాపారమే ఇరు దేశాలకూ లాభదాయకం కానుంది. లాభాల విషయం పక్కన పెడితే, చైనాను అదుపు చేయడంలో ఇరు దేశాలూ కూడా విజయవంతం అవుతాయి. అంతేకాదు, చైనా ఒకవేళ బహుళ ధ్రువ ప్రపంచాన్ని కోరుకుంటుంటే, తమతో కలిసి కూర్చొని దానికోసం చర్చించాలన్న సంకేతాలు కూడా దీనికారణంగా వెడతాయని జియోపొలిటికల్ విశ్లేషకులు అంటున్నారు. బహుళ ధ్రువ ఆసియాకు చైనా సిద్ధంగా లేకపోతే, బహుళ ధ్రువ ప్రపంచం అనేది చైనాకు లభ్యం కాదన్నది ఒక సందేశం. ప్రపంచంలోనే అతిపెద్ద దేశాలైన భారత్, చైనాలు బహుళ ధ్రువ ఆసియాకు పునాదులు వేసి, నిర్మించకపోతే, బహుళ ధ్రువ ప్రపంచాన్ని నిర్మించడం కూడా సాధ్యం కాదు. లేదంటే, పాశ్చాత్య దేశాల ఆధిపత్యంలోనే సాగవలసి ఉంటుంది. ఇందుకోసం కలిసి కూర్చొని తమ ప్రభావ ప్రాంతాలు ఏవో స్పష్టంగా సరిహద్దులు గీసుకుంటే, ఆసియా ప్రాంతాన్ని సుసంపన్నం చేయవచ్చు.

పాత ప్రపంచ క్రమం విచ్ఛిన్నమవుతున్న విషయం పాశ్చాత్య దేశాలలోని పరిస్థితులను గమనిస్తే అవగతమయిపోతుంది. ముఖ్యంగా, అమెరికాలోని గ్లోబలిస్టులు, పాకిస్తాన్ సైన్యం, చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్న సంబంధాలు కూడా క్రమంగా బలహీనపడుతున్న వైనం కనిపిస్తున్నది. బాలాకోట్ దాడి అనంతరం పాక్ సైన్యం ప్రతిక్రియకు దిగకుండా ఊరుకోవడం కూడా వారి మధ్య బలహీనపడుతున్న సంబంధాలకు సంకేతం. ఇక, చైనాలో కమ్యూనిస్టు పార్టీ పూర్తిగా జిన్‌పింగ్ ఆధీనం లోకి వచ్చి, ఆయన పార్టీగానే మారిపోయింది. అమెరికా ప్రోద్బలంతో తాము జనాభాను కట్టడి చేసేందుకు పాటించిన ఒక జంటకు ఒకే బిడ్డ ఉండాలన్న నిబంధన కారణంగా ఇప్పుడు ఆ దేశంలో వృద్ధులు ఎక్కువ, యువత తక్కువ అయిపోయారు. అంతేకాదు, దాదాపు ఐదు దశాబ్దాల ఉత్పత్తి సమ్రాట్టుగా ఉన్నా ఆర్జించిన లాభాలు అరకొర. ఈ విషయాన్ని జిన్‌పింగ్ ప్రస్తుతం గుర్తించారు. అందుకే పిల్లలను కనమని జంటలను ప్రోత్స హిస్తున్నారు, అంతర్గత వినిమయాన్ని పెంచుకోవా లంటున్నారు, పండుగలు జరుపుకోమంటున్నారు, ఆలయాలను తెరిచి సందర్శనలు చేసుకోమంటూ చెప్తున్నారు. సాంస్కృతిక విప్లవం పేరుతో చైనాలో విధ్వంసమైన ఆలయాలను పునరుద్ధరించే పనిలో చైనా పడినట్టు కనిపిస్తోంది. ఈ పరిణామాలను గమనిస్తే అది కమ్యూనిస్టు పార్టీగా మిగిలిలేదన్న విషయం అవగతమవుతున్నది. ఇప్పుడు చైనా పూర్తిగా ఎగుమతుల నమూనాను తిరస్కరిస్తోంది. ఇవన్నీ బాగానే ఉన్నప్పటికీ, ఇరుగుపొరుగు దేశాలలోకి చొచ్చుకుపోయి ఆక్రమించుకోవడమనే బలహీనత చైనాకు బాగా ఉంది. ఈ నేపథ్యంలో రష్యా, భారత్ సన్నిహిత సంబంధాలు చైనాను నిలవరించేందుకు ఉపయోగపడగలవు.

ఈ క్రమంలోనే తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత ప్రధాని మోదీని పొగడ్తల వర్షంలో ముంచెత్తడాన్ని చూడవలసి ఉంటుంది. "ఎంత ఒత్తిడి వచ్చినా, నదురూ బెదురూ లేకుండా భారత జాతీయ ప్రయోజనాలను కాపాడుతున్న ప్రధాని మోదీ, ఇరు దేశాల మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధాలకు ప్రధాన పూచీదారు" అంటూ పుతిన్ అభివర్ణించారు. మాస్కోలో డిసెంబర్ 7-8వ తేదీలలో నిర్వహించిన 'రష్యా కాలింగ్! ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం!'లో ప్రసంగిస్తూ, 'భారత దేశానికి, భారత జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే నిర్ణయాలు, చర్యలు, కార్యకలాపాలు చేపట్టమని ఎవరైనా బెదిరించి, ఒత్తిడి చేసినా మోదీ భయపడటాన్ని నేను ఊహించలేను" అని రష్యా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్నేహ పూర్వకం కాని దేశాల నుంచి మోదీపై ఉన్న ఒత్తిడిని తాను అర్థం చేసుకోగలనని పుతిన్ అనడం వెనుక ఉన్న మర్మం, 2024లో రష్యా అధ్యక్ష ఎన్నికల్లో తాను మళ్లీ పోటీ చేస్తానని ఆయన ప్రకటించడమే.

భారత్, రష్యా మధ్య స్నేహసంబంధాలు పాతవే అయినప్పటికీ, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యాపై ఆంక్షలు విధించకపోవడమే కాక, వారి నుంచి ముడి చమురు కొనుగోలు చేయడం అన్నది రష్యాకు ఎంతో మేలు చేసింది. వారి నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు చేయడాన్ని పాశ్చాత్య దేశాలనేకం వ్యతిరేకించినా, తమ దేశ ప్రయోజనాల కోసం, తమ ప్రజల బాగోగుల కోసం కొనే తీరుతామంటూ భారత్ స్పష్టీకరించి, దానిని కొనసాగించడంవల్ల అమెరికా ఊహించినట్టుగా ఆర్థికంగా రష్యా కుప్పకూలలేదు. ఒకవైపు భారత్, మరోవైపు చైనాతో స్నేహాన్ని సమతులం చేసుకుంటూ పుతిన్ ముందుకు సాగుతున్నారు.

**స్వల్ప వివాదం?**

అయితే, ఇటీవలి కాలంలో రష్యా, భారత్‌ల మధ్య సంబంధాలు కొంత ఉద్రిక్తతకు లోనైన మాట వాస్తవం. రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌ను చెల్లింపులు చైనా కరెన్సీ యువాన్‌లో చేయమని కోరడం, అందుకు భారత్ నిరాకరించడం జరిగాయి. రష్యా నుంచి కొనుగోలు చేసిన చమురుకు దిర్హాంలు, డాలర్లు, రూపాయిల మారకంలో భారత్ చెల్లిస్తూ వస్తోంది. కాగా, అమెరికా చమురు ధరలను 60 డాలర్లకు మించ కూడదని నియంత్రించడంతో తాము ముందుగా నిర్ణయించు కున్న ధరల ప్రకారం చెల్లించేందుకు భారత్ రూపాయిలను కూడా వినియోగిస్తోంది. ఆసియా ఖండంలో బలీయమైన శక్తులుగా ఎదిగేందుకు భారత్, చైనాలు పోటీపడుతున్న సంగతి తెలిసిందే. పైగా రెండు దేశాల మధ్య నలుగుతున్న సరిహద్దు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. అందుకే, రష్యా చమురుకు యువాన్‌లో చెల్లించేందుకు అంగీకరించక పోవడమే కాదు, మీరు చమురు ఇవ్వకపోతే తాము వెనిజులా సహా వేరే దేశాల నుంచి తెచ్చుకుంటామని స్పష్టం చేయడంతో రష్యాకు ఒంటి మీద స్పృహ వచ్చినట్టు అయింది. అందుకే ఈ పొగడ్తలు అని విశ్లేషకులు అంటున్నారు.

కోల్డ్‌వార్ సమయంలోని దేశాల మధ్య సమీకరణాలు ఉద్రిక్తతతో నిండి ఉండేవి. ముఖ్యంగా ఆసియా ప్రాంతంలో పట్టుకోసం రష్యా, అమెరికాలు పోటీపడి మరీ ఈ ప్రాంతంలో భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఒకరకంగా శత్రుత్వాన్ని పెంచి పోషించాయనే చెప్పాలి. సోవియట్ యూనియన్ ఉన్న సమయంలో భారత్‌కు, రష్యాకు పోలికలు ఉన్నాయని భావించే వారు. ఇరుదేశాలలోనూ ప్రభుత్వ రంగ సంస్థలు, సోషలిజంతో ప్రభావితమైన ఆర్థిక వ్యవస్థ వంటి



రష్యా పర్యటనలో జైశంకర్

పోలికలతో పాటుగా కావలసినప్పుడు సోవియట్ ఆర్థిక సహాయం ఉండేది. ఆ కాలంలో సోవియట్ యూనియన్, భారత్ ఒక జట్టుగా ఉండగా, యునైటెడ్ స్టేట్స్-పాకిస్తాన్-చైనా మిత్రదేశాలు అయ్యాయి. అటు భారత్‌ను, ఇటు రష్యాను అదుపులో ఉంచాలన్న అమెరికా ఆరాటం కారణం గానే వ్యూహాత్మక భౌగోళిక ప్రదేశంలో ఉన్న పాక్‌ను అమెరికా దత్తత తీసుకుంది. ఇటు భారత్‌లోనూ, అటు అఫ్ఘాన్‌లోనూ చిచ్చు పెట్టేందుకు పాకిస్తాన్‌కు తోడ్పడింది. అయితే, సోవియట్ యూనియన్ పతనానంతరం నుంచి ఆసియా ప్రాంతంలో సమీకరణలు మారడం ప్రారంభమైంది. తర్వాతి కాలంలో యునైటెడ్ స్టేట్స్‌కు కూడా భారత్ దగ్గర కావడం మొదలు కాగా, రష్యా చైనా దిశగా జరగడం ప్రారంభమైంది. ఏది ఏమైనా, భారత్, రష్యాలు తమ మధ్య సంబంధాలను బాగుచేసుకోలేనంతగా చెడగొట్టుకోలేదు. ఆ విషయం తాజాగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఐదు రోజుల పర్యటన చేస్తున్న విషయం ద్వారానే అవగతమవుతుంది.

**మోదీ స్వతంత్ర విధానం**

నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ సంబంధాలలో వచ్చిన మలుపు అనూహ్యమైంది. భారత్ ప్రయోజనాల ఎదుట ఏదీ ముఖ్యం కాదనే సంకల్పం, పట్టుదలతో మోదీ వ్యూహం సాగింది. ఆ కారణంగానే నేడు భారత్ అటు రష్యాతోనూ, ఇటు యునైటెడ్ స్టేట్స్ తోనూ సమానంగా సంబంధాలను కొనసాగిస్తోంది. రష్యాతో సంప్రదాయంగా వస్తున్న ఆయుధాల వ్యాపారం తగ్గించుకొని, అమెరికా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయడమే కాదు, దేశీయంగా రక్షణ రంగంలో ఆత్మనిర్భరతకు శ్రీకారం చుట్టింది. ఇందుకు రష్యా పెద్దగా అభ్యంతరం చెప్పకపోవడానికి కారణం, దానికి కూడా భారత్ ప్రాధాన్యత తెలియడమే. చైనాతో ఉన్న సరిహద్దు వివాదం కారణంగా దానిని పూర్తిగా రష్యా నమ్మలేదు. భారత్‌తో అటువంటి సమస్యలు లేకపోవడం, దాని ఆర్థిక ఎదుగుదల, దశాబ్దాలుగా స్నేహసంబంధాలను కలిగి ఉండటం వంటి కారణాల వల్ల మన దేశం పట్ల రష్యా ఆసక్తి కనపరుస్తోంది.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన అనంతరం, ఆర్థిక ఆంక్షల పేరుతో యుఎస్, ఐరోపా దేశాలు తమ వ్యాపారాలను వదిలివేసి వెళ్లిపోయాయి. ఇప్పుడు భారతీయ కంపెనీలు ఆ వ్యాపారాలను చేపడితే బాగుంటుందనే ఆసక్తిని రష్యా చూపుతోంది. వచ్చే ఏడాది జూన్ నెలలో నిర్వహించనున్న సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరం (ఎస్‌పిఐఇఎఫ్)లో పాల్గొని, ఒప్పందాలు కుదుర్చుకుని అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో చోటు సంపాదించుకోవలసిందిగా కూడా వారు కోరుతున్నారు. తమ ప్రభుత్వాల ఒత్తిడి కారణంగా అనేక ఐరోపా, అమెరికా కంపెనీలు రష్యాను వదిలివెళ్లాయి. అవి భర్తీ చేయకుండా వదిలేసిన వినూత్న రంగాలు రష్యా ఆర్థిక వ్యవస్థలో అనేకం ఉన్నాయని, ఎస్‌పిఐఇఎఫ్ డైరెక్టర్, రాస్‌కాంగ్రెస్ ఫౌండేషన్ డిప్యూటీ డైరెక్టర్ అలెక్సీ వాల్కోవ్ పేర్కొన్నారు.

మొత్తం మీద, నూతన ప్రపంచ క్రమానికి పునాదులు వేయడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఇందుకు 2024లో భారత్, అమెరికా, రష్యా, పాకిస్తాన్‌లలో జరుగనున్న ఎన్నికలు కీలకం కానున్నాయి. పాక్‌లో భారత్‌కు అనుకూలుడైన నవాజ్ షరీఫ్, రష్యాలో పుతిన్, అమెరికాలో బైడెన్ సహా ఎవరు వచ్చినా భారత్‌లో మాత్రం మోదీ వచ్చినప్పుడే ఈ ప్రక్రియ వేగాన్ని పుంజు కుంటుందన్నది వాస్తవం. ★



ఇందిరానాథ్

విజ్ఞాన సముపార్జన. అదొక నిత్యనిరంతర కృషి. అందునా మన దేశంలో అది మరింత పరిజ్ఞాన విరాజితం.

'ఆరోగ్య సమంచితమై అమృతవృష్టి కురియించెను / కల్యాణ గుణాంకితమై కళావైభవము నించెను' అని ఏనాడో పలికింది 'జయభారతి' కర్త స్వరం.

'వివిధ రూప విద్యోన్నతి విశిష్టమై వెలయగవలె

వైద్య విద్య జనసేవా భావమ్ము వహియింపగవలె'

ఇదీ సర్వత్రా అభిమతం. ప్రత్యేకించి వైద్యానికి భారతదేశంలో తొలినుంచీ సమున్నత స్థానమే. వైద్యం ఓ అద్భుతశాస్త్రం. వైద్యులకు 'నాచురల్ ఫిలాసఫర్స్' అని పేరు. విజ్ఞానంతో పాటు సాంకేతికత వారి తీరు. సిద్ధాంతాలతో కొందరు, ప్రయోగాలతో మరికొంత మంది తమ వంతు సేవా సహాయ సహకారాలను అందిస్తూ వస్తున్నారు. వ్యాధుల నిరోధ, నివారణల కోసం వారిది అవిశ్రాంత సేవ; అదొక్కటే వారిదైన మేలిమి దోవ.

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్). ఇదే ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్. వైద్యశాస్త్రమంతటికీ పేరొందిన సమున్నత ప్రభుత్వ వ్యవస్థ, ప్రతిష్ఠాత్మక సంస్థ. సర్వస్వతంత్రం.

ఆరున్నర దశాబ్దాల పైగా చరిత్ర నిండిన దీనికి పలు ప్రాంతాల్లో దీటైన నిర్వహణలు. వైద్య సంబంధ ప్రచురణలూ అసంఖ్యాకం. ఆ ముద్రణలన్నింటి సంపాదక బృందం ఛైర్‌పర్సన్‌లలో ఒకరు ఇందిరానాథ్. అంతపెద్ద సంస్థాపరంగా, అధ్యక్షురాలి హోదాలోనూ ఎంతగానో పరిశ్రమించారు. ఆమె తెలుగు వనితామణి. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ వేదిక మీద కళకళలాడిన వైద్య నిపుణి. కేంద్ర ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కార స్వీకర్త. జనవరి తొలి పక్షంలోనే తన పుట్టినరోజు సుసందర్భం.

# సేవా సుధారసధార

**ఇం**దిరానాథ్‌ది గుంటూరు ప్రాంతం. ఉన్నత విద్యాభ్యాసమంతా దేశ రాజధాని నగరంలో సాగింది. ఆమె ఎమ్‌బీబీఎస్ అయిందీ, ఎమ్‌డీ పట్టాను సాధించిందీ ఎయిమ్స్‌లోనే! తను చదువుకున్న చోటనే, ఆ సంస్థ ప్రచురించే వాటి ఎడిటర్స్ బోర్డులోనే స్థానం సంపాదించడం అన్నింటికంటే విలక్షణం. మొదటి నుంచీ ఉన్న వైద్యవిజ్ఞానాభిరుచి, అందరికీ వైద్య సేవలందించాలన్న సేవానిరతి కలిసి ఆమెను అనతికాలంలోనే విదేశాలకు చేర్చింది. అక్కడే పరమోన్నత పట్టా స్వీకరణ.

అటు తర్వాత కూడా వైద్య సంబంధ డిగ్రీలెన్నింటినో సొంతం చేసుకున్నారు ఇందిర. ప్రతిభాశాలి, ప్రయోగశాలి అంటే తానే!

*ఇక భరింపజాలనీ భయంకరబాధ*

*చావో బ్రతుకో యొసగి ప్రోవుమయ్య*

*నీ పదాల సర్వార్పణమంటి*

*సర్వ శుభ విధాయీ!*

అని మొరపెట్టుకునేవారి ఆర్తి ముందుగా ఇందిరానాథ చెవిని సోకింది, ***'అద్భుత ఔషధంబు ఆయురారోగ్యద/మఖిల శుభకరమ్ము, ఆర్తిహరము...'*** అంటూ ముందుకు వచ్చేలా చేసింది. ఆరోగ్యమే ఏకైక భాగ్యం. అందులోనే సుఖమైనా, సంతోషమైనా. కష్టమో నష్టమో కలిగిందంటే, జీవితమంతా దుర్భరంగా మారుతుంది. సంక్లిష్ట పరిస్థితి అన్ని ఆశలనీ చెల్లాచెదరు చేసేస్తుంది. చర్మానికి, నాడీ సంబంధమైన వాటికి వ్యాధి సోకిందంటే సమస్తమూ సంక్లిష్టమే! బహుళ ఔషధ చికిత్సలు ఎంతగానో అవసరమవుతాయి.

వ్యాధి తీవ్రతను గుర్తించి, గమనించి, నిరోధించేందుకు ఎంత చేయాలో అంతా చేసేందుకు తీవ్రంగా పరిశ్రమించారు ఇందిర. శ్రమించారు. శ్రమలో అందరినీ మించారు. పూర్వ రంగంలో లండన్‌కి చేరుకున్నారు. అక్కడి వివిధ వైద్యశాలల్లో, కళాశాలల్లో పరిశోధనలెన్నింటినో కొనసాగించారు. వైద్యురాలిగా, పరిశోధక శాస్త్రవేత్తగా, పాలన నిర్వహణ ఉన్నతాధికారిణిగానూ అపార పాటవాన్ని కనబరిచారు. విదేశాల నుంచి స్వదేశానికి తిరిగొచ్చి, ఎయిమ్స్‌నే సందర్శించారు. ఆ సంస్థలోనే జీవ సాంకేతిక విజ్ఞాన బోధనకు ఆచార్యవర్యులయ్యారు. ఇదే కదా ఈ పరిజ్ఞాన సంపన్నతే కదా.... వైద్యరంగమంతటికీ ఒకానొక మూలాధారం!

**సామాజిక ఉపకారం**

బయోటెక్నాలజీ విభాగాలు అనేకం. వాటి సంపూర్ణ అధ్యయనానికే జీవితం అంకితం చేశారామె. మానవ శరీరపరంగా వ్యాపించే కంతులను సూక్ష్మ వీక్షణంతో పరిశీలించడానికి ఎంతో సమయం కేటాయించారు. ఏ వ్యాధికైనా నివారణ కన్నా, ముందుచూపు ద్వారా

నిరోధం మిన్న. అందుకు అసలు మూలాలేమిటో తెలుసుకోవాలన్నదే తన గట్టి పట్టుదల. మునుపు ఒక పరిశోధక సంస్థలో నిర్వహించిన ప్రొఫెసర్ పదవీ ఆమెకు ఎన్నో విధాలుగా ఉపకరించింది. వ్యాధి నిరోధక ప్రక్రియను విస్తారం చేయడంలో ఆ శాస్త్రకారిణి సాగించిన ప్రయోగాల పరంపరలు లెక్కలేనన్ని. అవన్నీ సత్ఫలితాలనే ఇచ్చాయి, ఇస్తున్నాయి. పరిశోధనలకే పెద్ద పీటవేసే ఆమె ఆ విధానాన్ని అన్ని విధాలా విస్తృతపరిచారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్. శాస్త్రీయతను విస్తరిస్తున్న మహా సంస్థ. పత్రికల, ప్రత్యేక రచనల ముద్రణలు తరచుగా జరుగుతుంటాయి. సదస్సులు, కార్యశాలలు, చర్చావేదికలు అనేక అంశాల మీద ఏర్పాటవుతూనే ఉంటాయి. శోధనా ప్రతిభను గుర్తించి గౌరవించడం ప్రధాన ధ్యేయం. స్థూలంగా విద్య, శాస్త్రీయత, సృజనాత్మకతలకు అపార గౌరవాదరాలు. ఈ సంస్థ నుంచే ఇందిర ఫెలోషిప్ అందుకున్నారు. అదే రీతిగా మరో వ్యవస్థగా కాలేజీ ఆఫ్ అలర్జీ అండ్ అప్లయిడ్ ఇమ్యునాలజీ ఉంది. ఇందులోనూ పరిశోధన బాధ్యతలకు ఎంపికైన ఇందిరానాథ్ తన ప్రత్యేకతను ప్రస్ఫుటపరిచారు. ఒక్క రీసెర్చి అనే కాదు పరిపాలన, నిర్వహణ రంగాల్లో సైతం తానేమిటో నిరూపించుకున్నారు.

ఏ పదవిని చేపట్టినా పూర్తిస్థాయి న్యాయం చేయడం తనకు అలవాటు. ఇండియన్ ఇమ్యునాలజీ సొసైటీలో ఉన్నారు. జాతీయ స్థాయినే అసోసియేషన్ ఆఫ్ మైక్రో బయాలజిస్ట్‌ల పరంగా కీలక విధులు నిర్వర్తించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కూడా నిర్వాహకత్వం స్వీకరించారు. తనదైన పనితీరు ద్వారా సంస్థాగత పురోగతికీ దోహదకారి అయ్యారు. మరికొన్ని వైద్యసేవల సంస్థల్లో జీవిత కాల సభ్యత్వం తీసుకున్నారు. ఎంత సహాయతత్వం నిండినా ఈ సృష్టిలో పరమోన్నత తత్వం ఒకటుందని తన ప్రగాఢ విశ్వాసం. ఈ భావనలనే అక్షరబద్ధం చేసి, క్రోడీకరించి, అవగతం చేసుకుంటే...

***'కణకణమందు నీ యునికి గంటి,***
***సుమధ్య సువర్ణ కింకిణీ***
***క్వణనములందు నీ మధురగానము వింటి;***
***విశాల సృష్టిలో అనువణువందు***
***నీ మహిమ లారసికొంటి***
***ప్రగాఢ భక్తితో ప్రణతులోనర్చుచుంటి***
***నను చాయకుమంటి దయాపయోనిధీ!'***

అనే స్తుతి పద్యం గుర్తురాక మానదు. మనల్ని, శక్తి యుక్తుల్ని మించిన తేజం ఒకటి ఉంటుందని నమ్మేవారున్నారు. ఆ మహనీయతకు పర్యాయపరంగా 'శాస్త్రీయత' నూ పరిగణించవచ్చు.

**సమన్వయ నిపుణత**

వృత్తి, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకున్నారు ఆ మహిళా శాస్త్రజ్ఞురాలు. తన మాదిరే వైద్యం, ప్రయోగాలు, పరిశోధనలు, ఉత్తమ ఫలితాలను ఇష్టపడే వ్యక్తిని ప్రేమించి పెళ్లాడారు. పలు బాధ్యతల రీత్యా వివిధ దేశాలకు వెళ్లాల్సి వచ్చినా; స్వదేశం, ఇక్కడి వాతావరణమంటేనే ఎక్కువ మక్కువ. అధ్యయనాన్ని పరిపూర్తిగా నిత్యకృత్యం చేసుకున్నారు. శోధన ఫలితాన్ని ప్రజానీకానికి చేర్చే క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి సహకారం అందుకున్నారు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యాన ఏడున్నర దశాబ్దాల కిందట రూపుదిద్దుకొన్న విఖ్యాత వ్యవస్థ అది. నూతన రీతిన వైద్య సదుపాయాల పరికల్పనే మూలధ్యేయం. ప్రాణాంతక అంటువ్యాధుల నివారణకు అంకితమైన బృందాలెన్నో అందులో ఉన్నాయి. ముఖ్యంగా కుష్టు వ్యాధి వంటివి ఇప్పటికీ ప్రజల్ని పీడిస్తున్నాయి. దాన్ని కనుగొని చికిత్స అందించటం ఇప్పుడు సులభతరంగా మారిందంటే; వైద్య పరిశోధకుల సేవలెన్నో నేపథ్యంగా ఉన్నాయనేది వాస్తవం. ఆ రీత్యా చూసినప్పుడు నాడు ఇందిరానాథ్ వంటివారు ఆరంభించి కొనసాగిస్తూ వచ్చిన ప్రయోగాలే చాలా మటుకు కారణం. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ తన మార్గదర్శక, ప్రోత్సాహక వ్యవస్థ అని పలుమార్లు ఆమె ప్రస్తావించారు కూడా. సదస్సుల నిర్వహణలో సైతం ఆమె అందెవేసిన చెయ్యి. వివిధ సందర్భాల్లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి (ఐసిఎంఆర్) సౌజన్యంతో కార్యశాలలను ఏర్పాటు చేశారు. సీనియర్ శాస్త్రవేత్తల దర్శకత్వం, యువ పరిశోధకుల ఉత్సాహం కలగలిస్తే వైద్యరంగం వర్ధిల్లుతుందని ప్రసంగ వ్యాసాల్లో ప్రస్ఫుటపరిచారు. ఇందిరకు అదే కౌన్సిల్ నుంచి





**జంధ్యాల శరత్‌బాబు**

**సీనియర్ జర్నలిస్ట్**


పురస్కృతి లభించింది. అనేక ఫౌండేషన్ల నుంచీ అవార్డులు ఏరి కోరి వరించాయి. ఎన్ని బహూకృతులు వచ్చినా అవన్నీ తన బాధ్యతలను మరింత పెంచాయని చెప్పిన వినయశీలి. దశాబ్దాల తరబడి, యువతరానికి శిక్షణనిచ్చారు. మేటి శాస్త్రకారిణిగా ప్రత్యేక పురస్కారం సొంతం చేసుకున్నారామె.

**అన్నీ చేతల్లో...**

ప్రకృతిని, పర్యావరణాన్నీ ప్రేమించే ఇందిరానాథ్ స్వస్థలంలో; పని చేసిన సంస్థల ప్రాంగణాల్లో సైతం మొక్కలెన్నింటినో పెంచారు. వృక్ష సంరక్షణ ప్రాధాన్యాన్ని చాటి చెప్పడానికి అనేక ప్రదేశాల్లో పర్యటించారు. పైగా విభిన్న క్రీడాంశాల పట్ల ప్రత్యేక ఆసక్తి ఉంది తనకు. భారతీయత, సామాజిక విలువలు, ఆచార సంప్రదాయాలను సమాదరిస్తూ వివిధ దేశాల్లో ఎన్నో ఉపన్యాసాలిచ్చారు. తాను చెప్పిన ఆదర్శాలను ఆచరణకు తెచ్చి, స్ఫూర్తిమంతంగా నిలిచే మూర్తిమత్వం ఆమెది. అటువంటి వ్యక్తిత్వాలే ఏ రంగంలోనైనా దేశ ఖ్యాతిని ప్రవర్ధితం చేస్తాయి. చేస్తూనే ఉంటాయి. శాస్త్రీయత, సేవాతత్వాల కలనేత ఆ వనిత. ★






సామాజిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, చేతులు శుభ్రపర చుకోవడం.. ఇలాంటి మాటలు మరిచిపోయి నెలలు గడిచిపోయాయి. అదంతా ముగిసిన అధ్యాయం అని అంతా భావించారు. ఇంతలోనే కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 వ్యాపిస్తోందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. మళ్లీ పాత రోజులు గుర్తుకొచ్చి చాలా మందికి వెన్నులో భయం పాకుతోంది. అదేమంత ప్రాణాంతకం కాదని, భయం అక్కరలేదని.. ఉన్న వ్యాక్సిన్లు కొత్త వేరియంట్‌ను ఎదుర్కోగలవని వైద్యనిపుణుల సలహాలు కొంత ఊరటనిస్తున్నాయి. ఈ వేరియంట్‌తో భయపడవలసిన పని లేదని అన్నారు కదా అని తేలిగ్గా తీసుకుంటే మాత్రం ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టే. అయితే, ప్రస్తుతానికి దీనికోసం అదనపు వాక్సిన్ డోస్ తీసుకోవాలసిన అవసరం లేదంటూ ఇండియా సార్స్- కోవ్-2 జెనోమిక్స్ కన్సోర్షియం (ఐఎన్ఎస్ఎసిఒజి) అధిపతి డా॥ ఎన్‌కె అరోరా ప్రకటించడం ప్రజలకు కొంత ఊరటను ఇస్తోంది.

# భయపడొద్దు.. తేలిగ్గా

కరోనా వచ్చిన కొత్తల్లోనే అది ఇప్పట్లో అంత మయ్యేది కాదని, కొంతకాలానికి శక్తిసామర్థ్యాలన్నీ ఉడిగిపోయినా మన మధ్యలోనే చిరకాలం ఉంటుందని చెప్పుకొచ్చారు. మ్యుటేషన్లతో ముప్పు తప్పదని హెచ్చరికలు చేశారు. అనుకున్నట్టు గానే కరోనాలో ఆల్ఫా, బీటా, డెల్టా, ఒమిక్రాన్ లాంటి వేరియంట్ల ప్రభావాన్ని మనం చూశాం. ఇప్పుడు వ్యాప్తిలో ఉన్నది జెఎన్1 అనే సబ్‌వేరియంట్. ఇది ఒమిక్రాన్ కుటుంబానికి చెందినది. ఒమిక్రాన్ ఒకట్రెండు ఉత్పరివర్తనాలకు లోనై జేఎన్1 ఏర్పడింది. ప్రస్తుతం శీతాకాలం నడుస్తున్నందున ఈ వైరస్ ప్రభావం విస్తృతంగా ఉండే అవకాశం ఉన్నందున దీనిపై ఓ కన్నేసి ఉంచాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. శీతాకాలంలో ఇతర వైరల్, బాక్టీరియా ఇన్ఫెక్షన్లు పెరిగే అవకాశం ఉండడంతో సార్స్-కోవ్-2 (SARS-CoV-2) కేసులు పెరిగే అవకాశం ఉందని, కనుక అత్యంత అప్రమత్తతతో ఉండాలని హెచ్చరించింది.

**ప్రపంచవ్యాప్తంగా జెఎన్1 వైరస్**

లక్సంబెర్గ్‌లో మొట్టమొదటిసారి ఈ వేరియంట్‌ను గుర్తించారు. తర్వాత రోజుల్లో అమెరికా, చైనా, బ్రెజిల్, స్పెయిన్ వంటి 35 దేశాల్లో కనిపిస్తోంది. సింగపూర్‌లో కేసులు యాభైవేలు దాటాయి.




**డాక్టర్ పార్థసారథి చిరువోలు**

సీనియర్ జర్నలిస్ట్


మన దేశంలో కేరళతో డిసెంబరు తొలివారంలో వైరస్ గుర్తింపు జరిగేనాటికే వ్యాప్తి హెచ్చుగా ఉన్న విషయం బయటకొచ్చింది. 2020లోనూ కొవిడ్ తొలి కేసు కేరళలోనే కనిపించింది. మిగతా చాలా రాష్ట్రాలకంటే వరుస వేరియంట్లతో సమర్థంగా పోరాడుతూ వచ్చిన అనుభవం కేరళ రాష్ట్ర ఆరోగ్యశాఖకు ఉంది. ఇప్పుడు కేరళలో వందలాది కేసులతో పాటు ఐదు మరణాలు కూడా నమోదయ్యాయి. వారంతా డెబ్బైయేళ్లకు పైబడినవారు, దీర్ఘకాలిక సమస్యల తోనూ, కాన్సర్ వంటి వ్యాధులతోనూ బాధపడు తున్నవారేనని ఆ రాష్ట్రం చెబుతోంది. మిగతా కొన్ని రాష్ట్రాల్లో రికార్డయిన మరణాలు కూడా ఇదేరకమైనవి కావడం వల్ల, ఈ వేరియంట్ మహా ప్రమాదకారి కాదన్న భావన వ్యక్తం అవుతోంది.

కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, గోవా, రాజస్థాన్‌లలో కొవిడ్ కొత్త వేరియంట్ జాడలు కనిపించాయి. తెలంగాణలో 12, ఆంధ్రలో 6 కేసులు నమోదయ్యాయి. ఉత్తరాఖండ్, మిజోరాం, కొన్ని రాష్ట్రాల్లో రోజువారీ కరోనా బులెటిన్ల విడుదల ప్రారంభమైంది. కేంద్ర ఆరోగ్యమంత్రి దేశవ్యాప్త పరిస్థితిని సమీక్షించారని, అన్ని రాష్ట్రాలూ సర్వసన్నద్ధమైనాయని వార్తలు వస్తున్నాయి. వ్యాప్తివేగం హెచ్చుగా ఉన్నప్పుడు వైరస్‌లు మరింత బలపడతాయన్న అభిప్రాయం ఉంది. దానికి తోడు క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకూ వరుస పండగల సీజన్ ఉండటం, శబరిమలకు రాకపోకలు ఎక్కువ కావటం వల్ల పరిస్థితి తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. బాధితుల సంఖ్య, ఆస్పత్రుల పాలయ్యే వారి సంఖ్య కూడా పెరుగుతుంది. అసలు తీవ్రత అప్పుడు మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

**కరోనాతో విలయం**

కరోనా సృష్టించిన విలయాన్ని మరిచిపోవటం అంత తేలిక కాదు. 2020 తొలిరోజుల్లో కొవిడ్–19 విపత్తు చుట్టుముట్టినప్పుడు, ప్రపంచంలో రెండో అతి పెద్ద దేశమయిన భారత్ వైరస్‌ను అదుపు చేయటంలోనూ దాని జనాభాతో పోలిస్తే మరణాల సంఖ్యను తక్కువగా ఉంచటంలో సాధించిన విజయం అసాధారణమైనది. ఇది అద్భుతమైన విషయమని అందరూ ప్రశంసించారు. కానీ ఏప్రిల్ 2021లో కొవిడ్ రెండో వేవ్ విజృంభించినప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. మే1, 2021న ఒక్క రోజులో అత్యధికమైన నాలుగు లక్షల కొవిడ్ కేసులతో ప్రపంచంలో మొట్టమొదటి దేశంగా నిలిచింది. దాంతో జనవరి 16, 2001 నుంచి సామూహిక వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టింది. అక్టోబరు మధ్య నాటికి ఒక బిలియన్ కొవిడ్ టీకాలు పూర్తిచేసి అరుదైన మైలు రాయిని సాధించింది. స్వదేశంలో తయారైన కొవాక్సిన్, కొవిషీల్డ్‌తో పాటు, రష్యా తయారు చేసిన స్పుత్నిక్ 5 టీకాలును వినియోగించింది.

అర్హులయిన 291 మిలియన్ల జనాభాలో 30 శాతం మంది పూర్తిగా రెండు డోసుల టీకాలు వేసుకున్నారు. 707 మిలియన్ల మంది మొదటి డోసు వేసుకున్నారు. అంతర్జాతీయంగా ఇదో గొప్ప ఘనవిజయం. అవసరంలో ఉన్న పేద దేశాలు, చిన్న దేశాలకు, పొరుగు దేశాలకు వ్యాక్సిన్లు పంపి కేంద్రం వసుధైవ కుటుంబకం భావనను చాటుకుంది. లక్షలాదిమంది తమ కుటుంబీకులను, ఆప్తులను, సన్నిహితులను కోల్పోయి ఒక భయానకమైన స్థితిని అనుభవించారు. ఆ గడ్డు కాలం దాటి, ధైర్యం కూడగట్టుకొని, మనసు కుదుటపడుతున్న తరుణంలో ఇప్పుడు జెఎన్–1 వేరియంట్ వ్యాపించిందన్న వార్త కలవరపరచటంలో ఆశ్చర్యం లేదు.

ఇప్పటికే వాక్సిన్లు వేసుకున్నవారి మీద,




ఇమ్యూనిటీ మెరుగ్గా ఉన్నవారి మీదా దాని ప్రభావం తక్కువేనని ఓ అంచనా. ఆయా రాష్ట్రాల్లో పరీక్షలు, ఫలితాల సంసిద్ధత ఏ స్థాయిలో ఉన్నదో పూర్తిగా బయటకు రాలేదు కానీ, ఇప్పటివరకూ వెలుగు చూస్తున్న సమాచారాన్ని బట్టి వైరస్ దేశమంతా వేగంగా విస్తరిస్తున్న మాట నిజం. శ్వాసకోశ సంబంధిత సమస్యలు హెచ్చి శీతాకాలం సహజంగానే భయపెడుతున్న తరుణంలో, పరీక్షలు పెంచడం, పాజిటివ్ వచ్చినవారికి జాగ్రత్తలు సూచించి, దూరంగా ఉంచడం, అవసరమైన పక్షంలో ఆస్పత్రుల్లో చేర్చడం వంటివి పద్ధతిప్రకారం జరగాలి.

**వైరస్ ప్రభావం ఎలా ఉండనుంది?**

ఈ నేపథ్యంలో కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వైరస్ ఎంత వేగంగా విస్తరిస్తుంది? దీని ప్రభావం ఎలా ఉంటుంది? దీనిని అదుపు చేయటానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లు సరిపోతాయా? బూస్టర్ డోసు సరిపోతుందా? ఒమెక్రాన్ ప్రబలిన సందర్భంలో దేశంలో భారీ ఎత్తున మరణాలు సంభవించాయి. ప్రతి కుటుంబం కనీసం ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయిన పరిస్థితి, తెల్లవారి లేస్తే ఎలాంటి వార్త వినవలసి వస్తుందోనన్న భయం ప్రజల్లో ఉండేది. ప్రస్తుతం ఈ సబ్ వేరియంట్‌కు అదనపు వ్యాక్సిన్లు అవసరం లేదని ఇండియా సార్స్ కోవిడ్ జినోమిక్స్ కన్సార్షియం (ఐఎన్ఎస్ఏసీఓజీ) చీఫ్ డాక్టర్ ఎన్. కె.అరోరా సూచించారు. 60 ఏళ్ల పైబడినవారికి ఇతర వ్యాధులు (కోమా ర్బిడిటీస్) బారిన పడటం వల్ల వాళ్లలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే అవకాశంవల్ల వైరస్ తీవ్రత కనిపిస్తుందన్నారు. వాళ్లు ఇప్పటికే తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరే, లేకపోతే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు.

మళ్లీ లాక్‌డౌన్ తప్పదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో దీనికి సంబంధించి కొంత విషప్రచారం సాగుతోంది. గతంలో ప్రజలు ఇబ్బందులకు గురికావటం దానికి తోడు ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావటం వంటి పరిణామాల నేపథ్యంలో, ఈ సారి లాక్‌డౌన్ లాంటి వంటి కీలక నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తీసుకోక పోవచ్చన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కరోనానుంచి ప్రపంచం పూర్తిగా విముక్తి చెందే అవకాశాలు ఇప్పట్లో లేవు. నిరంతర పరివర్తనలతో అది ఎప్పటికప్పుడు మార్పులు చెందుతూ ఉంటుంది. "ఈ విషయాన్ని విస్మరిస్తే ప్రాణాలపైకి కొని తెచ్చుకున్నట్టే" అని హెచ్చరిస్తున్నారు ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్ సైంటిస్టు డాక్టర్ సౌమ్య స్వామినాథన్. "ఇది సాధారణ జలుబులాంటిది కాదు. చాలా ప్రత్యేకమైన వేరియంట్. ప్రజలు దీనివల్ల న్యుమోనియాతో తీవ్ర అనారోగ్యానికి గురికావడమే కాదు, దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య సమస్యల బారినపడతారు" అని చెప్పారు. గుండె సంబంధ



సమస్యలతో బాధపడేవారు, స్ట్రోక్ బాధితులు, మధుమేహం, మతిమరుపు, మానసిక కుంగుబాటు, మానసిక సమస్యలు, దీర్ఘకాలిక అలసట, కండరాల నొప్పులతో బాధపడేవారు ఒక్కసారి కొవిడ్ బారిన పడితే తిరిగి మామూలు ఆరోగ్యాన్ని సంతరించుకోవడం వారి శక్తికి మించిన పని అవుతుందని, అందుకే కొవిడ్ పట్ల ఏ మాత్రం ఉదాసీనతకు చోటివ్వరాదని హెచ్చరిస్తున్నారు.

**ఆదమరిస్తే అంతే సంగతులు**

వైరస్ వ్యాప్తిని అదుపు చేయటంలో వ్యక్తిగత జాగ్రత్తలు అవసరం. ఎవరయినా ఫ్లూ లాంటి సమస్యలతో బాధపడుతుంటే రెండు మూడు రోజుల పాటు బయటకు వెళ్లకుండా నాలుగు గోడల మధ్యన గడపటం మేలు. అలాగే ఇది నయం కాని పరిస్థితి ఉంటే తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలి. సాధారణ ఫ్లూకు, కొవిడ్‌కి మధ్య తేడాను పరీక్షల ద్వారా మాత్రమే గుర్తించగలుగుతాం. ఈ అంశంలో నిర్లక్ష్య భావంతో వ్యవహరిస్తే వైరస్ వ్యాప్తికి మీరు సహకరించినట్టే. అనేక మందిని ఇబ్బందుల పాలు చేసిన వాళ్లవుతారు. పైగా కొవిడ్ బాధితులు వైద్యుల పర్యవేక్షణలో సరైన చికిత్స పొందకపోతే, అది దీర్ఘకాలం వారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోక తప్పదు. శరీరంలో గుండె, ఊపిరితిత్తులు లాంటి కీలకమైన శరీర అవయవాలను దెబ్బతీస్తుంది.

**ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు**

60 ఏళ్ల వయసుదాటిన వారు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. సామాజిక దూరాన్ని పాటించటంతో పాటు తగినంత రక్షణ లేకుండా విందులు, వినోదాలు, శుభకార్యక్రమాలకు హాజరు కాకూడదు. ఇక ప్రభుత్వం వైపు నుంచి కొన్ని చర్యలు అవసరం. నాలుగ్గోడల మధ్య పెద్ద ఎత్తున జనం గుమికూడకుండా చూడాలి. అలాగే మురికి నీటి నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండి, ఎక్కడా నిలవకుండా చూసుకోవాలి.. ఆర్టీపీసీఆర్ కిట్ల సంఖ్యను పెంచి పెద్ద ఎత్తున పరీక్షలు నిర్వహించాలి. అప్పుడే వైరస్ ఏమేరకు వ్యాప్తి చెందుతోందన్న అంచనాలు బయటకు వస్తాయి. బహిరంగ ప్రదేశాల్లో, సామూహిక కార్యకలాపాల్లో నియమాలను ఉల్లంఘిస్తున్నవారిని హెచ్చరించాలి. వ్యక్తిగత స్థాయిలో జాగ్రత్తతో పాటు, సామాజిక బాధ్యత కూడా కనబరచాలి. అప్పుడే తక్కువ నష్టంతో బయట పడటం వీలవుతుంది.

**అన్ని రకాలపై పనిచేయగల టీకా అభివృద్ధికి యత్నం**

రూపాంతరం చెందిన అన్ని రకాల కొవిడ్ వైరస్‌లపై ప్రభావం చూపగల సార్వత్రిక టీకాని అభివృద్ధి చేయవలసిందిగా కోసం ప్రభుత్వం భారత్ బయోటెక్‌ను కోరింది. ఈ కారణంగా, కొవిడ్-19కు కారణమయ్యే సార్స్-కోవ్2 (SARS-CoV-2) వైరస్‌కు సంబంధించి రూపాంతరం చెందిన,

ఉనికిలో ఉన్న స్ట్రెయిన్లను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) భారత్ బయోటెక్‌కు అందించింది. ఆల్ఫా, బీటా, గామా, డెల్టా, ఒమిక్రాన్ వేరియంట్లకు సంబంధించి ఒకటే వాక్సిన్‌ను తయారు చేయాలన్న క్రమంలో కొత్త వేరియంట్ కనిపించింది. కొత్తగా ఉద్భవిస్తున్న సార్స్-కోవ్2 (SARS-CoV-2) వైరస్‌లపై కొవిడ్-19 టీకాలు ఎంతటి రక్షణను కల్పిస్తున్నాయన్న విషయం తెలుసుకునేందుకు ఐసీఎంఆర్- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఐసిఎంఆర్-ఎన్ఐవి) క్రమం తప్పకుండా అధ్యయనాలు నిర్వహిస్తున్నది.

**కొత్త వ్యాక్సిన్ తయారీకి సీరం దరఖాస్తు**

కాగా, దేశంలోని అతిపెద్ద వ్యాక్సిన్ తయారీదారు, పుణె కేంద్రంగా పనిచేసే సీరం ఇన్ స్టిట్యూట్ జె.ఎన్-1 కోవిడ్ వేరియంట్ కోసం వ్యాక్సిన్ తయారు చేసేందుకు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంది. ఆస్ట్రాజెనెకా, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీల భాగస్వామ్యంతో 2020లో సీరం ఇన్ స్టిట్యూట్ కొవిషీల్డ్ వ్యాక్సిన్ రూపొందించిన విషయం మనకు తెలుసు. భారత్ బయోటెక్ రూపొందించిన కొవాక్సిన్ మరొకటి. ఈ రెండు వ్యాక్సిన్లు 2021 జనవరిలో కరోనా నియంత్రణకు వినియోగించుకునేందుకు ఇండియా డ్రగ్ రెగ్యులారిటీ ఆమోదం పొందాయి.



మన దేశంలో పెద్ద ఎత్తున వాటిని వినియోగించారు. దానితో పాటు ఇతర దేశాలకు కూడా మిలియన్ల కొద్దీ డోసులను ఎగుమతి చేశారు. సీరమ్ రూపొందించిన కొవిషీల్డును భారత్ బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, మాల్దీవులు, మారిషస్, ఆఫ్ఘానిస్తాన్, ఈజిప్టు, ఉక్రెయిన్, న్యూజిలాండ్ తో పాటు మరో 92 దేశాలకు పంపింది.

**వచ్చే రెండు నెలలు కీలకం**

ఇన్‌ఫ్లుయెంజాతో మన అనుభవం దాదాపు 700, 800 ఏళ్ల పైనే. కరోనాతో అనుభవం కేవలం నాలుగేళ్లే. ఇంకా ఎన్నో సరికొత్త అనుభవాలను ఎదుర్కోవలసి ఉంటుంది. రిస్క్ తప్పదు అని తెలిసినప్పుడు దానికి తగినంత సన్నద్ధత అవసరం.

రిస్క్ అనేది ప్రమాదకరం. ముందుగా దాని గురించి తెలిస్తే తప్ప సిద్ధం కాలేం అని మీరు ఎప్పుడయితే అనుకుంటారో పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. కానీ ఎప్పుడు, ఎటు నుంచి వస్తుందో తెలియకపోయినా తప్పనిసరిగా రిస్క్ ఎదుర్కోవలసి వస్తుందన్న అంచనా ఉన్నప్పుడు ఇబ్బందేమీ ఉండదు. కాలిఫోర్నియా రాష్ట్రం భూకంపాల గురించి ఎలా ఆలోచిస్తుందో అలా రిస్క్ గురించి ఆలోచించటం నేర్చుకోవాలని అమెరికన్ రచయిత, విశ్లేషకుడు మోర్గాన్ హౌసెల్ సూచించారు. "తీవ్రమైన భూకంపం సంభవిస్తుందన్న విషయం వాళ్లకు తెలుసు. కానీ అది ఎప్పుడు? ఎక్కడ? ఎంత తీవ్రత అన్న విషయం మాత్రం తెలియదు. ముందస్తు హెచ్చరికలు ఏమీ లేకుండానే అత్యవసర సిబ్బంది నిరంతరం సిద్ధంగా ఉంటారు. భవన నిర్మాణాలను శతాబ్దమో, అంతకంటే ఎక్కువ కాలమో భూకంపాలను తట్టుకునే రీతిలో సాగుతూంటాయి". దేశవ్యాప్తంగా ఇప్పుడిప్పుడే జె.ఎన్-1 ఒకేసులు పెరుగుతున్నాయి. ఇప్పుడు ఉన్న అంచనాల మేరకు ఒమిక్రాన్ మాదిరిగా ఒక్కసారిగా వైరస్ ఉద్ధృతంగా పెరిగి తర్వాత దానికదే చప్పున చల్లారిపోతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే రాబోయే రెండు నెలలు కీలకం. మనం ఎంత అప్రమత్తంగా ఉంటామో అంతగా ఇబ్బందుల నుంచి బయటపడతాం. ★

# ఆహ్వానాలు.. మూతి విరుపులు

డిసెంబర్ 25న అయోధ్యలో ఉన్న ప్రతి ఇంటికి బుజ్జి బుజ్జి సీతారాములు వచ్చి కొత్త ఆలయంలో ప్రతిష్ఠ కార్యక్రమం ఉంది, తప్పక రావలిసిదంటూ పిలిచి వెళ్లారు. అలా పిల్లలకు సీతారాముల్లా ముస్తాబు చేసి ప్రతి ఇంటికి పంపించి పిలిచారు, నిర్వాహకులు. అంతేకాదు, దేశంలోని ప్రముఖులకు కూడా చాలా ముందే పిలుపులు వెళ్లాయి. సినిమా నటులు, క్రీడారంగ ప్రముఖులు, ఇతర రంగాల వారిని కూడా ట్రస్ట్ పిలిచింది. అయోధ్య ఉద్యమానికి ఇంత ఊపు తెచ్చిన మహానేత లాల్‌కిషన్ అద్వానీకీ, బీజేపీ మాజీ అధ్యక్షుడు ఎంఎం జోషికి కూడా పిలుపులు వెళ్లాయి. కానీ వారు రాకపోవచ్చు. కారణం వయసు. అయోధ్య ఆలయ నిర్మాణ ఉద్యమం ఎందుకు చేపట్టవలసి వచ్చిందో అద్వాని 2004లోనే చెప్పారు. ఆలయ నిర్మాణ కార్యక్రమంలో బీజేపీ భాగస్వామి కావడం కేవలం మతానికి సంబంధించిన అంశం కాదు. కాంగ్రెస్ కపటత్వం కారణంగా, సెక్యులరిజం మీద దేశంలో చర్చను రేకెత్తించడమే మా పార్టీ ఉద్దేశం' అన్నారాయన. దానినే అద్భుతంగా నిర్వహించగలిగారు.



అద్వాణి, ఎంఎం జోషి

జనవరి 22న అయోధ్యలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠకు రావలసిందని దేశంలోని అన్ని పార్టీలను తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆహ్వానించింది. సోనియా, మల్లికార్జున ఖర్గేలకు కూడా ఆహ్వానాలు వెళ్లాయి. అన్నట్టు కమ్యూనిస్టులకు కూడా కబురు వెళ్లింది. కానీ ఈ ఉత్సవానికి మేం రావడం లేదని సీపీఎం ప్రకటించింది. ఆ పార్టీ నుంచి ఇంతకు మించి స్పందన వస్తేనే ఆశ్చర్య పడాలి. మేం అన్ని మతాల విశ్వాసాలను గౌరవిస్తాం. కానీ బీజేపీ రాజకీయాలే మాకు నచ్చవు అంటున్నారు సీపీఎం నాయకురాలు బృందా కారత్. 'మా పార్టీ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కాదు. కానీ మేం అన్ని మతాల వారి విశ్వాసాలను గౌరవిస్తాం. కానీ మతాన్ని రాజకీయాలతో ముడిపెట్టడమే మాకు నచ్చదు. బీజేపీ చేస్తున్నది అదే. ఇది సరికాదు' అంటూ కారత్ ఒక ప్రకటన చేశారు. ఈ విషయాన్ని ఆ పార్టీ అగ్రనేత సీతారాం ఏచూరి కూడా ఇంతకు ముందే చెప్పారు. తమ సెక్యులరిస్టు వ్రతంలోని గాఢతను తెలియచేయడానికి కాబోలు ఇలా ఇద్దరు నాయకులు ప్రకటన ఇచ్చారు.



బృందా కారత్

ఇక్కడ కూడా ఇండియా కూటమి రాజకీయాలు పనిచేస్తున్నట్టే ఉంది. అంటే అయోధ్య ప్రతిష్ఠ ఉత్సవాన్ని బీజేపీ సొంత కార్యక్రమంగానే 'ఇండియా' భాగస్వాములన్నీ చూస్తున్నట్టే ఉంది. అది హిందువుల ఆరాధ్యదైవానికి సంబంధించిన కార్యక్రమమని వారికి తోచడం లేదు. కాంగ్రెస్ ప్రముఖుడు కపిల్ సిబల్ ప్రకటనే ఇందుకు నిదర్శనం. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ పేరుతో బీజేపీ చేస్తున్నదంతా రాజకీయ హంగామాయేనని సిబల్ తేల్చిపారేశారు. పైగా అక్కడ జరుగుతున్నదంతా కూడా రాముడు చెప్పిన సూత్రాలకు పూర్తి వ్యతిరేకమని కూడా కనుగొన్నారు. అక్కడితో ఆగలేదు. చటుక్కున వింటే జాతికి గుండె ఆగినంత పనయ్యే విషయం చెప్పారు కపిల్, 'నా గుండెల్లో ఉన్నాడు రాముడు. నేను ఆ సంగతి ప్రదర్శించుకోనక్కరలేదు. నేను చెప్పే ప్రతి విషయం నా గుండెల నుంచి వచ్చేదే కూడా. కాబట్టి లౌకిక తంతులేవీ తన జోలికి రావు' అని వాక్రుచ్చారాయన. ★

# కరసేవకులతో సమావేశం

**బోయిన్‌పల్లి:** రామకార్యం కోసం అయోధ్యకి వెళ్లిన బోయిన్‌పల్లి భాగ్ కరసేవకుల సమావేశం డిసెంబర్ 21న జరిగింది. చింతల్ పాటిదార్ సమాజ్ భవన్‌లో 1990,1992లో జరిగిన ఈ సమావేశంలో 38మంది పాల్గొని తమ అనుభవాలు పంచుకున్నారు. జనవరి 1 నుండి శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అక్షింతలు అందించే కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ అందరినీ కోరారు. మొత్తం 55 మంది కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో ఎక్కువ మంది కరసేవకులుగా రెండు లేదా మూడు పర్యాయాలు అయోధ్య వెళ్లివచ్చిన వారు ఉన్నారు. ఈ సందర్భంలో తమ అనుభవాలు పంచుకోవడంద్వారా ఆనాటి కర సేవలో ఇప్పుడు పాల్గొంటున్నట్లు అనుభూతి పొందుతున్నట్లు వ్యక్తం చేశారు.



# గొప్ప వ్యక్తిత్వ వికాసగ్రంథం గీత

**కామారెడ్డి** : తాను చదివి సన్మార్గంలో నడవాలని జయరాజ్ బాబా పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా, సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 23, 2023న గీతా జయంతి, దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ముఖ్యవక్తగా విచ్చేసిన సామాజిక సమరసత వేదిక అఖిలభారత కళామండలి కన్వీనర్, సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాలప్రసాద్ ప్రసంగిస్తూ, భగవద్గీత ప్రపంచ ప్రసిద్ధి పొందిన వ్యక్తిత్వ వికాస గ్రంథంగా ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. సామజిక సమరసత వేదికతో పాటు శ్రీకృష్ణ జ్ఞానమందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా భగవద్గీత పఠనం, భజన పోటీలను నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులకు, భజన కళాకారులకు ప్రశంసాపత్రాలు, సాహిత్య గ్రంథాలు అందించారు.



పీఠాధిపతి మహంత్‌బాబా మచాలే,యోగిరాజ్‌బాబా, కృష్ణదాస్ బాబా, మనోహర్ బాబా, మురళిధర్ బాబా,మోహన్‌బాబా మచాలే, సమస్త మచాలే పరివార్, సామాజిక సమరసత వేదిక జిల్లాఅధ్యక్షులు అమృత రాజేందర్, గౌరవ అధ్యక్షులు తుమ్మ రామచంద్రం, సామాజిక సమరసత జిల్లాప్రముఖ్ బాలరాజ్ గౌడ్, మాజీ సర్పంచ్ చందర్‌రావు, సురేష్, ఆనందరావు, వెంకట్‌రావు, కామారెడ్డి ప్రభ్వు వైద్యశాల సూపరింటెండ్ డాక్టర్ రాంసింగ్, సర్పంచ్ గుడెల్లి సాయిలు,ఉపసర్పంచ్ దామోదరరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గ్రామభారతి రైతు దినోత్సవాలు

## ఉత్తమ సేంద్రియ రైతులకు సన్మానం

**మహబూబ్‌నగర్** : ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గ్రామభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలుస కరుణాకర్‌గౌడ్ అన్నారు. డిసెంబర్ 23న మహబూబ్ నగర్, శ్రీకన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో జరిగిన రైతుదినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు గ్రామ భారతి తనవంతు సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. రైతులు పరస్పర సహకారంతో మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచుకొని తమ ఉత్పత్తులను అమ్ముకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుండి వచ్చిన సేంద్రీయ వ్యవసాయ దారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామాల్లో కూలీల సమస్య తీవ్రంగా ఉందనీ, ఉపాధి హామీ కూలీలను వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుందనీ అభిప్రాయపడ్డారు. రసాయనిక ఎరువులతో వ్యవసాయం చేయడం చాలా తేలికని సేంద్రియ వ్యవసాయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని, అయినా అని వార్యమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు సేంద్రియ రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని కోరారు.




ఈ కార్యక్రమంలో గ్రామ భారతి గౌరవాధ్యక్షులు కోట కృష్ణసంజీవ జిల్లా అధ్యక్షులు అమరవాది రాజనర్సింహ గ్రామ భారతి రాష్ట్ర ప్రతినిధులు మదన్ గుప్త వెంకట్ రెడ్డి ఉమ్మడి జిల్లా రైతులు పాల్గొన్నారు.

# జాతీయోద్యమంలో తెలు

**భారతదేశం మూడు శతాబ్దాలపాటు పారతంత్ర్య కుతంత్రాల్లో అలమటించింది. బ్రిటీష్ వారి కుటిల దాస్య శృంఖలాల్లో మగ్గింది. భారతీయులు స్వాతంత్ర్యరహిత జీవనాన్ని భరించలేకపోయారు. పారతంత్ర్య జీవనాన్ని అనుభవిస్తున్న భారతీయులకు వీరసావర్కర్ మాటలు స్ఫురించాయి. "పక్షి బంగారు పంజరంలో బంధించబడి జీవించడం కన్నా స్వేచ్ఛారణ్యాల్లో విహరించడం మిన్న" అనే భావన భారతీయుల్లో ఆలోచన రేకెత్తించింది. వారిలో జాతీయతా భావాలు పొటమరించాయి. బ్రిటీష్ దమననీతిని ఖండిస్తూ, వారి పాలనకు చరమగీతం పాడేందుకు జాతీయోద్యమానికి సంసిద్ధులయ్యారు.**

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని షెల్లీ చెప్పారు. "కవులు ఎన్నుకోబడని జాతి చరిత్రకు శాసనకర్తల వంటి వారన్న" షెల్లీ అభిప్రాయం యథార్థం. ఒక దేశాన్ని నిర్మించడంలో కవుల పాత్ర మహత్తరమైనది. రూసో, వాల్టేర్‌ల రచనలు ఫ్రెంచ్ విప్లవానికి దారితీసాయి. టాల్‌స్టాయ్, మాక్సిమ్ గోర్కీ, డ్రోస్టావిస్కీ ప్రభృతుల రచనలు రష్యా ప్రజల్లో అద్భుతమైన మార్పును తెచ్చాయి. ఆ సంఘటనల స్ఫూర్తితో తెలుగు కవులు పారతంత్ర్య ఛేదకంగా, స్వాతంత్ర్య సాధకంగా తమ కలాలను ఝుళిపించారు. తమ రచనల ద్వారా ప్రజల హృదయాల్లో జాతీయోద్యమ భావాలను ప్రేరేపించారు.

**తొలి జాతీయోద్యమ కవి చిలకమర్తి**

బ్రిటిష్ వారు విభజించి పాలించే విధానంలో 1905లో బెంగాల్‌ను రెండు ముక్కలు చేయడంతో భారతీయుల గుండెలు భగ్గుమన్నాయి. బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశంలో ప్రముఖమైన పట్టణాల్లో ప్రేరణాత్మక ప్రసంగాలు చేసి, ప్రజలను ఉత్తేజపరచి, జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించాడు.





**డా॥పి.వి.సుబ్బారావు**

9849177594,

విశ్రాంత అధ్యాపకుడు


అందులో భాగంగా ఆంధ్రదేశంలో మచిలీపట్టణం, విశాఖ పట్టణం, రాజమండ్రి వంటి పట్టణాల్లో ఉపన్యాసాలు చేశాడు. 1907వ సంవత్సరం ఏప్రిల్ 5,6,7 తేదీల్లో రాజమండ్రిలో ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను చేశాడు. ఆ ఉపన్యాసాలను ప్రముఖ తెలుగుకవి చిలకమర్తి అనువదించారు. చివరిరోజు సభలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ దురాగతాలను, దోపిడీ విధానాన్ని జాతీయతాస్ఫోరకంగా, చైతన్య ప్రేరకంగా, ఆశువుగా ***"భరత ఖండంబు చక్కని పాడి ఆవు / హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ / తెల్లవారను గడుసరి గొల్లవారు / పితుకుచున్నారు మూతులు బిగియబట్టి"*** అని చెప్పారు. చిలకమర్తి పలుకులు కమ్మని కలకండ పలుకుల్లా, అమృతపు గుళికల్లా ప్రజలను ఆకర్షించాయి. భారతమాతను విమర్శకులు గుర్తించారు.

బ్రిటిష్ వారు దమననీతితో, జాతీయోద్యమంలో పాల్గొన్న దేశభక్తులను జైల్లో పెట్టేవారు. చిలకమర్తి వారు కారాగారవాసాన్ని లెక్క చేసేవారు కాదు. లాలా లజపతిరాయ్‌ను నిర్బంధించి జైల్లో ఉంచిన సందర్భంగా భారతదేశపు స్థితి ఒక కారాగారంగా ఉందని వర్ణిస్తూ ***"భరతఖండంబె ఒక గొప్ప బందిఖాన / అందులోనున్న ఖైదీలు హిందుజనులు / చెరయంచు వేరెగలదె!"*** ఒక్క గదినుండి మార్చి వేరొక్క గదిని/ పెట్టుటే కాక చెరయంచు వేరెగలదె!" భారతీయులు బానిసత్వంలో ఎంత బాధపడ్డారో, పారతంత్ర్యం వల్ల ఎంత కుమిలిపోయారో భరత ఖండంబె ఒక గొప్ప బందెఖాన అనే పాదం వల్ల వ్యక్తమవుతుంది. చిలకమర్తి వారి వేదన ఈ పద్యంలో



చిలకమర్తి



గురజాడ



విశ్వనాథ

పాడి ఆవుతో, భారతీయ సంపదను పాడితో, హిందువులను లేగలతో, వారనుభవించే కష్టాలను లేగదూడల ఏడ్పుతో వర్ణించారు. తెల్లవారిని 'గడుసరి గొల్లవారు' అనడం వల్ల వారి నిర్దాక్షిణ్య , కాఠిన్యాన్ని, సంపదను కొల్లగొట్టడాన్ని సూచించారు. మూతులు బిగియబట్టి అనే పదబంధం వల్ల సమకాలీన స్వాతంత్ర్యరహితమైన దుస్థితిని వ్యక్తపరచాడు. అప్పట్లో ఈ పద్యం తెలుగు ప్రజల నాలుకలపై నాట్యం చేసింది.

దేశాభిమానరహితులైన కొందరు పండితులు బ్రిటిష్ ప్రభుత్వానికి ఆ పద్యంలో చిలకమర్తి తెల్లవారిని గొల్లవారితో పోల్చి అభిశంసించాడని చెప్పి, జైలుశిక్ష విధించేట్లు చేశారు. దేశాభిమానులైన మరికొందరు పండితులు బ్రిటిష్ ప్రభుత్వానికి ఆ పద్యంలో చక్కని విరుపుతో, 'తెల్లవారన్ గడుసరు గొల్లవారు' అనే అర్థంచెప్పి అందులో నిందార్థమేదీ లేదని నిరూపించి జైలునుంచి విడిపించారు. చిలకమర్తి పద్యాన్ని తెలుగులో తొలి జాతీయ కవితగా గమనార్హం. స్వాతంత్ర్య భావనాకాంక్షితులు, దేశాభిమాన దీక్షితులైన వారికి చెరసాలలు చంద్ర శాలలుగా, అరదండలు, విరిదండలుగా, చోడంబలె పరమాన్నంగా మోటుకంబళ్ళు పట్టుసెల్లాలుగా భాసిస్తాయని చెప్పి, కారాగార భీతులను దేశాభిమాన దీధితులుగా ప్రబోధించారు. తొలి జాతీయోద్యమకవిగా చిలకమర్తి ఎందరో కవులకు స్ఫూర్తిని కలిగించారు.

**విశ్వమానవ జాతీయగీతం**

**గురజాడ దేశభక్తి ఖండిక**

గురజాడ వారి దేశభక్తి ఖండిక ఆయన జాతీయ దృక్పథానికి, విశాల దృష్టికి, అభ్యుదయ కాముకతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి స్వర్ణపతాక. ప్రజాకవిగా సరళమైన పదాలతో ముత్యాలసరాల గేయ ఛందస్సుతో జనసామాన్యానికి దేశభక్తి ప్రబోధం కలిగించారు. ''ఈ గేయం బంకించంద్రుని వందేమాతరం, రవీంద్ర కవీంద్రుని జనగణమన వంటిదన్న" విషయం అక్షరసత్యం. ఆ గీతాల్లో లేని

విశాల దృక్పథం గురజాడ గేయంలో కనిపిస్తుంది. ఇందులో ఎక్కడా ప్రత్యేకించి ఒక్క భారతదేశానికి మాత్రమే సంబంధించిన ప్రశంస లేదు. ఏ దేశం వారికైనా దేశభక్తిని ప్రబోధించే విధంగా ఉంది. అందుకే ఇది విశ్వమానవ జాతీయగీతం అన్న సినారె అభిప్రాయం సమంజసంగా ఉంది. ఈ గీతంలో ***"దేశాభిమానం / నాకు కద్దని / వట్టి గొప్పలు చెప్పుబోకోయ్ / కూడి ఏదైనా / గట్టి మేల్ తలపెట్టవోయ్"*** ప్రజల్లో నిర్మాణాత్మకమైన గట్టిమేలు చేయడమే దేశాభిమానానికి నిదర్శనమని వట్టిమాటలు కాదన్న ప్రబోధం జాతీయోద్యమంలో ప్రజలను ప్రభావితం చేసింది.

గురజాడ వారి దేశభక్తి ఖండిక ఆయన జాతీయ దృక్పథానికి, విశాల దృష్టికి, అభ్యుదయ కాముకతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి స్వర్ణపతాక. ప్రజాకవిగా సరళమైన పదాలతో ముత్యాలసరాల గేయ చంధస్సుతో జనసామాన్యానికి దేశభక్తి ప్రబోధం కలిగించారు. "ఈ గేయం బంకించంద్రుని వందేమాతరం, రవీంద్ర కవీంద్రుని జనగణమన వంటిదన్న" విషయం అక్షరసత్యం. ఆ గీతాల్లో లేని విశాల దృక్పథం గురజాడ గేయంలో కనిపిస్తుంది.

**దేశభక్తి కవితకు స్ఫూర్తిప్రదాత రాయప్రోలు**

రాయప్రోలు వారు భారత జాతీయాభిమాన

# గు 'కలాలు'


రాయప్రోలు


గరిమెళ్ల


స్ఫూర్తితో రచించిన జన్మభూమి గీతం ***"ఏ దేశమేగినా / ఎందు కాలిడినా / పొగడరా నీతల్లి / భూమి భారతిని / నిలుపరా నీ జాతి / నిండు గౌరవము"*** జాతీయోద్యమ స్ఫోరకంగా దేశభక్తి తత్పరతను ప్రబోధించారు. జాతీయోద్యమంలో యువకుల్లో గొప్ప స్పందన కలిగించి ఈ గీతం ప్రచారం పొందింది.


రాయప్రోలు వారు ఆంధ్రాభిమానంతో తొలిసారిగా తెనుగుతల్లి పదాన్ని ప్రయోగించారు. జాతీయోద్యమంలో ఆంధ్రులు సమైక్యంగా పోరాడాలన్న కాంక్షతో 1914లో ప్రబోధం ఖండిక రచించారు. ***"అమరావతి పట్టణమ్మున బౌద్ధులు / విశ్వవిద్యాలయమ్ములు స్థాపించునాడు"*** అనే పద్యాన్ని నెల్లూరులో జరిగిన ఆంధ్రోద్యమ సభలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చదివి వినిపించగా, సభికుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. అప్పటివరకు ఆంధ్రరాష్ట్రం విషయంలో కలహించుకునే నాయకులు ఈ పద్యాల స్ఫూర్తితో సమైక్యతా భావాన్ని ప్రకటించారట. కవిత్వం సామాజిక ప్రయోజనాన్ని సాధించాలనే ఆధునిక విమర్శ సిద్ధాంతానికి లక్ష్యంగా ప్రబోధం ఖండిక ద్వారా రాయప్రోలు వారు కవితా పరమార్థాన్ని సాధించారు. రాయప్రోలువారి 'ఆంధ్రావళి' కవితా సంపుటి స్ఫూర్తితో పరమార్థాన్ని సాధించారు. రాయప్రోలు విశ్వనాథ, దువ్వూరి, తుమ్మల, జాషువా, కరుణశ్రీ, కొడాలి వంటివారు ఆంధ్రాభిమాన కవిత్వ రచనకు పూనుకున్నారు. విశ్వనాథ వారి ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషం వంటి ఖండకావ్యాలు దేశభక్తి ప్రదీప్తికి నిదర్శనాలు. జాషువా "భరతమాత" ఖండిక అత్యంత ప్రసిద్ధికెక్కిన దేశభక్తి కవిత. తుమ్మల జాతీయోద్యమంలో ప్రముఖ నాయకుడైన గాంధీజీ ఆత్మకథ, మహాత్మ కథ వంటి గ్రంథాలు రచించాడు. కరుణశ్రీ 'విజయశ్రీ' కావ్యంలో ధ్వనిపూర్వకంగా పారతంత్ర్యాన్ని నిరసించాడు. మహాత్ముని వ్యక్తిత్వాన్ని గూర్చి బ్రిటిష్ వారి దురాగతాలను గూర్చి హృద్యమైన పద్యకవితలు రచించాడు. కొడాలి వారి "హంపి క్షేత్రం" గత వైభవ కీర్తికి చక్కని దృష్టాంతం. దువ్వూరి వారి నైవేద్యం, మాతృమందిరం, స్వాతంత్ర్య రథం గొప్ప దేశభక్తి ఖండికలు. వేదులవారి "కాంక్ష"లో త్యాగధనుల ప్రశంస ఉంది.

**జాతీయోద్యమం ప్రచార కవిత్వం**

గేయకవి సార్వభౌముడైన గరిమెళ్ల సత్యనారాయణ బ్రిటీష్ ప్రభుత్వ పాలనను గర్హిస్తూ, తెల్లవారిని నిరసిస్తూ, ప్రజలను ప్రబోధిస్తూ, గేయాలు రాశారు. ఆయన గేయాల్లో ఆనాటి బ్రిటీష్ వారి దుండగాలను, దురాగతాలను కళ్లకు కట్టినట్లు వర్ణించారు. ***"మా కొద్దీ తెల్లదొరతనము / దండాలండోయ్ / మేముండలేమండోయ్ బాబు / ఉప్పు పన్ను, పప్పుపన్ను / ఊరికెళితే పన్ను / సైతాను ప్రభునిక / సాగనీయమండోయ్ బాబు"*** అంటూ తెల్లవారి పాలనలో ప్రజలకు కలిగిన బాధలను హృదయవిదారకంగా వర్ణించి, నిరసించారు. సైతాను ప్రభుతలో "సైతాను" పదప్రయోగం ఆ ప్రభుత్వ దుర్మార్గాన్ని సూచిస్తుంది. ఈ గేయం ఆనాడు గొప్ప ప్రచారంతో పాటు, గాంధీజీ మెప్పు పొందింది.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి ***"వీరగంధం తెచ్చినారము / వీరులెవ్వరో తెలుపుడి"*** అనే గీతం ద్వారా ప్రజల్లో వీరత్వాన్ని ప్రదీప్తం చేశాడు. మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి ***"అంటరానివారెవ్వరు / మా వెంట రాని వారే"*** అంటూ అధిక్షేపాత్మకంగా ప్రబోధించారు. తెలుగు కవులంతా ప్రజలను జాగృతం చేశారు. ★





# పారదర్శక దృష్టి కోసం పతంజలి అన్వేషణ

చాలా ఏళ్ల కిందట అంటే ఇరవై ఏళ్ల కిందట అయి ఉండొచ్చు. ఆంధ్రప్రభ వారపత్రికలో 'జెన్' అనే శీర్షికతో ఒక కథ చదివాను.

'జెన్' అనే పదం పట్ల ఉన్న ఆసక్తే కాక రచయిత పట్ల ఉన్న ఆసక్తి కూడా దానికి కారణం. చదివేక రెండింటి పట్లా నా అభిమానం మరింత పెరిగింది.


అప్పటికే ఆయన రాసిన 'హోరు' నవల చదివి ఉన్నాను. ఆ నవలికతోనే నేను ఆయన అభిమానిగా మారేను. మా చినవీరభద్రుడు అప్పటికి రాజమండ్రిలో ఉండేవాడు

తనని 'ఎవర్రా ఈయన!' అని అడిగేను. "మన సాహితీవేదిక మిత్రుడే. నువు చాలాసార్లు చూసావు" అన్నాడు.

ఏమో! చూసేనేమో గానీ, ఈ హోరు నవల ఆయనను ప్రత్యేక వ్యక్తిని చేసింది నాకు. అలా తల్లావఝుల పతంజలిశాస్త్రి గారు నాకు మిత్రులయ్యారు అప్పటికి.

అదే ఆసక్తితో ఈ జెన్ కథ-ఎప్పటికీ మర్చిపోనివ్వని కథ చదివాను.

త్రిపుర కథలు పుస్తకం నా దగ్గర రెండు కాపీలు ఉండేవి. మొదటి ముద్రణ పుస్తకం. ఒకటి ప్రయాణాల్లో, ఒకటి ఇంట్లో ఉన్నప్పుడూ చదువుకుంటూ ఉండేదాన్ని. మూడో పెగ్ జిన్ అని రాస్తారు ఆయన. అదేమో గానీ ఆ కథల మత్తు అలాగే నెమ్మదిగా నరాల్లోకి ఎక్కేది. ఆ మత్తులోకి జిన్ ఏమో గానీ, జెన్ అన్న పదం చేరింది. వినడం వేరు. అది నరాలలోకి ప్రవహించడం వేరు.



వాడ్రేవు వీరలక్ష్మిదేవి

ఇక దాని మీదనే పతంజలిశాస్త్రి గారి కథ.

కథంతా ప్రతీకాత్మకమే.

తండ్రి నాయుడుగారు. కొడుకూ కోడలూ దగ్గర ఉంటారు. కొడుకు కృష్ణకి తండ్రి మీద గౌరవం, కోడలికీ అభిమానమే. మరే అపోహలూ లేని కుటుంబం. కొడుక్కి హైదరాబాద్ నగరంలో ఉద్యోగం. స్కూటర్ వాడుతూ ఉంటాడు. కానీ అది అతని మాట విననట్టే ఉంటుంది. నాయుడి గారి భాషలో "అతనికీ రోడ్డుకీ ఇతర వాహనాలకీ సంబంధం ఉన్నట్టు కనిపించదు. వాహనాన్ని శిక్షిస్తూ వెళ్లిపోతాడు. స్కూటరు అతని శరీరానికి అతుక్కున్న ఇనపముక్కలా దాన్ని త్వరగా వదిలించుకోవాలనే ఆదుర్దాతో కనిపిస్తాడతను."

అతని చేతిలో అది మొరాయిస్తూనే ఉంటుంది. అతని విసుగూ చిరాకూ మరింతగా దాని మీద చూపెడతాడు. కిక్‌కి కదలకపోతే కాలితో ఒక్క తన్ను తంతూ ఉంటాడు.

అసలు పతంజలిశాస్త్రి గారు కథ మొదలు పెట్టడమే ఈ వాక్యాలతో మొదలు పెడతారు.

"గేటు ముందర స్కూటరు భయంకరంగా పొరబోయి దగ్గుతోంది. కిక్ కొట్టే కొద్దీ పొడి దగ్గే తప్ప ప్రాణం పోసుకుంటున్న జాడలేదు."

ఈ వాక్యమే కథంతటినీ చెప్తుంది. యంత్రం బాధ నాయుడికి ఇలా వినిపించడంలోనే ఆయన ఏమిటో చెప్పేడు రచయిత.

కొడుకు దాన్ని బూతులు తిట్టి నాలుగు తన్నులు తన్నేక తండ్రి ఆగమని వచ్చి నిదానంగా చూసి సరిచేసి, 'ఓవర్ ఫ్లో అవుతోంది, చూసుకో! అని నిర్విచారంగా స్టార్ట్ చేసి ఇస్తారు.

కథంతా చెప్పేసినట్టే.

నాయుడుకి కోడలి దగ్గర కాస్త దగ్గరితనం. ఆమెకు డైనింగ్ టేబుల్ దగ్గర తన జ్ఞాపకాలు చెప్తూ ఉంటాడు. రోజూ ఇంచుమించు అలాంటివే. అయిదు వందల నలభైరెండోసారి వింటూ ఓపికగా నవ్వుకుంటుంది. నిజానికి పదహారోసారి నుంచే వినడం మానేసింది. కానీ ఆయన ఆమెతో మాటాడడు. తనకి తనే చెప్పుకుంటాడేమో!

ఆయన కళ్లలో సముద్రం, అడవికొంగలూ కనిపిస్తాయి ఆమెకు. ఒకోసారి కళ్లజోడు పెట్టుకున్న కొంగలా కనిపిస్తారు ఆమెకు.

అదీ ఆయన తాదాత్మ్యం


నిత్యకృత్యాలయ్యాక ఆయన అమ్మతల్లి ముందు కూర్చుంటారు. "జానపదుల పూజారిలా నాయుడు గారు. భక్తిగా, ప్రేమగా, ఓపిగ్గా అమ్మతల్లిని సేవిస్తుంటారు."

అమ్మతల్లి పాత బ్రిటిష్ మోడల్ కారు. మిత్రుడు "అమ్మితే ఏమీరాదు, సరదా ఉంటే పట్టుకెళ్లి చూడు" అంటే తెచ్చుకున్నారు

రోజూ దాన్ని చక్కగా తుడిచి, లోపం వెతికి శ్రద్ధగా సరిచెయ్యబోయి ఐనా కుదరకపోయినా విసుగు ఎరగని దినచర్య.

ఇంజన్ లోపలి పొగలు ఆర్పి మళ్లీ లోపం

తెలుగు కథానికా సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉన్న తల్లావజ్ఝల పతంజలిశాస్త్రిని 2023 కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం వరించింది.ఆయన పర్యావరణవేత్త కూడా. 'రామేశ్వరం కాకులు, మరికొన్ని కథలు' పుస్తకానికి ఈ పురస్కారం అందిస్తున్నట్టు అకాడెమి కార్యదర్శి కె. శ్రీనివాసరావు ప్రకటించారు. ప్రస్తుత కాకినాడ జిల్లా పిఠాపురంలో 1945లో పతంజలి శాస్త్రి జన్మించారు. కృత్తివాసతీర్థులు, మహాలక్ష్మి తల్లిదండ్రులు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి పురావస్తుశాస్త్రంలో ఎమ్మే పట్టా తీసుకున్నాడు పతంజలి. పుణే డెక్కన్ కళాశాలలో పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో పనిచేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యోగం వదలి 35 ఏళ్ల నుంచి రాజమహేంద్రవరం కేంద్రంగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. సమాంతర వాస్తవికతకు ఒక తాత్త్విక కోణాన్ని ఆయన తన రచనలకు అద్దుతారని విమర్శకులు చెబుతారు. ఆయన కథలు చదవకుండా తెలుగు కథా సాహిత్యం చదివినట్టు కాదన్నంత కీర్తి సంపాదించుకున్నారు. గాథాసప్తశతిలోని 100 కథలను 'అడవిపూలు' పేరుతో అనువదించారు. కథలతో పాటు కవిత్వం, నాటకం, నవలా ప్రక్రియలను కూడా చేపట్టారు. పతంజలికి అభినందనలు.



వెతకడానికి చిరునవ్వుతో సిద్ధమయ్యే మామగారు కోడలికి ఆశ్చర్యం.

ఆయన చిన్నస్థలం కొని కట్టిన ఇల్లు. పెంచుకున్న పూలమొక్కలు. గోడ బయట తురాయి మొక్క నాటారాయన. చైత్రం నుంచి అది కెంపులు పూస్తుంది. ఉదయం, సాయంత్రం నాయుడుగారు గోడవతల పూసిన ఎర్ర పూవుల్ని చూసి వస్తుంటారు. ఆయన్నలా చూసిచూసి కోడలు మావగారే అలా ఎర్రగా పూసివస్తారనుకుంటుంది. ఆయన నీళ్లు పోస్తున్నప్పుడు పూలతో మాట్లాడతారని కొడుకు నమ్మకం.

ఇలా నడుస్తుంది కథ.

కృష్ణ విసుగూ చిరాకులవల్ల భార్యాభర్తలు సయోధ్యగా ఉండలేకపోవడం అయనకు తెలుస్తూనే ఉంటుంది. కోడలి నెమ్మది తెలుసు.

అర్ధరాత్రి నల్లటి సముద్రాన్ని ఈదుకుని వచ్చి పెద్ద పెద్ద వందల తాబేళ్లు రహస్యంగా ఒడ్డున ఇసుక బొరియల్లో గుడ్లు పెట్టి తిరిగి సముద్రంలోకి వెళ్లిపోయే ఉదంతం ఆయన అనుభవంగా కోడలికి చెప్తాడు. అవి గుడ్డు పెట్టినప్పుడు ఆ నిశ్శబ్దంలో టప్ టప్‌మనే చప్పుడు కూడా విన్నానంటాడు. వేల గుడ్లలో కొన్ని మాత్రమే పిల్లలయి తిరిగి కొంతకాలానికి సముద్రంలోకి వెళ్లిపోతాయిట.

ఇలాంటి సృష్టి విచిత్రాల పట్ల ఆయనకు ఆరాధన అని కోడలికి తెలుసు. కానీ ఈ పాతబడి చెడిపోయిన వాహనాన్ని ఆయన ఎందుకు బావు చెయ్యరో అర్థం కాదు ఆమెకు. ఒక్కసారి కూడా ఆయన విసుక్కోవడం, చిరాకు పడడం చూడలేదామె. పైగా యంత్రాలు ఆయన నాడి తగలగానే ప్రాణంతో కట్టుకుని కెవ్వుమన్నట్టుంటాయట.

కొడుకు కూడా "ఎందుకు నాన్నా అది! పైసాకి కూడా పనికి రాదు. ఎందుకు బాగుచెయ్యడం!" అంటాడు

పైగా "ఆఫీస్ నుంచి వస్తూనే వరండాలో మెషీన్ కళేబరాన్ని చూశాడు కృష్ణ" అని రాస్తారు.

దానికి నాయుడు "లాభం గురించి కాదయ్యా! అసలు ట్రబుల్ ఏమిటో చూస్తున్నాను. రన్నింగులో పెడితే మంచిదని, పెర్ఫెక్ట్‌గా స్మూత్‌గా నడిపించాలని!"

ఈ మాటల్లోంచి ఎంత లోతైన భావమేనా తోస్తుంది.

ఈ కథకి 'జెన్' అని పేరు పెట్టేరు శాస్త్రి గారు. కథని ఇంకా వివరించే దుర్మార్గానికి పూనుకోను

కానీ 'జెన్' గురించి మరో రెండు మాటలు చెప్పాలని ప్రలోభం. ఎవరికి తెలియదని!!!?

కానీ చెప్పేసుగా ప్రలోభమని. ఈ సందర్భంలో అవసరమేమో అని కూడా అనిపించింది.

'జెన్' బౌద్ధంలో జాపనీ పదమైన 'సతోరీ' అనేదానికి ఎంతో విలువ ఉంది. నిజానికి సతోరీ లేంది జెన్ లేదు. సతోరీ అంటే మేధకు అందని ఒక మెరుపులాంటి అద్భుత జ్ఞానోదయం. ఒక పారదర్శక దృష్టి. దానికి అందని వస్తువుండదు. ఆలోచన ఉండదు. అనుభూతి ఉండదు.

నీవు సతోరీని కలిగి ఉంటే ఒక్క గడ్డిపోచ మీద రాజ భవనాన్ని నిర్మించవచ్చు. కానీ నీవు సతోరీని కలిగి ఉండనప్పుడు ఒక్క గడ్డిపోచయే రాజ భవనాన్ని కనపడకుండా కప్పి వేస్తుంది.

అందరికీ తెలిసిన ఉదాహరణే. సరదాగా చూద్దాం!

ఒక సజీవమైన బాతు ఒక సీసాలో ఉంటుంది. ఆ సీసా మూతి సన్నగా ఉంటుంది. ఆ బాతుకు హాని కలగకుండా ఆ సీసాని పగల గొట్టకుండా ఆ బాతును సీసా నుండి బయటకు తేవాలి. ఇటువంటి అసాధ్యం సాధ్యం ఎట్లా అవుతుంది?

అదిగో ఆ బాతు బయటకు వచ్చేసింది అని గ్రహించడమే పరిష్కారం. ఈ సృష్టియే సాధ్యమై నప్పుడు, ఇక ఈ సృష్టిలోనిది ఏది సాధ్యం కాదు? క్రియతో సాధ్యం కానిది భావనతో సాధ్యం అవుతుంది. భావనతో సాధ్యమైనది ఒక నాటికి క్రియలో సాధ్యమౌతుంది.

ఇప్పటికీ ప్రకృతి శక్తులన్నింటినీ మనిషి ఎందుకు జయించలేకపోయినాడూ అంటే మనిషి కంటే ప్రకృతి ఎన్నో కోట్ల సంవత్సరాలు వయసులో పెద్దది. అది సంతరించుకున్న శక్తిని మనిషి పూర్తిగా సంతరించు కోలేదు. అంటాడు సంజీవ్ దేవ్. కాబట్టి బయటి ప్రకృతిని లోపలి ప్రకృతిని తెలుసుకోవాలంటే ప్రతీ పనీ ధ్యానంతో చెయ్యాలన్నది జెన్ భావన.

నాయుడిగారి అమ్మతల్లి ఎప్పటికైనా ఆయన చేతులలో రిపేరింగ్ పూర్తిచేసుకుని స్మూత్‌గా నడుస్తుంది సుమా అనిపించేలా పతంజలిశాస్త్రి ఆశ పెడతారు.

నేనూ అలాగే ఏ జిన్ లోకో, జెన్ లోకో ప్రయాణం చెయ్యాలని ఆశ పడుతూ ఉంటాను. అది వదలని ఆశ. దైనిందన జీవితంలోకి ధ్యానం తేవాలన్న ఆ దురాశ వదలదు.

అర్ధరాత్రి సముద్రపు ఒడ్డునుంచి చూస్తే నక్షత్రాల్ని ఎవరో కడిగి పొదిగి నట్టు మిలమిల మంటాయట. ఆయన రాస్తారు.

ధ్యానం కూడా దైనందన అనుభవాలను అలా చేస్తుందేమో!

పతంజలిశాస్త్రి గారు నగిషీ పని బాగా తెలిసిన స్వర్ణకారుడు. అవార్డులు ఆయనకు ఎంతో ఆలస్యంగా ఇస్తారు. అయినా కొంపేమీ మునగదు.

మాలాంటి అభిమానులం మెండుగా ఆయన కథల కోసం కాచుకుని ఉంటాం. చాలుకదా! ★

ఆంక్షలు విధించక ముందు భారతదేశం తన దిగుమతులలో నెలకు 5-7 శాతానికి సమాన మైన10 మిలియన్ బారెళ్ల చమురును సేకరించేది. యుఎస్ 2019లో విధించిన ఆంక్షల కారణంగా వెనిజులా నుంచి ముడి దిగుమతులను భారత్ నిలిపివేయవలసి వచ్చింది. ఉక్రెయిన్ యుద్ధా నంతరం, చమురు ధరలు పెరుగుతాయేమోనన్న భయంతో యుఎస్ వెనిజులా పట్ల తన వైఖరిని సడలిం చుకోవడం ప్రారంభించింది. ఈ ఎత్తుగడలు త్వరలోనే ఇరు దేశాల మధ్య బందీల మార్పిడికి దారితీసింది. ఒపెక్ (OPEC) చమురు ఉత్పత్తిని తగ్గించిన క్రమంలో వెనిజులా అంతర్జాతీయ చమురు మార్కెట్లలోకి తిరిగి ప్రవేశించడాన్ని ఆహ్వానించారు.

సాధించింది. అనంతరం 1830లో వెనిజులా గ్రాన్ కొలంబియా నుంచి విడిపోయింది. కాగా, 1814లో డచ్ వలస కాలనీలను స్వాధీనం చేసుకుని బ్రిటిష్ గయానాలో కలిపివేసుకుంది. ఇందులో ఎస్సెక్విబో నది పశ్చిమ ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతాలు కొన్ని తమవంటూ స్పెయిన్ హక్కులు కోరినప్పటికీ, లాటిన్ అమెరికన్ దేశాల వ్యాప్తంగా స్వాతంత్ర్యం కోసం ఉద్యమాలలో నిమగ్నమై బ్రిటిష్ ఆక్రమణను స్పెయిన్ విస్మరించింది.

బ్రిటిష్ గయానా హద్దులను నిర్ణయించేందుకు 1835లో బ్రిటిష్ ప్రభుత్వం జర్మన్ అన్వేషకుడు రాబర్ట్ హెర్మాన్ షోమ్‌బర్గ్‌ను పంపి, 1840లో బ్రిటిష్ ఒక మ్యాప్‌ను ప్రచురించింది. ఈ మ్యాప్‌పై వెనిజులా

తర్వాత, 1966లో వెనిజులా సరిహద్దులలో సైన్యాన్ని మోహరించింది. అక్కడ వివాదాస్పద దీవులపై సైనిక మౌలిక సదుపాయాలను ఏర్పరచడమే కాక దేశీయ జనాభాను గయానాకు వ్యతిరేకంగా తిరగబడేలా రెచ్చగొట్టింది. తీవ్రమైన దౌత్య ఒత్తిడికి తల ఒగ్గి రెండు దేశాలూ 1970లో స్పెయిన్ ఆఫ్ పోర్ట్ వద్ద 12 ఏళ్ల మారటోరియంపై సంతకాలు చేశాయి.

ఈ వివాదం అదుపుతప్పి పోకుండా పెరిగి పోవడాన్ని నిరోధించేందుకు, 1990లో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుంది. మూడు దశాబ్దాల తర్వాత కూడా ఇరు దేశాలూ ఒప్పందం చేసుకోవడంలో విఫలం కావడంతో 2018లో ఐక్యరాజ్య సమితి ఈ వివాదాన్ని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)

# లాటిన్ అమెరికాలో చమురు సెగ



మదురో

**మూడేళ్ల విరామానంతరం తన చమురు సరఫరాలను కరేబియన్ నుంచి పునరుద్ధ రించాలని భారత్ యోచిస్తున్న సమయం లోనే, ఆ ప్రాంతంలో ఒక నూతన ఫ్రంట్ వృద్ధి చెందుతోంది. ట్రంప్ కాలంలో యుఎస్ ప్రభుత్వం వెనిజులా పై విధించిన ఆంక్షలను పాక్షికంగా ఎత్తివేయడంతో, చమురు ఎగుమతులను ప్రారంభిం చేందుకు భారతీయ సరఫరాదారులు సిద్ధమవుతున్నారు. దేశంలో 2024 ద్వితీయార్ధంలో అంతర్జాతీయ పర్యవేక్షణలో దేశ ఎన్నికలు జరుగనున్న క్రమంలో ఆరు నెలలపాటు వెనిజులాపై ఆంక్షలను ఎత్తివేస్తూ అక్టోబర్ ఆఖరులో యుఎస్ ట్రెజరీ సాధారణ లైసెన్సును జారీ చేసింది.**

వివాదాస్పద ఎస్సెక్విబో ప్రాంతంలో రెఫరెండం నిర్వహించాలంటూ డిసెంబర్ 3న చవిస్తా పాలకులు పిలుపునివ్వడం సుదీర్ఘకాల ఘర్షణను తిరిగి రెచ్చగొట్టింది.

గయానా పశ్చిమ సరిహద్దులో ఉన్న ఎస్సెక్విబోపై ఆధిపత్యం కోసం వెనిజులా, గయానా తీవ్రమైన ప్రాదేశిక యుద్ధంలో చిక్కుకున్నాయి. దట్టమైన అడవులు కలిగిన ఎస్సెక్విబొ ప్రాంతం సహజ వనరులు, ఖనిజ సంపదతో సుసంపన్నంగా ఉంటూ గయానాలో మూడింట రెండొంతులు ఉంటుంది. ఒకప్పుడు సామరస్య పూర్వకంగా పరిష్కృతమైన దాదాపు రెండు శతాబ్దాల కాలం నాటి వివాదాన్ని, రాజకీయ, ఆర్థిక లబ్ధి చేకూరుతుందనే భావనతో చవిస్తా ప్రభుత్వం తిరిగి రెచ్చగొట్టింది.

స్పెయిన్ నుంచి 1821లో కొలంబియా, పనామా, ఈక్వెడార్‌లతో కూడిన రిపబ్లిక్ ఆఫ్ గ్రాన్ (గ్రేటర్) కొలంబియాగా వెనిజులా స్వాతంత్ర్యాన్ని

వివాదానికి తెరలేపుతూ, ఎస్సెక్విబో నది పశ్చిమ ప్రాంతం అంతా తమదేనని ప్రకటించింది. తర్వాత 1850ల్లో ఎస్సెక్విబో ప్రాంతంలో బంగారాన్ని కనుగొనడంతో ఈ వివాదం తిరిగి రాజుకుంది.

1899లో ప్యారిస్‌లోని అంతర్జాతీయ ట్రిబ్యూనల్‌లో సభ్యులైన యుఎస్, యుకెకు చెందిన న్యాయనిపుణులు ఈ ప్రాంతంలో 94శాతం ప్రాంతాన్ని బ్రిటిష్ గయానాకు, ఒరినొకొ నది ముఖద్వారానికి సన్నిహితంగా ఉన్న ప్రదేశాన్ని, అట్లాంటిక్ సముద్ర తీర ప్రాంతం పక్కన విస్తరించి ఉన్న చిన్న ప్రాంతాన్ని వెనిజులాకు ఇచ్చింది. ఈ నిర్ణయంతో వెనిజులా అసంతృప్తిగా ఉన్నప్పటికీ 1905లో ఇరు పక్షాలూ ఈ తీర్పును అంగీక రించాయి. బ్రిటిష్ గయానాకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చేందుకు 1962లో తీవ్రంగా చర్చలు జరుపుతున్న సమయంలో 1899 తీర్పు చెల్లదని వెనిజులా ప్రకటించింది. గయానాకు స్వాతంత్ర్యం వచ్చిన

ముందు పెట్టింది. మానవహక్కుల ఉల్లంఘన ఘటనలలో అధ్యక్షుడు మదురో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు దర్యాప్తును ఎదుర్కొనవలసి వస్తుందన్న భావనతో వెనిజులా ఐజేజే పరిధిని తిరస్కరించింది.

కాగా, 2015లో ఎక్సాన్ మొబిల్ ఎస్సెక్విబోలో కొత్త చమురు క్షేత్రాలను కనుగొనడంతో ఈ వివాదం తీరుతెన్నులు మారిపోయాయి. గయానాలో పెట్టుబడి పెట్టేందుకు దేశాలు పోటీపడుతుండడం, ఖండంలోని అత్యంత నిరుపేద దేశాలలో ఒకటైన గయానాలో అవకాశాలు, ఆర్థిక భవిష్యత్తు కనిపించడంతో ఈ వివాదాస్పద ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఎస్సెక్విబో తీరంలో అతిపెద్ద ముడిచమురు నిల్వలు బయటపడిన తర్వాత వెనిజులా తన వైఖరిని మరింత కఠినతరం చేసింది.

మదురో అణచివేత, బెదిరింపు వ్యూహాలను ప్రారంభించాడు. వెనిజులా నావికాదళం గయానా

షిప్పింగ్ నౌకలను వేధించి, ఎస్సెక్విబో ప్రాంతంలో ఎక్సాన్ మొబిల్ చమురు అన్వేషణకు ఆటంకాలు కల్పించడం మొదలుపెట్టాడు. గయానా ప్రత్యేక ఆర్థిక జోన్‌పై తీరప్రాంత సరిహద్దులను నిర్ణయించి, ఆ ప్రాంతాన్ని సైనిక మోహరింపులతో పటిష్ట పరిచేందుకు మదురో 2015– 2021లో రెండు డిక్రీలను జారీ చేశాడు.

తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో 2021లో అరుదైన ప్రతిపక్ష సంఘటనను జాతీయవాదానికి చిహ్నంగా మార్చేందుకు ఈ వివాదాన్ని మదురో ఉపయోగించుకున్నాడు. రష్యన్ ఆయుధాలు, సైనిక మద్దతు కలిగిన వెనిజులాకు సైనికపరంగా గయానా పోటీ కాదు. యుఎస్‌తో భద్రతా సహకార ఒప్పందంతో గయానాకు ఉన్నప్పటికీ, అది ఇంటర్ అమెరికన్ ట్రీటీ ఆఫ్ రెసిప్రోకల్ అసిస్టెన్స్ (దీని ప్రకారం దేశాలు ఒకరినొకరు కాపాడుకోవడం తప్పనిసరి)లో భాగం కానందువల్ల దాడి చేసే పరిస్థితిలో గయానాలేదు. సహజవనరులతో నిండిన ఎస్సెక్విబో ప్రాంతంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న వెనిజులా, గయానా మధ్య వివాదం హఠాత్తుగా పెరిగిపోవడం అన్నది అనుమానాలను రేకెత్తిస్తుంది.

వెనిజులా చమురు రంగంపై అమెరికా ఆంక్షలు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయి, వెంటనే పెట్టుబడులు కూడా అదృశ్యమయ్యాయి. రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు, ప్రతిపక్ష నాయకులపై నిషేధం, 2024లో అంతర్జాతీయ పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణకు మదురో అంగీకరించిన అనంతరం అమెరికా ఆంక్షలు పాక్షికంగా ఎత్తివేశారు. తాజా రాయితీలపై లబ్ధి పొందుతూ, జాతీయవాద రాజకీయాలు చేస్తూ ఎస్సెక్విబో సమస్యను ప్రధాన స్రవంతిలోకి ఆయన తెచ్చాడు. డిసెంబర్ 3వ తేదీన ఎస్సెక్విబో వివాదంపై ఐదు ప్రశ్నలతో కూడిన రెఫరెండం నిర్వహించాలని పిలుపిస్తూ సెప్టెంబర్ నెలలో వెనిజులా జాతీయ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. దీనితో ఆందోళన చెందిన గయానా ప్రభుత్వం, ఎస్సెక్విబో ప్రస్తుత యథాతథ స్థితిని వెనిజులా మార్చకుండా నివారించేందుకు తాత్కాలిక చర్యలు తీసుకో వలసిందిగా ఐసీజేను అభ్యర్థించింది. దీనిపై డిసెంబర్ 1వ తేదీన ఐసీజే తీర్పునిస్తూ, 'ప్రస్తుతమున్న పరిస్థితిని మార్చేందుకు ఎటువంటి చర్యలను తీసుకోరాదంటూ' వెనిజులాను ఆదేశించింది. న్యాయస్థానం నిర్దిష్టంగా రిఫరెండమ్‌ను నిషేధించనప్పటికీ, యథాతథ స్థితిని మార్చే ఎటువంటి పటిష్ట చర్యలను తీసుకోవద్దని వెనిజులాను కోరింది.




ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విలీనానికి 95 శాతం మంది మద్దతు లభించిందని మదురో పేర్కొన్నారు. మదురోకు రాజకీయ గురువు అయిన హ్యూగో ఛావెజ్ 2005లో ఈ అంశాన్ని పట్టాకిందకు తోసేసి, గయానా, ఇతర కరేబియన్ దేశాలతో రాజకీయ, ఆర్థిక పొత్తును పెట్టుకున్నారు. ఈ పెట్రోకారీబ్ (Petro Caribe) పొత్తు ద్వారా గయానా నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు శుద్ధి చేసిన పెట్రోల్ ఉత్పత్తులను వెనిజులా వర్తకం చేసింది. కానీ మదురో ఈ పొత్తును ధ్వంసం చేశాడు.

రెఫరెండాన్ని అధికారికం చేసేందుకు, యుద్ధ ఉద్ఘాటనలను పెంచేందుకు మదురో తీసుకుంటున్న చర్యలతో గయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ కరీబియన్ సమాజమైన కరీకామ్‌ను కాపాడేందుకు తోడ్పాటునందించవలసిందిగా యుఎస్, ఐక్యరాజ్య సమితిని కోరారు. గయానాకు మద్దతు తెలిపి, సహాయాన్ని అందిస్తామని యుఎస్ హామీ ఇచ్చింది. రెఫరెండం, దాని సంభావ్య పరిణామాలపై అంతర్జాతీయ దృష్టి కేంద్రీకృతమై ఉన్న నేపథ్యంలో మదురో 10 మంది ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలపై కూచొని డచ్ డిసీజ్ (సుసంపన్నమైన వనరులు దేశ కరెన్సీ విలువను కృత్రిమంగా పెంచి, చమురుయేతర ఎగుమతులను సరైన పోటీ లేకుండా చేయడం), సోషలిస్టు ఆర్థిక విధానాల కారణంగా వెనిజులా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. కానీ, ఇది వనరుల కోసం మరొక ఘర్షణను మదురో రేకెత్తించడం నుంచి నిలువరించలేకపోయింది. దేశాలు అంతర్జాతీయ చట్టాన్ని విస్మరిస్తున్న నేపథ్యంలో మదురో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఘర్షణలతో నలిగిపోతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితిని అస్థిరం చేస్తున్నాయి.


**గయానాతో భారత సంబంధం**

బ్రిటిష్ వలసపాలనలో భారత్ నుంచి ఒడంబడికలతో దిగుమతి చేసుకున్న కూలీల సంతతే గయానాలో అతిపెద్ద జాతి సమూహంగా ఉన్నారు. అతిపెద్ద హిందూ జనాభాకు ఆవాసమైన లాటిన్ అమెరికాతో భారత్, గయనాలు ప్రత్యేక బంధాన్ని పంచుకుంటున్నాయి. ప్రవాసీ భారతీయ దివస్‌కు గౌరవ అతిథిగా హాజరైన గయానా అధ్యక్షుడు అలీ ఇంధనం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల వంటి రంగాలలో భారత్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలన్న ఆకాంక్షను ప్రకటించారు. 2015 నుంచి గయానా చమురు ఉత్పత్తిని చెప్పుకోదగ్గ స్థాయిలో పెంచుకొని, తన తొలి చమురు రవాణాను 2021లో భారత్‌కు పంపింది. దాదాపు 14 చమురు బ్లాకులను వేలం వేయాలని గయానా యోచిస్తున్న నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన డిమాండ్లను నెరవేర్చేందుకు భారత్ చురుకుగా పెట్టుబడి అవకాశాలను అన్వేషించాలి. మరోవైపు, చైనా వేగంగా తన పాదముద్రలను విస్తరిస్తున్న క్రమంలో లాటిన్ అమెరికా దేశాలు డ్రాగన్ ఉనికిని సమతులం చేసేందుకు భారత్ ఉనికిని కోరుకుంటున్నాయి. భారత్ కు చెందిన జిఆర్ఎస్ఇ (గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్) సరుకురవాణా, ప్రయాణీకుల ఓడ 'ఎంవి మా లిషా'ను ఏప్రిల్ 2023లో జార్జి టౌన్‌లో ప్రారంభించడం, కోల్‌కతా నుంచి రెండు ఓడలు ఎస్ఎస్ విట్బీ, ఎస్ఎస్ హెస్పెరస్ ప్రయాణాన్ని ప్రారంభించడంతో గయానాతో దాదాపు 185 ఏళ్ల నాటి సంబంధాలకు ప్రాణం పోసినట్టయింది. మదురో ఒత్తిడిని పెంచడంతో గయానా తన రక్షణ సహకార పరిధిని భారత్‌కు విస్తరింపచేయవచ్చు. ప్రస్తుతం భారత్ సైనికులకు, తీర భద్రతాదళాలకు సైనిక శిక్షణను ఇచ్చేందుకు మాత్రమే పరిమితమై ఉంది.

ఐసీజే తీర్పును ధిక్కరించి, విలీన ప్రయత్నాలను మదురో వేగవంతం చేస్తున్నాడు. ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో గయానా రక్షణ దళాలతో ఉమ్మడి విన్యాసాలను యుఎస్ ప్రకటించింది. తన సార్వభౌమత్వానికి ముప్పు వాటిల్లుతుండడంతో గయానా అత్యవసర ఐరాస భద్రతా మండలి సమావేశానికి పిలుపునిచ్చింది. వివిధ వేదికలపై జరుగుతున్న భౌగోళిక రాజకీయ యుద్ధాలతో సతమతమవుతున్న అంతర్జాతీయ సమాజం ఇప్పుడు దక్షిణ అమెరికాలో చమురు కోసం యుద్ధం జరిగే అవకాశాలు ఉండడంతో బెదిరిపోతోంది. ★



డా. రామహరిత




7

# భావదాస్య నిర్మాణం ఆంగ్లేయుల వ్యూహం

వాస్తవానికి విద్య ముఖ్యోద్దేశం వ్యక్తి సాంస్కృతిక జీవనాన్ని నిర్మాణం చేయడం. కాని ఆంగ్లేయులు మనపై రుద్దిన విద్యా విధానానికి దీనికి అణు మాత్రమయినా సంబంధం లేదు. ఆంగ్లేయులకు పూర్వం భారతవర్షంపై దురాక్రమణలు అనేకం జరిగాయి. కాని భారత్ బుద్ధి చైతన్యాన్ని ఎవరూ నశింపజేయలేకపోయారు. కేవలం రాజకీయంగా పరాధీనం కావడం చేత భావదాస్యం ఏర్పడదు. భావదాస్యం ఏర్పడడానికి రెండు కారణాలు ఉంటాయి.

1. ఓడిపోయిన వారి సంస్కృతి కన్నా గెలిచినవారి సంస్కృతి గొప్పది కావడం లేదా

2. ఓడిపోయిన వారు తమ స్వత్వాన్ని గురించి ఈ మాత్రం జ్ఞానం లేకుండా చేయడానికి ప్రయత్నం జరిగి, దాని ఫలితంలో వానిలో అపరిమితమైన న్యూనగండం ఉత్పన్నం కావడం. విదేశీయుల సాంస్కృతిక శ్రేష్టత విషయంలో ప్రబల విశ్వాసం ఏర్పడడం, ఒక జాతి భావ దాస్యానికి నాంది అని ఆంగ్లేయులకు బాగా తెలుసు. భారతీయుల ఆత్మ విశ్వాసం చెక్కు చెదరకుండా ఉంటే కొద్ది సంఖ్యలో ఉన్న తాము వారిని ఎల్లకాలం దాస్యంలో ఉంచలేమని ఆంగ్లేయులకు తెలుసు. జీవనోపాధికి సౌకర్యాలు, ఉద్యోగాలు, సమాజంలో గౌరవం వీటిని విద్యా విధానంతో ముడిపెట్టి వారు భారతీయ జీవన సాంస్కృతిక సంస్కారాలను నాశనం చేశారు. సహేతుకము, విశుద్ధము అయిన భారతీయ, ఆధ్యాత్మిక సంస్కారాలను ఇలా నశింపజేసి వారు భారత్, పతితము, అధమ శ్రేణిదీ అయిన ఒక జాతి అని ప్రచారం చేయనారంభించారు.

**పాశ్చాత్యుల పరిశోధన వెనుక రాజకీయం**

జస్టిస్ కుడ్రాన్ ఒకచోట ఇలా వ్రాశాడు: "ఈ దృష్ట్యాను, ఇతర విధాలుగాను భారతదేశం నాగరికమైన దేశం కాదనీ, అది అనాగరికమైన దేశమనీ నిరూపించగలిగితే, రాజకీయ స్వాతంత్ర్యానికి అది తగదనే వాదన బలపడుతుంది. ముఖ్యంగా భారతీయ నాగరికత ఆధ్యాత్మికమైనదనే వాదాన్ని ఖండించడం అవసరం. ఎందువల్లనంటే ఆధ్యాత్మికతను అందరూ గౌరవిస్తారు. అది ఉన్న చోట మిగతా సద్గుణాలన్నీ ఉంటాయి."

భారతీయ సంస్కృతి నీచశ్రేణికి చెందినదనీ, హిందూ సమాజం పూర్వులు ఆటవికులనీ, మొద్దులనీ హిందూధర్మం అజ్ఞానమయము, అంధకారమయము, అయిన పరిస్థితికి నిదర్శనమనీ నిరూపించడమే భారతీయ సాంస్కృతిక వాఙ్మయం పరిశోధనలో పాశ్చాత్య పండితుల ఉద్దేశ్యం. వారి మరొక ఉద్దేశ్యం భారతీయులకు పాశ్చాత్య విద్యావిధానానికి అనుకూలురను చేయడం. మేక్స్ముల్లర్ 'ఛిప్స్ ఫ్రమ్ జర్మన్ వర్క్ షాప్' అనే గ్రంథానికి తాను వ్రాసిన ఉపోద్ఘాతంలో తన పరిశోధన కార్యం ఉద్దేశ్యాన్ని స్పష్టంచేస్తూ ఇదే భావాన్ని వ్యక్తం చేశాడు.

**సాయనునికి వేదం అర్థం కాలేదనే పాశ్చాత్యులు**

ఒక దేశ సాంస్కృతిక సంఘటనలలోని అంతర్యాన్ని గ్రహించడానికి ఆ దేశపు ప్రాచీన పరంపరల జ్ఞానం అవసరం. పాశ్చాత్యపండితులు ఈ సత్యాన్ని గుర్తించక పోవడానికి కారణం వారి దృష్టి రాజకీయం కావడమే. కనుకనే డా. మేక్డనల్ వలె పాశ్చాత్య పరిశోధకులలో దాదాపు అందరూ భారతీయ సాహిత్యం విషయంలో ఈ క్రింది నియమాన్ని అనుసరించారు:


" ఈ పరిశోధన ఉద్దేశ్యం సత్యాన్ని గ్రహించడమే. కనుక ప్రాచీన గ్రంథాల అనువాదకులు స్థానికులు కాక ఇతరులు కావడంలోనే ఎక్కువ ప్రయోజనం ఉంది. స్థానికులు తమ మత పక్షపాతాన్ని వదులుకోలేకపోయారు."

ఇలాంటి నియమం ఏర్పరచుకున్న తర్వాత ఇక భారతీయ సంస్కృతిని గురించి ఏది తోచితే అది వ్రాయడానికి దోవ ఏర్పడింది. పాశ్చాత్యులద్వారా నిర్మితమైన భారతీయ విజ్ఞానం కపోల కల్పితములైన సిద్ధాంతములు ఆసరాగా ఏర్పడినది.

– బాలశాస్త్రి హరదాస్

*'జాగృతి' 08.06.1964 సంచిక నుంచి*

ఆధ్యాత్మికం



# చెంతనుండగా చింత ఏల?

రామస్వామి అయ్యర్, గుండె పోటుతో గిలగిలలాడుతూ మరణయాతన పడుతున్నాడు. ఈ సంగతి వినగానే పద్మాసనంలో ఉన్న రమణ భగవాన్ కట్టెలా బిగుసుకొనిపోయినారు. అక్కడ రామస్వామి అయ్యర్ బాధంతా మాయమై లేచి కూర్చున్నారు. ఇక్కడ రమణులకు శ్వాస ఆడుతుందో లేదో కూడా తెలయటంలేదు. ఆయన గుండెల మీద, తలమీద నూనె పోసి రుద్దటం ప్రారంభించారు. కొంతసేపటికి మామూలు మనిషి అయినారు. రామస్వామి అయ్యర్ తన సన్నిధికి వచ్చినప్పుడు పునర్జన్మ ఎత్తారా? అని భగవాన్ పరామర్శ చేశారు. 'భగవాన్ అండగా ఉండగా నేను దేనికి భయపడాలి?' అన్నారు రామస్వామి అయ్యర్ వినయంగా.

ఒక విజయదశమి రోజున రమణ భగవాన్ చిన్ననాటి స్నేహితురాలు లక్ష్మీ అమ్మాళ్ ఆయన ముందు కొబ్బరికాయ కొట్టటానికి దాని పీచు తీయటానికి ప్రయత్నం చేస్తున్నది. అది చూసి రమణ భగవాన్ ఆమెను 'ఏం చేస్తున్నావు?' అని ప్రశ్నించగా, 'ఈ రోజు విజయ దశమి పండుగ. రమణభగవాన్ ముందు కొబ్బరికాయ కొడితే పుణ్యం వస్తుంది' అని

# మహాభారతము ప్రజా పరిస్థితి

**7**




"నేను మీకు వేఁడి దాఁకు
నట్లుగాఁ జరింప నస్మత్కులీనుల
కధిక దుఃఖకారినైతిగాని" (ఆశ్రమ 1-33)

వేడియైన దాకనీవి చల్లనిపాలన యాత నిదియును. అందువలననే అట్టిరాజు తమను విడిపోవుచుండ కన్నతండ్రిని కోల్పోవుచున్నట్లు 'సర్వజనులు నశ్రునిహిత దృష్టులగుచు గద్గదిక నెలుంగెడcలగ, నార్తినేడ్చిరి' కాని కోరిన యనుజ్ఞ లభింపలేదు. వారును అనుమతించినగాని, తానేమియు జేయలేదు. వారిని మరింత వేడికొనినాడు.

'... మోద్పుకే లౌదలఁ
గదియించి మిమ్ము వేడెఁద గృహాధ్యు
లార యనుమతి చేయుదు'...అనివాడు.

కఠిన శిలయైనను కరిగెడి వేడి కోలుగదా యిది! ప్రజలు ఉత్తరీయంబులు వదనవివిహితంబులుగా జేసిరి; అతని కోరిక మన్నించిరి. వారు అతనియందును, అతని తనూజుని యందును ఎగ్గు లేదన్నారు.

**"... మీ మహాన్వయంబున మహీ
విభులయం దొప్పమి వెదకి యైన
గానము మము మీరు గన్నట్టి ప్రజల నె
ట్లట్ల రక్షించితి రాదరమున
వినుము దర్యోధనుండు చేసిన యనర్థ
మొక్కటియు లేదు." (ఆశ్ర. 1-98)**

అనినారు. ప్రజలను అందరు రాజుల వలెనే వారును పాలించిరి.

**'ధాత్రి శంతనుండు విచిత్రవీర్యుండు బాండు
రాజు నెట్టు లట్ల రాజ రాజు
ప్రజకు సంతసముగఁ బాలించె నీయందు
నతనియందుఁ గలదె యెగ్గు' (ఆశ్ర. 1-100)**

దుష్టులుగా పేరెన్నికగన్న ధృతరాష్ట్ర, దుర్యోధనులును ప్రజకు వేడిదాకునట్లు పాలింపలేదు. కనుకనే వారన్నను ప్రజకు విరోధములేదు. అంతియగాదు. అనురాగమేయున్నది. ఇక సర్వ సద్గుణ సుశోభితుల గు నితరరాజులయెడ వారికెట్టి పితృభావముండునో ఊహింపనగును.

దుర్యోధనుడును ప్రజలను ప్రీతులుగా నొనర్చుటకే ప్రయత్నించెను. ప్రజాసమ్మతిని పడయుటకు బహువిధముల ప్రయత్నముకావించి, పాండవుల నుండి ప్రజల దృష్టిని మరల్చి, వారిని తన కనుకూలురుగా మార్చుకొనుటకే యాతని ప్రయాసమంతయు

**'... తొల్లి పాండురాజు రాజై
గుణంబులం బ్రజానురాగంబు
పడయుటం జేసి యెల్లవారును
ధర్మరాజు రాజ్యం వలతురు.
దాని నెరిగియె కాదె యేను
నిత్యదాన సమ్మానంబులం బ్రకృతి
జనంబులకు సంతోషంబు
సేయుచునుండుదు." (ఆది- 6-128)..**

అని తండ్రితో చెప్పెను. పాండవులు అరణ్యమునను విరాటనగరంబునను ఉన్న పదమూడేండ్లును దుర్యోధనుడు దుర్వ్యయము చేసి కోశమును శూన్యము గావించెను. మహా సైన్యమును ఒకొదానిని గూర్చి కొనుటకు తప్పక వ్యయమయ్యెను. 'మాతోడి యాసునం జేసి పెక్కండ్రు ముక్కడి మూకలనుం గూడబెట్టి భూమియు భండారంబునుం బాడుసేసె (అశ్వ. 1.14 )అని ధర్మజుడు చెప్పినాడు.

అంతియగాదు, ప్రజలను ప్రీతులుగా చేసికొనుటకు అతడు తప్పక అధిక వ్యయము చేసియుండును. అట్టి వ్యయమును చేయుట అతని స్వభావానుకూలమైనదే. బహుశః ఒక్క యూహ అతని కుదయించి యుండును. పాండవుల కంటె తానే వారిని ఎక్కువ వాత్సల్యముతో పాలించునని వారికి తోపించుటకు ఇంతకంటే మార్గము లేదు. వారిని గాదని పాలించుట తనకు సాధ్యపడదు.

యౌవరాజ్యాభిషేకానంతరము, పాండవులకు హస్తినాపురము నుండి ఉద్వాసన చెప్పుటకే ధృతరాష్ట్రాదులు ప్రయత్నించిరి. మంచి మాటలతో సాగనంపి, ప్రజలను మంచి చేసికొని, తమపాలన స్థిరపడిన తర్వాత వారు తిరిగి వచ్చినను తమకు ప్రమాదములేదు.

**– డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి**
**'జాగృతి' 19-07-1965 సంచిక నుంచి**

---



**అక్కిరాజు రమాపతిరావు**

బదులిచ్చింది. ఆయన ఆమె నుంచి కొబ్బరి కాయను తీసుకొని శుభ్రంగా పీచుతీసి, తన ముందు దానిని పగల కొట్టారు. ఆమె హృద యంతరాళాల్లో ఆనందం ఉప్పొంగిపోయింది. ఇందులో ఎంతో చమత్కారం ఉందని వేరే చెప్పటం ఎందుకూ?

ఒకరు వచ్చి శ్రీ రమణ భగవాన్ ఎదుట ఒకగంట సేపు ఉపన్యాసం చెప్పారు. తన ప్రసంగం పూర్తి అయిన తరువాత 'నేను ఇంతసేపు మాట్లాడుతూ ఉంటే మీరు పలకకపోవడం న్యాయమా?' అని ఆ ప్రాసంగికుడు భగవాన్ను అడిగాడు. అప్పుడు భగవాన్ 'ఏమిటీ మీరు మాట్లాడారా!' అంటూ 'నా భాష మౌనం, నేను మాట్లాడుతూనే ఉన్నాను. మీరు అర్థం చేసుకోలేక పోతే నేనేం చేసేది' అన్నారు. ఇంకొకసారి మహాత్ముల మాటలను రికార్డింగ్ చేయటానికి ఒక అంతర్జాతీయ కంపెనీ వచ్చింది. వారు రికార్డింగ్కు తమ పరికరాలను సిద్ధం చేసుకున్నారు. రెండు గంటలు గడచిపోయినాయి. భోజనానికి గంట కొట్టారు. 'భోజనం చేద్దాము పదండి' అన్నారు భగవాన్. అప్పుడు ఆ కంపెనీ వారు 'ఏదీ మీరు ఒక్క మాటా మాట్లాడలేదు కదా' అన్నారు. భగవాన్ 'సరిపోయింది, ఇందాకటి నుంచే నేను మాట్లాడుతూనే ఉన్నాను కదా' అన్నారు అ సమాధానం విని వారు నిబిడాశ్చర్యంలో మునిగిపోయారు. ★

---

## వివేకానంద సూక్తిశతి

**Every thing that is strong and good and powerful in human nature is the outcome of that divinity, and though potential in many, there is no difference between man and man essentially, all being alike divine.**



మనిషి మనిషిలోని మాధవుడుండగా
హెచ్చుతగ్గులెంచ హేయమగును
సర్వప్రాణులందు సర్వేశ్వరుడుయుండు
వినుడి స్వామి సద్వివేక వాణి !!



**బండిరాజుల శంకర్**

## కథ

'స్వాతంత్ర్యం కోసం చేసే యుద్ధం ఒక పోరాటం..ఆధిపత్యం కోసం అహంకారంతో చేసే యుద్ధం ఒక ఉన్మాదం. 'ఇది చరిత్ర చెప్పిన ఛాయాచిత్ర సాక్ష్యం. ఒక నిశ్చల ఛాయాచిత్రం అక్షరాల వెలుగులో పురుడు పోసుకుంది. కాలం సాక్షిగా చరిత్రలో మిగిలింది. చదువరుల హృదయాల్లో నిలిచింది. ఒక యుద్ధాన్ని ఆపింది. ఒక కన్నీటి చెమ్మను సృష్టించింది.

కెమెరాల ఫ్లాష్‌లు, యాంకర్ల చేతుల్లోని మైకులు నిర్విరామంగా పని చేస్తూనే ఉన్నాయి. అనామిక ఇంటి ముందు కోలాహలం. ఓబీ వ్యాన్లు హడావిడి దీనికంతటికీ కారణం.

ఇరవై మూడేళ్ల అనామికకు జాతీయ స్థాయిలో బెస్ట్ ఫొటోగ్రాఫర్ అవార్డు రావడం.

చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీ మీద ఉన్న ఇష్టంతో కంటికి కనిపించి మనసుకు నచ్చిన ప్రతి విషయాన్నీ కెమెరాలో బంధించే అనామిక ఈ సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో బెస్ట్ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకుంది.

హాల్లో గోడమీద ఉన్న చిత్రం అనామిక హృదయాన్ని, స్పందించే ఆమె మనసును ఆవిష్కరిస్తుంది.

"ఒక తల్లి తన పక్కనే ఉన్న బిడ్డకు సీసాలో పాలు పడుతోంది. మరోవైపు అనాచ్ఛాదితంగా బొమ్మలా కూర్చొని ఉంది. ఆమె స్తన్యం నుంచి పాలధార కారుతోంది'

ఆమె ఒంటరి తల్లి. బిడ్డను బ్రతికించుకోవడానికి మోడల్‌గా మారింది. చిత్రకారులకు స్ఫూర్తిని ఇచ్చే మోడలింగ్.

ఆమె నగ్నంగా కూర్చుంది. మోడలింగ్ చేసినందుకు వచ్చిన డబ్బుతో బిడ్డను పోషించు కోవాలి... బిడ్డ ఏడుస్తుంది. బిడ్డకు సీసా పాలు పడుతూ మరోవైపు ఆ భంగిమలో చిత్రకారుడికి సహకరిస్తుంది.

ఆ దృశ్యం చూసిన అనామిక చేతివేళ్లు కెమెరాను క్లిక్ మనిపించింది. అద్భుతమైన దృశ్యం.

'బిడ్డకు పాలు పడుతూ, ఒక బొమ్మలా ఆ అమ్మ కూర్చుని ఉంటే, చిత్రకారుడు ఆ దృశ్యాన్ని కాన్వాసు మీద చిత్రిస్తూ ఉంటే, ఆ దృశ్యాన్ని ఫొటో తీసి పోటీకి పంపించింది. డబ్బు కోసం కాదు, ఆ ఫొటో చెప్పే మనసును కథను ప్రపంచానికి చెప్పడానికి'. బహుమతిని గెలుచుకున్న అనామికను మీడియా చుట్టుముట్టింది. అభినందనల పర్వం, ప్రశ్నల వర్షం. అందరికీ సమాధానం చెబుతోంది.

"మీలాంటి ఫొటోగ్రాఫర్ మన రాష్ట్రానికి గర్వకారణం" మీడియా అభినందిస్తుంటే. ప్రముఖుల సందేశాలు టీవీ ఛానెల్స్‌లో స్క్రోల్ అవుతున్నాయి.

అప్పుడు..అప్పుడు..అప్పుడు గొంతు విప్పింది




గోపాలకృష్ణ

వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన రచన

# ఛాయా చిత్ర కథనం

**విజయార్కె**

అనామిక.

* * *

అనామిక కాటన్ చీరలో, చాలా సింపుల్ గా ఉంది.

'మీ అభినందనలకు, ప్రశంసలకు ధన్యవాదాలు. కానీ మీరు భావిస్తున్నంత గొప్ప వ్యక్తిని కాదు. ఫొటోగ్రాఫర్ కావాలనే నా కోరిక, నా వెనుక ఉన్న వ్యక్తులు ఇద్దరు..' చెప్పడం ఆపింది. మీడియా లైవ్ పెట్టింది. ఆసక్తిగా అనామిక మాటలు వినడానికి. కాసేపు మైకులు మౌనవ్రతం పాటించాయి.



అనామిక హాల్లో కుడివైపు నడిచింది. అక్కడ గోడ మీద ఒక చిత్రం ఉంది. చక్రాల కుర్చీలో కూర్చున్న ఆజానుబాహుడు. ఆ చిత్రాన్ని దాటి ముందుకు వెళ్లింది. అక్కడ ఒక సజీవ సాక్ష్యం. చక్రాల కుర్చీలో ఉన్న వ్యక్తి.

అనామిక అక్కడికి వెళ్లింది. సహాయకులను పక్కకు తప్పుకోమని చెప్పి ఆ వీల్ చైర్‌ని మీడియా ముందుకు తీసుకుని వచ్చింది.



'నాకు జన్మను ఇచ్చిన తండ్రి. నేను ఫొటోగ్రాఫర్‌గా సాధించే విజయాల కన్నా, నేను తీసే ఛాయాచిత్రాలు ప్రాణం పోసుకుని ప్రపంచాన్ని పలకరించాలని ఆశ పడ్డ వ్యక్తి.' తండ్రి పాదాలకు నమస్కరిస్తూ చెప్పింది. ఒక్క క్షణం ఫ్లాష్ లైట్ వెలుతురులు ఆకాశంలో మెరుపులతో పోటీపడ్డాయి.

అనామిక మాట్లాడడం కొనసాగించింది.

'కెమెరాతో నేను చేసింది సాహసం కాదు, సహవాసం. కానీ అంతకు మించి ఒక ఉన్మాద యుద్ధాన్ని ఆపిన ఒక ఫొటో మీకు చూపిస్తాను, ప్రపంచాన్నే కదిలించి, ఒక యుద్ధాన్ని ఆపిన స్ఫూర్తి చిత్రాన్ని చూపిస్తాను'

అనామిక కదిలింది. కెమెరాలు ఆమెను అనుసరించాయి. ఒక ఉద్విగ్న భరిత వాతావరణం అక్కడ నెలకొని ఉంది.

అనామిక తండ్రి వీల్‌చైర్‌ని ముందుకు కదిలించింది. ఎడమవైపు గోడమీద ఒక సన్నటి తెర. దానిని తొలగించింది.

చీకటిని చీల్చుకుంటూ, ఒక నిశ్చల ఛాయాచిత్రం. ఒక సినిమా తెర సైజులో ఉంది. నలుపు తెలుపుల చిత్రం యుద్ధభూమి దృశ్యం.

కురుక్షేత్రాన్ని పోలిన యుద్ధక్షేత్రం.

ఆకాశం నుంచి కిందికి జారుతున్న కెమెరా...కిందకి జారుతూ నేలమీద దృశ్యాన్ని బంధిస్తూ... ఆ కెమెరాలో వెలుగు....చుట్టూ మృతదేహాలు. మధ్యలో ఒక మహిళ ..ఆమె కుడి చేతిలో ఒక కెమెరా ఆకాశం వైపు చూస్తూ...రెండు కాళ్ల మధ్య స్రవిస్తోన్న రక్తధార..పాదాల చివర అప్పుడే ప్రసవించిన బిడ్డ రక్తం ఓడుతూ...ఆ పక్కనే మరో వ్యక్తి రక్తపు మడుగులో...

ఒక ఉన్మాద యుద్ధానికి సాక్షిగా..

గోడ మొత్తాన్ని పరుచుకుని ఉన్న ఆ ఫొటో కళ్లకు కట్టినట్టు ఉంది.

ఆ ఛాయాచిత్ర కథనాన్ని అనామిక గొంతు తర్జుమా చేస్తుంది.

అక్కడ నిశ్శబ్దం ఊపిరి బిగబట్టింది.

* * *

సుమారు యాభై యేళ్ల క్రితం రెండు దేశాల మధ్య యుద్ధం. ఆధిపత్యం కోసం, అణగదొక్కాలనే అహంకారం. యుద్ధం వల్ల దేశాలు మాత్రమే కాదు. ఆయా దేశాల్లోని అమాయక ప్రజలు, అప్పటివరకూ సాధించిన ప్రగతి. పచ్చని భూభాగం రక్తసిక్తమై, ఆకలి కేకలు, చిన్నారుల రోదనలు.

ఏ తప్పు చేయకుండానే శిక్ష అనుభవించే పౌరులు...

పొరుగు రాజ్యాలు వద్దని చెప్పినా, ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో నిరసించిన యుద్ధం మొదలైంది. రక్తం ఏరులై పారుతుంది..

యుద్ధకాంక్ష దేశ సరిహద్దులను మరుభూమిగా మారుస్తున్న దుర్దినాలు.

సరిహద్దుల్లో విధ్వంసక దృశ్యాలు. స్త్రీల మీద అత్యాచార పర్వాలు. మృతదేహాలు, చెల్లాచెదురయ్యాయి.

ఆ సమయంలో యుద్ధ క్షేత్రానికి ఎందరు వారిస్తున్నా వినకుండా వెళ్లింది కొత్తగా పెళ్లయిన వసుంధరాదేవి. వృత్తిరీత్యా ఒక పత్రికలో ఫొటోగ్రాఫర్. యుద్ధానికి సంబంధించిన వార్తలు ఫొటో కవర్ చేయడానికి వెళ్తానని అన్నప్పుడు పత్రిక ఎడిటర్ వారించాడు.

' ఇది రాక్షస యుద్ధం. ఎప్పుడు ఎటువైపు నుంచి ఎవరు మారణాయుధాలతో విరుచుకుపడతారో తెలియదు. సూర్యాస్తమయం అయినా యుద్ధనీతి పాటించని దమనకాండ. అందులోనూ నెలలు నిండిన గర్భిణీ.

అయినా పాతికేళ్ల వసుంధరాదేవి భయపడలేదు.

రాక్షస యుద్ధాన్ని ప్రపంచానికి ఛాయాచిత్రాల ద్వారా చాటిచెప్పాలని బయల్దేరింది. ఆమె వెన్నంటి నడిచాడు ఆమె భర్త ..సీత వెంట రాముడై....

యుద్ధం భీకర రూపం దాల్చింది. శతఘ్నులు విస్ఫోటాన్ని సృష్టిస్తున్నాయి. శరీరాలు మాంసం ముద్దలుగా మారుతున్నారు అమాయకులు. రెండువైపులా ప్రాణనష్టమే. అయినా యుద్ధోన్మాదం ఆగలేదు.

* * *

వసుంధరాదేవి యుద్ధరంగంలోకి అడుగు పెట్టింది. తనతో పాటు మరికొందరు యుద్ధ వార్తలు కవర్ చేసేందుకు వెళ్లారు. బాంబుల వర్షం కురుస్తుంది. ఎటు చూసినా హాహాకారాలు. ఆహారానికి కొరత. స్త్రీల మాన ప్రాణాలకు భద్రత కొరత. పాలిస్తున్న తల్లి ఇంటి మీద బాంబు పడి బిడ్డకు పాలిస్తూ అలానే చనిపోయింది.

తల్లి చనిపోయిన విషయం తెలియని ఆ బిడ్డ తల్లి స్తన్యాన్ని నోటితో పట్టుకుని ఆకలి తీర్చుకుంటుంది. పక్కనే ఉన్న మరో తెర తొలగించింది. బిడ్డకు పాలిస్తూ బాంబు దాడిలో మరణించిన ఒక తల్లి ఫొటో. చుట్టూ మృతదేహాలు.”

మీడియా ఒళ్లు గగుర్పొడిచింది.

అనామిక కొనసాగించింది “వసుంధరాదేవి భయపడలేదు. యుద్ధం తాలూకూ తీవ్రత ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంది. తన ఫొటోలతో ఎలుగెత్తి చాటాలనుకుంది. ఒక వైపు చిమ్మ చీకటి. భయంతో దేశాన్ని చిమ్మచీకటిగా మార్చుకుని బిక్కుబిక్కుమంటున్న ప్రజలు. ఎప్పుడు ఎక్కడ బాంబు పడుతుందో, ఎప్పుడు సైనికుల ఆయుధాల్లోని తూటాలు తమ శరీరాన్ని ఛిద్రం చేస్తాయో.” అన్న భయం.

తెల్లవారింది. ఎందరి జీవితాలనో తెల్లవారేలా చేయడానికి యుద్ధోన్మాదం

ఒళ్లు విరుచుకుంది. శత్రువుల చొరబాటు కెమెరాలో బంధిస్తోన్న వసుంధరాదేవి. ముందు జాగ్రత్తగా కెమెరాలో టైం సెట్ చేసింది.. కొద్ది క్షణాల వ్యవధి.

దూరంగా బాంబుల వర్షం. ఆకాశం నుంచి మృత్యుదాడి. విమానాల నుంచి బాంబుల వర్షం.

వసుంధరాదేవి ఎగిరిపడింది. ఆమె చేతిలోని కెమెరా ఆకాశంలో ఎగిరి కిందికి పడుతూ, తన యజమాని రుణంతీర్చుకోవడానికి అన్నట్టు, నేలమీద రక్తపు మడుగులో పడిపోయిన వసుంధరా దేవి రూపాన్ని చివరిసారిగా భద్రపరిచింది చిన్న క్లిక్‌తో…

అప్పుడే పురిటి నొప్పులు బాంబుల మోతలో కలిసిపోయాయి. ఆమె రెండు కాళ్లు వెడల్పు అయ్యాయి. ఉన్మాద యుద్ధం సాక్షిగా, తన వేదనను, తల్లి ఆవేదనను వ్యక్తం చేస్తున్నట్లు గుక్కపట్టి ఏడుస్తున్న బిడ్డ. రక్తపు తడిలో..

కన్నుమూసే ముందు వసుంధరాదేవి భర్త వైపు చూసింది. ఆతన్ని చేతిలోని కెమెరా తీసింది. శక్తి కూడదీసుకుని. గాల్లో నుంచి నేల జారుతూ ఉన్న తన కెమెరాను ఫొటో తీసింది వసుంధరాదేవి. కెమెరా ఆమె పాదాల చెంత అప్పుడే కళ్లు తెరిచిన బిడ్డ పక్కనే.. పడింది నివాళిగా.

బాంబుల దాడిలో ఆ బిడ్డ రెండు కాళ్లు దెబ్బతిన్నాయి.

ప్రాణం లేని కెమెరా తన యజమాని ప్రాణం



**అన్ని పత్రికల్లో యాభై ఏళ్ల క్రితం వసుంధరా దేవి తీసిన ఫొటో హెడ్‌లైన్స్‌లో న్యూస్‌గా వచ్చింది. అనామిక చెప్పిన వసుంధరాదేవి ఛాయా చిత్ర కథనం నేపథ్యం ఫొటో గ్రాఫర్ లక్ష్యానికి ఆశయానికి అర్థం చెప్పింది. ఫేస్‌బుక్‌లో, వాట్సాప్‌లో, ఇన్ స్టాలో వసుంధరా దేవి చివరిసారి దిగిన ఫొటో ప్రత్యక్షమైంది.**

పెట్టి, తన ప్రాణాలు ధార పోస్తూ తీసిన ఆ ఫొటో.

ఆ ఫొటో, ప్రపంచ దేశాలను చుట్టేసింది. ఐక్యరాజ్యసమితి కదిలింది. ఐరాస సభ్యత్వం ఉన్న దేశాలు కదిలిపోయాయి. ప్రపంచ దేశాలు ఒక్కతాటి మీద నిలబడ్డాయి.

ఆ ఫొటో ఖండాంతరాలు దాటింది. కోట్లాది ప్రపంచ ప్రజల హృదయాలను తట్టి లేపింది. ప్రపంచ దేశాల ఒత్తిడి మొదలైంది. ఫలితంగా యుద్ధం ఆగింది.

వసుంధరాదేవి, ఆమె భర్త చేసిన ప్రాణత్యాగానికి సార్థకత లభించింది. ఒక్క ఫొటో యుద్ధాన్ని కళ్లకు కట్టింది. కోట్లాది హృదయాలను ఆలోచించేలా చేసింది.’ అని ఆగింది.

ఆ ఫొటోదగ్గర నిలబడింది.

“ఇప్పటి తరానికి వసుంధరాదేవి ఎవరో తెలియకపోవచ్చు. ఈ ఫొటోలో యుద్ధభూమిలో కళ్లు తెరిచి, అదే యుద్ధభూమిలో తన కాళ్లు కోల్పోయిన బిడ్డ ఎవరో తెలుసా? మీడియా వైపు చూస్తూ, వీల్ చైర్‌లో కూర్చున్న తండ్రిని చూపించింది.

‘ఆ బిడ్డే, నా తండ్రి. తల్లి ప్రాణ త్యాగానికి గుర్తు.. తన తల్లిని నాలో చూసుకోవాలని అనుకున్నాడు. నన్ను ఫొటోగ్రాఫర్‌గా తీర్చిదిద్దాడు. ఆ వసుంధరా దేవి నా నాన్నమ్మ.

“తిరుగుబాటు యుద్ధాలు ఫ్రెంచి విప్లవం యుద్ధాలు, పెనిన్సులార్ యుద్ధాలు స్పానిష్ అంతర్యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధం… ఇలా యుద్ధాలు ఏవైనా, స్వేచ్ఛా స్వతంత్రం కోసం చేసే యుద్ధాలు మినహాయిస్తే హననం కోసం, ఆధిపత్యం కోసం చేసే యుద్ధాల తీవ్రతకు అద్దం పట్టిన నాన్నమ్మ తీసిన ఈ ఫొటో నాకు ఛాయాచిత్ర భగవద్గీత.

సెల్ఫీలతో, ఫేస్ బుక్‌లో, వాట్సాప్‌లో ఇన్‌స్టాలో, డీపీలు పెట్టుకునే మనం ఒక్కసారైనా, ఒక్కరోజైనా, ప్రపంచానికి మేలుకొలుపులా, మనసులను కదిలించే ఒక్క ఫొటో, ఒక్కరోజైనా పెట్టుకోవాలని నా కోరిక.

యుద్ధానికి కాలుదువ్వే ఉన్మాదం ఒక్కసారైనా మా నాన్నమ్మ తీసిన ఫొటో చూసి ఆలోచించాలి. టెక్నాలజీ పెరిగింది. సెల్ఫీలు రాజ్యమేలుతున్నాయి.

ఒకప్పుడు అమ్మానాన్న కుటుంబం కలిసి ఫొటో తీసి గోడకు ఫ్రేమ్‌గా తగిలించుకునే వాళ్లు.

ఫొటో ఒక జ్ఞాపకమే కాదు, ఒక ఆలోచన, ఒక ప్రేరణ. రోజూ పదుల కొద్దీ సెల్ఫీలు తీసుకునే మనం ఒక ఫొటోగ్రాఫర్‌గా మారి, మన జ్ఞాపకాలను, అమ్మతో చెప్పే కబుర్లు… పిల్లలతో ఆడుకునే ఆటలు., మొదలు సమాజంలో జరిగే విపరీతాలు విద్దూరాలు చైతన్యపరిచే ఫొటోలు తీస్తే భావితరానికి ఫొటో ఒక చరిత్రను చూపిస్తుంది.

యుద్ధభూమిలో ఎందరో ఫొటోగ్రాఫర్‌లు యుద్ధోన్మాదం కళ్లకు కట్టినట్టు చూపించారు. ఒక వార్త చెప్పలేని విషయాన్ని ఒక ఫొటో చెబుతుంది”

“వసుంధరాదేవి తీసిన ఛాయాచిత్రం ముందు నిలబడి నివాళి అర్పిస్తూ.. ఫొటోగ్రఫీకి.. ఫొటోలకు అద్భుతమైన భాష్యం చెబుతూ అనామిక.

మీడియా హర్షధ్వానాలతో అక్కడ కెమెరాలను క్లిక్ మనిపించింది.

* * *

అన్ని పత్రికల్లో యాభై ఏళ్ల క్రితం వసుంధరాదేవి తీసిన ఫొటో హెడ్‌లైన్స్‌లో న్యూస్‌గా వచ్చింది. అనామిక చెప్పిన వసుంధరాదేవి ఛాయా చిత్ర కథనం నేపథ్యం ఫొటో గ్రాఫర్ లక్ష్యానికి ఆశయానికి అర్థం చెప్పింది. ఫేస్‌బుక్‌లో,వాట్సాప్‌లో, ఇన్‌స్టాలో వసుంధరాదేవి చివరిసారి దిగిన ఫొటో ప్రత్యక్ష మైంది.

ప్రాణాలు తీసే నిరర్థకమైన సెల్ఫీల స్థానంలో చూడముచ్చటైన ఫొటోలు దర్శనం ఇస్తున్నాయి. సమాజాన్ని ప్రభావితం చేస్తూ చైతన్యపరిచే ఫొటోలు ఊపిరి పోసుకుంటున్నాయి.

ఈ కథకు అనామిక ఒక స్ఫూర్తి వాక్యం అయ్యింది.

వీల్ చెయిర్‌లో కూర్చున్న తండ్రి భుజాల మీద చేయివేసి ముందుకు తీసుకువెళ్తుంది అనామిక. బ్యాక్‌గ్రౌండ్‌లో నాన్నమ్మ వసుంధరాదేవి తీసిన ఛాయా చిత్రం.

అందమైన ఫ్రేమ్‌లో ఇమిడిపోయిన ఛాయా చిత్ర కథనం.

* * *

(ప్రపంచ గమనాన్ని, శాంతిని, ఉద్వేగభరిత సందర్భాలను కెమెరాలో చిత్రించిన వారికి… యుద్ధభూమిలో వృత్తిలో భాగంగా, ప్రాణాలు కోల్పోయిన వారికి, కాలంలో నిలిచిపోయే జ్ఞాపకాలను బంధించి మనసు పొరల్లో నిలిపే ఫొటో జర్నలిస్టులకు ఈ కథ అంకితం.)

**వచ్చేవారం కథ..**
**నేను మలచిన శిల్పాలు**

**– డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి**




**స్వతంత్ర భారత క్రీడాచరిత్రలో గత ఏడాది అత్యంత విజయవంతమైనదిగా నిలిచిపోతుంది. జాతీయ క్రీడ హాకీ, అనధికారిక జాతీయ క్రీడ క్రికెట్, బ్యాడ్మింటన్, చదరంగం, అథ్లెటిక్స్ అంశాలతో పాటు కామన్వెల్త్ గేమ్స్, ఆసియాక్రీడల్లో మనదేశం అత్యంత అరుదైన, అపురూప విజయాలు సాధించింది.**



# విజయాల హోరు పతకాల జోరు-2023



సంవత్సరాలు వస్తూపోతూ ఉంటాయి. సుదీర్ఘకాలం గుర్తుండిపోయే సంవత్సరాలు మాత్రం బహు అరుదుగా ఉంటాయి. క్రీడాపరంగా చూస్తే గత ఏడాది (2023)భారత్‌కు అత్యంత విజయ వంతమైన సంవత్సరంగా చెప్పాలి. హాకీ సహా వివిధ క్రీడలలో భారత్ అద్భుతంగా రాణించింది. అబ్బురపరచే విజయాలు, అసాధారణ రికార్డులు నమోదు చేసింది.

**హాకీలో కళ్లు చెదిరే విజయాలు...**

హాకీ పురుషుల, మహిళల విభాగాలలో భారతజట్లు పపంచ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపరచుకోగలిగాయి. పురుషుల విభాగంలో ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌తో పాటు చైనాలోని హాంగ్జు వేదికగా జరిగిన ఆసియాక్రీడల హాకీ ఫైనల్స్‌లో బంగారు పతకాన్ని సైతం సాధించ గలిగింది. భారత్ 5-1 గోల్సుతో జపాన్‌ను చిత్తు చేయడం ద్వారా నాలుగోసారి ఆసియాక్రీడల విజేతగా నిలువగలిగింది. 2014 ఆసియాక్రీడల తరువాత తొలిసారిగా స్వర్ణవిజేత కాగలిగింది. మహిళల విభాగంలో భారత్ 6వ ర్యాంక్‌కు చేరుకోడం ద్వారా సంచలనం సృష్టించింది.

**క్రికెట్లో ఆకాశమే హద్దుగా...**

ప్రపంచంలోనే అత్యధికమంది క్రికెట్ అభిమానులున్న ఏకైక దేశం భారత్. పురుషుల, మహిళల విభాగాలలో భారతజట్లు ఆకాశమే హద్దుగా తమ ఆధిక్యతను కొనసాగించగలుగుతున్నాయి. పురుషుల క్రికెట్ మూడు (టెస్టులు, వన్డే, టీ-20) విభాగాలలోనూ భారతజట్లే ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాయి.

ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పది వరుస విజయా లతో అభిమానుల హృదయాలను గెలుచుకొన్నా రన్నరప్ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

అత్యధికంగా 27 వన్డే విజయాలు సాధించిన ఏకైకజట్టుగా భారత్ అరుదైన రికార్డు నెలకొల్పింది. దక్షిణాఫ్రికా గడ్డపై ప్రస్తుత 2023-24 సిరీస్‌ల్లో టీ-20 పోరులో 1-1తో సమఉజ్జీగా నిలిచిన భారత్.. వన్డే సిరీస్ ను 2-1తో కైవసం చేసుకొంది.

మహిళల విభాగంలో నవీముంబై వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టుమ్యాచ్‌లో భారత్ 347 పరుగుల అతిపెద్ద విజయం నమోదు చేసింది. భారత మహిళా క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా నిర్వహించిన ఐపీఎల్ ట్రోఫీని హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని ముంబై ఇండియన్స్ కైవసం చేసుకొంది. దక్షిణాఫ్రికాలో జరిగిన 2023 అండర్ -19 ప్రపంచ మహిళా క్రికెట్ ట్రోఫీని షెఫాలీ వర్మ కెప్టెన్సీలోని భారతజట్టు గెలుచుకొంది.

**ఒకే ఒక్కడు నీరజ్ చోప్రా....**

పురుషుల జావలిన్ త్రోలో నీరజ్ చోప్రా విజయ పరంపర కొనసాగుతోంది. 88.17 మీటర్ల రికార్డుతో బంగారు పతకం సాధించడం భారత తొలి అథ్లెట్ గా నీరజ్ చోప్రా రికార్డుల్లో చేరాడు. బ్యాంకాక్ వేదికగా ముగిసిన 2023 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో భారత బృందం 6 స్వర్ణాలు సహా 16 పతకాలతో జపాన్, చైనా తర్వాతి స్థానంలో నిలిచింది. హంగెరీలోని బుడాపెస్ట్‌లో ప్రపంచ అథ్లెటిక్స్ మీట్ లో నీరజ్ చోప్రా బంగారు పతకంతో భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడిస్తే... పురుషుల 4×400 మీటర్ల రిలే విభాగంలో భారతజట్టు ఫైనల్స్‌కు అర్హత సాధించడమే కాదు..5వ స్థానంలో నిలిచింది.

హాంగ్జు వేదికగా...ఏడాది ఆలస్యంగా జరిగిన 2022 ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారిగా వందకు పైగా పతకాలతో రికార్డు నెలకొల్పింది. 28 స్వర్ణ, 38 రజత, 41 కాంస్యాలు సహా మొత్తం 107 పతకాలతో పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. కేవలం ట్రాక్ అండ్ ఫీల్డ్ అంశాలలోనే మన అథ్లెట్లు 6 స్వర్ణ, 14 రజత, 9 కాంస్యాలతో సహా 29 పతకాలతో సరికొత్త రికార్డు నెలకొల్పింది.

**బ్యాడ్మింటన్లో డబుల్స్ ధమాకా!**

పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో భారతజోడీ సాయి సాత్విక్- చిరాగ్ షెట్టి ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీలో బంగారు పతకం సాధించిన భారత జంటగా చరిత్ర సృష్టించారు. పపంచ నంబర్ వన్ ర్యాంక్‌ను అందుకున్నారు. స్వర్ణ పతకం పోరులో మలేసియా జోడీ ఆంగ్ ఇ సిన్ -తే ఇ పై 16-21, 21-17, 21-19తో నెగ్గడం ద్వారా ఈ ఘనత సాధించిన భారత తొలిజంటగా చరిత్ర సృష్టించారు.

**చదరంగంలో.. అహో అక్క.. భలే తమ్ముడు...**

మేధో క్రీడ చదరంగంలో తమిళనాడులోని తెలుగు సంతతికి చెందిన వైశాలి, ప్రజ్ఞానంద్ అరుదైన ఘనత సాధించారు. ప్రపంచ చదరంగ చరిత్రలోనే గ్రాండ్ మాస్టర్ల హోదా సాధించిన అక్క,



తమ్ముడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

చెస్ ప్రపంచకప్ ఫైనల్లో సూపర్ గ్రాండ్ మాస్టర్ మాగ్నుస్ కార్ల్‌సన్‌తో పోరాడిన పద్దెమినేదేళ్ల ప్రజ్ఞానంద్ రజత పతకంతో చరిత్ర సృష్టించాడు. 2024లో జరిగే ప్రపంచ క్యాండిడేట్స్ టోర్నీకి సైతం ప్రజ్ఞానంద్ అర్హత సంపాదించగలిగాడు. భారత క్రీడాకారులు ఇదేజోరును వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో సైతం కొనసాగించగలిగితే... కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న క్రీడావిధానం, క్రీడా పథకాలకు సార్థకత చేకూరినట్లే అవుతుంది. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# అయోధ్య ప్రతిష్ట గుర్తుగా శ్రీరామ వృక్షయజ్ఞం

**హిందువులు సమైక్యంగా సుదీర్ఘంగా సాగించిన తొలి సాంస్కృతిక పోరాటం అయోధ్య భవ్యమందిర నిర్మాణం. ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతదేశ రాజకీయాలను సగానికి పైగా భాగం అయోధ్య అంశమే శాసించిందనడం అతిశయోక్తి కాదు. ఈ అంశంపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్పందించని హిందువు లేడని చెప్పవచ్చు. అంతటి చారిత్రాత్మక ఉద్యమం ఫలించి అయోధ్యరాముడి భవ్య మందిరం అందుబాటులోకి వస్తున్న వేళ, రామకోటి తరహాలో 'వృక్ష కోటి' (శ్రీరామ వృక్షయజ్ఞం) కార్యక్రమాన్ని చేపట్టవలసి ఉంది. ఇది శ్రీరాముడి ఉన్నతిపై భావితరాలు జాగృతం పరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు మనవంతు కృషి చేసినవారమవుతాము.**



శ్రీరామ వృక్ష యజ్ఞ నిర్వాహకులను ఆశీర్వదిస్తున్న కంచి స్వామి

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ తరుణంలో శ్రీరాముని పేరిట గ్రామగ్రామాన ఒక దేవతా వృక్ష (శ్రీరామవృక్షం) స్థాపనతో ఆయనకు ప్రకృతితో స్వాగతం పలుకుదాం. ఆ వృక్షం హైందవ ఆధ్యాత్మిక,సామాజిక శక్తి జాగృతికి కేంద్ర బిందువు కాగలదు. అఖండ రామనామ వృక్షజాలం పెంపుతో అటు అయోధ్య స్మరణతో పాటు ఇటు పర్యావరణ పరిరక్షణకూ పాటుపడినట్లు ఉంటుంది. పూర్వం చక్రవర్తులు, రాజులు తమ జైత్రయాత్రలకు గుర్తుగా స్తూపాల నిర్మాణం, విజయస్తంభాల ఆవిష్కరణలు చేపట్టేవారు. ఎందరో మహానుభావుల స్ఫూర్తి, త్యాగాలతో రామ మందిరం సాధించుకున్న మనం ఈ అనుభూతిని చిరస్మరణీయం చేసుకునేందుకు పూర్వికుల స్ఫూర్తితో ఈ 'అంకుర' స్థాపనో ద్యమం చేపట్టవలసి ఉంది. ఒక దేవతా వృక్ష/మొక్కను నాటి దానిని సంరక్షించి భావితరాలు తెలుసుకునేలా పరిరక్షించాలి. ఆ మొక్క/వృక్షాన్ని ధ్వజస్తంభంలా పరిగణిస్తూ, దానివద్ద ఫలకాన్ని అమర్చి పూజాదికాలు నిర్వహించేలా సదుపాయం కల్పిద్దాం. గ్రామంలోని ఆ వృక్షమే 'అయోధ్య'ను స్ఫురింప చేసేలా తీర్చిదిద్దుదాం. వృక్షరూపంలో శ్రీరామ సాక్షాత్కారం పొందుదాం. ఏటా అక్కడే అయోధ్య రామ మందిర సాధన పండుగను జరుపుకుంటూ ఆ 'రామ మహావృక్షా'నికి వందనం, హారతులు ఇస్తూ రామనామ సాధన చేసుకోవచ్చు.

అయోధ్య భవ్య మందిర సాధనలో ప్రతి ఊరు, ప్రతి ఒక్కరు భాగస్వామి కనుక గ్రామంలోని కూడళ్లలోనో, ప్రధాన ప్రదేశంలోనో ఏదైనా దేవతా మొక్క (వృక్ష) స్థాపన చేసి దానికి ఒక ప్రత్యేక స్థానం కల్పించాలి. ఆ గ్రామంలో లేని మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వడం మేలు. వినాయక వ్రతానికి ఉపకరించే ఏకవిం శతిపత్రాలకు సంబంధించిన మొక్కలు/వృక్షాలనూ రామనామాంకితం చేయవచ్చు.

'ఇంటింటా రామవృక్షం' ప్రణాళిక ఆయా గృహ యజమానుల అభిరుచి, ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. మొక్కల ఎంపికలో ఎవరి ఇష్టం వారిది...ఎవరి ఓపిక వారిది. కాకపోతే కనీసం ఒక మొక్కనైనా నాటగలగాలి. చోటు అందు బాటులో లేని వారు కనీసం తులసీ మొక్కకైనా అవకాశం ఇవ్వాలి.

గ్రామపెద్దలు గ్రామంలో ప్రధాన ప్రదేశంలో మొక్కను ధ్వజంలా స్థాపన చేయించాలి. అవకాశాన్ని బట్టి ఇతర మొక్కలనూ నాటవచ్చు. అయితే ధ్వజ ప్రాధాన్యం పొందిన మొక్క మిగతా వాటికి మూలంగా ఉంటుంది. శ్రీరామ వృక్షాలుగా ఏయే మొక్కలను నాటాలి అని యోచన చేసినప్పుడు దీర్ఘకాలం మనగలిగే రావి, జమ్మి, వేప, మామిడి, మర్రి జాతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. తెల్ల మద్ది, జువ్వి, బిల్వ, వెలగ, రామఫలం, ఉసిరి, నేరేడు, చింత, దేవదారు వంటి నిత్యజీవితంలో ఉపయుక్త వృక్షాలను రెండవ ప్రాధాన్యంగా నాటవచ్చు.

ఫలవృక్షాలకు, శ్రీరాముని ఔదార్యానికి అవినాభావ సంబంధం ఉందని రామాయణం చెబుతోంది. రావణునితో యుద్ధం ముగిసిన తరువాత, వానరులకు



వారికి ఇష్టమైన ఫలములు ఆరగించేలా మంచి విందు ఇచ్చాడట. అదే స్ఫూర్తితో మనమూ చెట్లను పెంచితే ప్రాణి సమారాధనకు వీలుంటుంది. ప్రకృతి, జీవులు మానవజాతిని ఆశీర్వదిస్తాయి.

**వృక్ష మహాయజ్ఞం కార్యాచరణ**


'శ్రీరామనామాలు శతకోటి/ఒక్కొక్క పేరూ బహుతీపి'అన్నారు ఒక కవి. ఆ మాధుర్యాన్ని, ఆ దైవాన్ని వృక్షసంపదలో చూ(ప)డగలగాలి. 'అంతా రామమయం... జగమంతా రామమయం' అన్నట్లు వృక్షసంపదకు నిలయం కావాలి. అందులోనూ దేవతావృక్షాలకు అగ్రస్థానం వల్ల 'స్వామికార్యం.. స్వకార్యం' సిద్ధించినట్లవుతుంది.

పది గడపలు లేని పల్లెలోనూ రామాలయాన్ని విధిగా కలిగి ఉన్న సంస్కృతి మనది. ఆ స్ఫూర్తితోనే 'శ్రీరామవృక్షం' ఉద్యమం కొనసాగాలి. ఈ వృక్షయజ్ఞం సందేశాన్ని అన్ని రాష్ట్ర ప్రజలకు అన్ని భాషలో ఈ సందేశాన్ని పంపించాలి. మహాత్ములు, సాధుసంతులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు దీనిపై ప్రజలకు అవగాహన కలిగించి చైతన్యపరచాలి. అవసరమైతే వారే దీనికి సారథ్యం వహించ గలగాలి. అన్ని ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ పథకంలో పాలు పంచుకుని తమ వంతు బాధ్యతగా ఒక రామవృక్షాన్ని స్థాపన చేసి ఇతరులతో కూడా చేయించాలి.

దేశీయంగానే కాకుండా అన్ని దేశాలలో శ్రీ రామవృక్ష స్థాపన జరిగితే ఈ కార్యక్రమం మహాయజ్ఞంగా మారి రామ ఖ్యాతి మరింత విశ్వవ్యాప్తం అవుతుంది. అన్ని దేశాలలో ఉండే రామభక్తులు ఏకం అవుతారు. ఎందరో మహనీయులు, మహాత్ములు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థల చొరవతో సాకారమైన అయోధ్యకు గుర్తుగా ప్రతి గ్రామంలో శ్రీ రామవృక్షం ఆవిర్భావానికి సహకరించాలి. ఈ యజ్ఞం ఫలించిన వేళ ఏకకాలంలో కోట్ల దేవతా వృక్ష సంపద మన సొంతం అవుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వం కూడా దీనిని 'జాతి హిత సందేశం' గా పరిగణించి సహక రిస్తుందని ఆశిస్తున్నాం.

**ఇదంతా ఇక అజ్ఞాత రామ భక్తుని కార్యక్రమం. – జాగృతి డెస్క్**

## తెలంగాణ ప్రాంత సంఘచాలక్ గా బర్ల సుందర్ రెడ్డి



ఆర్.ఎస్.ఎస్. తెలంగాణ ప్రాంత సంఘచాలక్‌గా బర్ల సుందర్‌రెడ్డి (భాగ్యనగర్) ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. 24 డిసెంబర్ 2023 న భాగ్యనగరంలో జరిగిన ప్రాంత సమావేశాలలో వీరిని ఎన్నుకున్నారు. పదేళ్ళగా తెలంగాణ ప్రాంత సహ సంఘ చాలక్‌గా మార్గదర్శనం చేశారు. రాష్ట్ర విద్యుత్ బోర్డులో ఉమ్మడి మెదక్‌జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదవీ విరమణ చేశారు.

# 500 ఏళ్ల తర్వాత తలపాగా చుట్టనున్న సూర్యవంశీయులు



అయోధ్యలో ఐదువందల ఏళ్ల కిందట బాబర్ నేతృత్వంలోని మూకలు రామాలయాన్ని ధ్వంసం చేసిన అనంతరం దానిని పునర్నిర్మించేవరకూ తలకు పాగా చుట్టమని, ఎండైనా, వానైనా గొడుగు పట్టమని, కాలికి తోలు చెప్పులు వేయమని అయోధ్యలోనూ, ఆ చుట్టుపక్కల గల 105 గ్రామాలకు చెందిన సూర్యవంశి క్షత్రియులు నాడు ప్రతిజ్ఞ చేశారుట! శ్రీరాముని వంశజులమని చెప్పుకునే వీరు తమ వంశీకుడి ఆలయ విధ్వంసాన్ని అవమానంగా భావించి ఈ ప్రతిజ్ఞ చేశారు. నిజానికి, 16వ శతాబ్దంలో థాకూర్ గజసింగ్ నేతృత్వంలో వీరి పూర్వీకులు ఆలయాన్ని కాపాడేందుకు మొగలులతో పోరాటం చేసి ఓడి పోయారు. ఈ ఓటమి అనంతరమే గజసింగ్ ఆలయాన్ని పునర్నిర్మించే వరకూ తలకు పాగా, కాలికి తోలు చెప్పులు తొడగనని తాను ప్రతిజ్ఞ చేసి, మిగిలిన వారితో చేయించారుట. ప్రస్తుతం దాదాపు లక్షన్నరమంది జనాభా ఉన్న వీరు వివాహ సమయంలో కూడా తలపాగా ధరించడం, తోలు చెప్పులు వేయడం మానివేశారు!

భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు వచ్చిన వెంటనే పండుగ జరుపుకుని తలపాగాలు పంచుకున్న వీరు వాటిని కట్టలేదట! ఆలయానికి పునాదులు వేసిన సమయంలోనూ లడ్డూలు పంచి పండుగచేసుకున్నారే తప్ప పాగా చుట్టలేదుట. సరయు నదికి ఆ ఒడ్డున ఈ ఒడ్డున ఉన్న గ్రామాలకు చెందిన ఈ ప్రజలు ఆలయభూమి పూజ జరిగిన సమయంలో ఆనందంతో కళ్ళకు నీరు పెట్టుకున్నారుట. మందిరనిర్మాణం పూర్తి అయ్యి, రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరు గుతున్న నేపథ్యంలో వీరు అధికంగా ఉన్న గ్రామాలలో తల పాగాలను పంచిపెడు తున్నారు, బహిరంగ సభలు పెట్టి మరీ వాటిని చేతిలో పెడుతున్నారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చినప్పుడు సంతో షించి, భూమి పూజకు సంబరాలు చేసుకున్నా తలపాగా చుట్టేందుకు సందే హించిన వీరు బహుశ, రామ్‌లల్లాను ప్రతిష్ఠించిన అనంతరమే వాటిని ధరిస్తారు కాబోలు. ★


## అమరులైన కరసేవకులకు ఒక స్మారకం

రామమందిర నిర్మాణం సాకారమై, రామ్‌లల్లా ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ఈ మొత్తం ప్రక్రియకు దారితీసేందుకు కారకులైన కరసేవకులను విస్మరించడం ఘోరమైన పాపమే. 1990లో తమ ప్రాణాలకు కూడా లెక్క చేయకుండా, రాముడికి జన్మభూమిని దక్కించాలన్న తపనతో ఆ ప్రదేశంలో ఉన్న కట్టడాన్ని కూల్చివేసి, ఆ రెండు రోజులలో పోలీసులు జరిపిన కాల్పులలో మృతి చెందినవారు ఎందరో. రాముని కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదులుకొని అమరులైన కరసేవకుల స్మారకార్థం అయోధ్యలోనే ఒక చిహ్నాన్ని నిర్మించనున్నట్టు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. కొఠారీ సోదరులు సహా రామమందిర నిర్మాణం కోసం బలిదానంచేసిన ప్రతి ఒక్క భక్తుడికీ గౌరవ మర్యాదలు ఇస్తామని ఆయన అన్నారు. వారి అంకిత భావం, త్యాగనిరతికి సంకేతంగా అయోధ్యలో ఈ స్మారక చిహ్నాన్ని నిర్మించను న్నారు. దానిపై వారందరి పేర్లను చెక్కించనున్నట్టు ఆయన తెలిపారు. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం — విచిత్ర శివ స్వరూపం

ప్రపంచంలో ఎక్కడ కనిపించని శివుడి విచిత్ర స్వరూపం ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి చిత్తూరు జిల్లా గుడిమల్లం గ్రామంలో దర్శనమిస్తుంది. ఒక చేతితో పరశువు, మరో చేతితో గొర్రె పొట్టేలును పట్టుకుని యక్షుని భుజంపై నిలిచిన రుద్రుడు దర్శనమిస్తాడు. రేణిగుంటకు సమీపంలో సువర్ణముఖీ నదీతీరంలో ఒకటవ శతాబ్దంలో నిర్మితమైనట్టు భావిస్తున్న దీనిని పరశు రామాలయం అనీ అంటారు. కాలగర్భంలో కలిసి పోయిన అత్యద్భుత శిల్ప శోభితమైన ఈ ఆలయం ఉనికిని గోపీనాథరావు అనే పురాతత్త్వవేత్త 1911లో వెలుగులోకి తెచ్చారు.



## కథ — వర్తకుడి సమయస్ఫూర్తి

ఒక సామంతరాజు దగ్గరకు ఒకరోజు ఓ గుర్రాల వర్తకుడు వచ్చాడు.

అతనితో పాటు ఒక గుర్రం కూడా ఉంది. "ప్రభూ! నా దగ్గర ఈ గుర్రంలాంటి మేలైన గుర్రాలు ఇంకా చాలా ఉన్నాయి. వాటి నుంచి మీ కోసం ఏరికోరి ఈ గుర్రాన్ని తీసుకొచ్చాను. ఇది మీ అశ్వశాలలో తప్పకుండా ఉండవలసినది. " అని విన్నవించుకున్నాడు..

"అలాగా...! దీని ధర ఎంత చెప్తున్నావు?" అని అడిగారు రాజు.

"ఎంతో కాదు, మహారాజు.. రెండు వందల బంగారు నాణేలు ఇవ్వండి చాలు" అన్నాడు వర్తకుడు.


"ధర చాలా ఎక్కువ? రెండు వందల బంగారు నాణేలకు నేను పది గుర్రాలు కొంటాను" అన్నాడు రాజు.

'ప్రభూ! దీన్ని ప్రత్యేకించి మీ కోసమే తెచ్చాను. మీకు ఇష్టమైన ధర ఇచ్చి ఈ ఒక్కదానిని తీసుకోండి' అని ప్రాధేయపడ్డాడు.

రాజు ఇరవై బంగారు నాణేలకు బేరం కుదిర్చాడు. అప్పటికప్పుడే ధనం తెప్పించి వర్తకుడికి ఇచ్చాడు.

వర్తకుడు తన చేతిలో ధనం పడగానే గబుక్కున గుర్రం ఎక్కి పారిపోసాగాడు. ఈ సంఘటనతో రాజు బిత్తరపోయారు.

అక్కడే ఉన్న సైనికాధికారులు గుర్రాలను అధిరోహించి వర్తకుడిని పట్టుకోవడానికి అతని వెంటే



## పద్యం

**అనఘునికైనజేకుఱు ననర్హుని గూడి చరించినంతలో**
**మన మెఱియంగ నప్పుడవమానము కీడుధరిత్రియందు నే**
**యనువున నైనదప్పదు యథార్థము తా నది యెట్లు లన్నచో**
**నినుమును గూర్చి యగ్ని నలయింపదె సమ్మెట పెట్టు భాస్కరా!**

భావం : భాస్కరా! ఇనుముతో కలిసియున్న అగ్నికి సమ్మెటపోటు పడినట్లుగా లోకము నందు తగనివానితో స్నేహము చేయుచూ సంచరించు వానికి, ఎంతటి సద్గుణ వంతునకైననూ నేదియో నొక సమయాన అవమానం, హాని కలుగును.

## శ్లోకం

అమంత్ర మక్షరం నాస్తి.....'

**'అమంత్ర మక్షరం నాస్తి నాస్తి మూల మనౌషధమ్**
**అయోగ్య పురుషోః నాస్తి యోజకః తత్ర దుర్లభః**

భావం : మంత్రానికి పనికిరాని అక్షరమంటూ లేదు. మందుకు పనికి రాని మూలికా లేదు. ఎందుకు కొరగాని మనిషి కూడా లేదు. కాని వాటిని గుర్తించ గల వారు కావాలి.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఇన్సులిన్ | జి. డెయిమ్లర్ |
| ఈసీజీ | బాంటింగ్ |
| డీఎన్ఏ | బెర్నెస్ వాలిస్ |
| మోటర్ సైకిల్ | జె.ఎల్. బయర్డ్ |
| వాషింగ్ మెషిన | ఐంథోవెన్ |
| టెలివిజన్ | వాట్సన్ |

సమాధానాలు : ఇన్సులిన్–బాంటింగ్; ఈసీజీ–ఐంథోవెన్; డీఎన్ఏ–వాట్సన్; మోటార్ సైకిల్–జి. డెయిమ్లర్; వాషింగ్ మెషిన్–బెర్నెస్ వాలిస్; టెలివిజన్–జె.ఎల్. బయర్డ్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### శంకర్‌లాల్ ఘెలాభాయ్ బ్యాంకర్



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. మహాత్మా గాంధీ సహచరులలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1889లో అహ్మదాబాదులో ఈయన జన్మించారు. 1918 ఖెడా సత్యాగ్రహం, రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో పాల్గొన్నారు. ఖాదీ, చరఖాలను ప్రోత్సహించారు. భారతీయ చరఖా సంఘానికి కార్యదర్శిగా కూడా సేవలందించారు. ఉద్యమంలో భాగంగా 1922లో అరెస్ట్ కూడా అయ్యారు. 1985లో తుదిశ్వాస విడిచారు.



పరుగెత్తారు.

చాలాసేపటికి సైనికాధికారులు ముఖాలు కిందికి దించుకొని తిరిగి వచ్చారు.

వర్తకుడిని పట్టుకోలేకపోయినందుకు రాజు సైనికాధికారులపై కేకలేశాడు.

అయితే మరునాడు వర్తకుడు అదే గుర్రంతో తిరిగి రాజమందిరానికి రావడం చూసి రాజు ఆశ్చర్యపోయాడు.

వర్తకుడు వినయంగా రాజుకు నమస్కరించి "ప్రభూ! నా గుర్రాల పనితనాన్ని, నాణ్యతను మీకు తెలియజేయాలని అలా చేశాను. నన్ను క్షమించండి" అన్నాడు.

వర్తకుడి సమయస్ఫూర్తికి, తెలివితేటలకు రాజు ఎంతగానో సంతోషించాడు. వర్తకుడి దగ్గర ఉన్న గుర్రాలన్నింటినీ అతడు చెప్పిన ధర చెల్లించి కొన్నారు. ★

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో అతిపొడవైన డ్యాం ఏది? అది ఏ నదిపైన ఉంది?
2. మధ్యప్రదేశ్ నూతన సీఎం ఎవరు?
3. సిటీ ఆఫ్ స్టీల్ అని ఏ నగరాన్ని పిలుస్తారు?

సమాధానాలు : 1. హీరాకుడ్, మహానది 2. మోహన్ లాల్ యాదవ్ 3. జంషెడ్‌పూర్ (జార్కండ్).

## మెదడుకు మేత

అడ్డగోడ మీద ముద్దపప్పు..
అటు తోసినా పడదు..
ఇటు తోసినా పడదు.. ఏమిటది?

జవాబు : ఎద్దు మూపురం

## మంచిమాట

**కనిపించేదాన్ని చూడటానికి కళ్లు చాలు, కనిపించని దాన్ని చూడటానికి వివేకం కావాలి!**



# వారఫలాలు

01 - 07 జనవరి 2024

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆదాయం గందరగోళంగా ఉన్నా అవసరాలకు లోటు రాదు. ఆరోగ్యం కొంత మెరుగుపడుతుంది. విద్యార్థులకు శ్రమకు ఫలితం కనిపిస్తుంది. ఆస్తి వివాదాలను ఎట్టకేలకు పరిష్కరించుకుంటారు. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. 1, 2 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబసభ్యులతో విభేదాలు. మేధా దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక రుణాలు తీరే సమయం. ప్రముఖుల నుంచి ఆహ్వానాలు. వాహనాలు, గృహం కొనుగోలు చేస్తారు. ప్రత్యర్థులు స్నేహితులుగా మారి చేయూతనిస్తారు. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగాలలో ఒడుదొడుకులు తొలగుతాయి. కళాకారులు, పరిశోధకుల యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. 3,4 తేదీల్లో బంధువిరోధాలు. ఆస్తి వివాదాలు. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. బాల్య స్నేహితులనుంచి అందిన సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. ఆదాయం మరింత మెరుగుపడుతుంది. ఆస్తుల కొనుగోలులో అవాంతరాలు అధిగమిస్తారు. నిరుద్యోగులకు కీలక సమాచారం అందుతుంది. రచయితల ఆశలు ఫలిస్తాయి. 5,6 తేదీల్లో అనుకోని ఖర్చులు. స్వల్ప అనారోగ్యం. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయవ్యయాలు సమానంగా ఉంటాయి. రుణదాతలు ఒత్తిడులు తప్పకపోవచ్చు. నిరుద్యోగుల యత్నాలలో కొన్ని ఆటంకాలు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్య సమస్యలతో కొంత ఇబ్బందిపడతారు. వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. పారిశ్రామికవేత్తలకు కొత్త సమస్యలు. కళాకారులు, పరిశోధకుల ఆశలు ఫలిస్తాయి. 6,7 తేదీల్లో ఆకస్మిక ధనలబ్ధి. వాహనయోగం. శుభవార్తలు. ఆంజనేయ దండకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

రాబడి గతం కంటే కొంత మెరుగుపడుతుంది. మీ సమర్థతను చాటుకునేందుకు తగిన సమయం. నూతన ఉద్యోగావకాశాలు లభించవచ్చు. ఆస్తుల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. ఇంటి నిర్మాణయత్నాలు ఫలిస్తాయి. తీర్థయాత్రలు చేస్తారు. రచయితలు, క్రీడాకారులు ప్రతిభ చాటుకుంటారు. 4,5 తేదీలలో స్నేహితులతో అకారణ విరోధాలు. మానసిక ఆందోళన. శ్రీ సూర్యాష్టకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు సకాలంలో చక్కదిద్దుతారు. ఆదాయం సమకూర్చుకోవడంలో గందరగోళం తొలగుతుంది. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. విద్యార్థులకు శుభవార్తలు అందుతాయి. పారిశ్రామికవేత్తలకు ఆహ్వానాలు అందుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు ఒత్తిడులు తొలగుతాయి. 1,2 తేదీలలో ఆరోగ్య సమస్యలు. మానసిక అశాంతి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**


ఆదాయం నిరాశ కలిగించినా అవసరాలు తీరతాయి. ఆప్తుల నుంచి అందిన సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ముఖ్య విషయాలు చర్చిస్తారు. వ్యాపారుల శ్రమ ఫలిస్తుంది. ఉద్యోగులకు విధుల్లో వివాదాలు, తొలగుతాయి. రాజకీయవేత్తలకు మరింత అనుకూల సమయం. 4,5 తేదీల్లో ఖర్చులు. ఇంట్లో ఒత్తిడులు. అనారోగ్యం. ఆదిత్య హృదయం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేసేవరకూ విశ్రమించరు. విద్యార్థులకు నూతన విద్యావకాశాలు దక్కుతాయి. ఆదాయానికి ఇబ్బందులు తొలగుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు మరింత అనుకూలంగా ఉంటాయి. పారిశ్రామిక వేత్తలకు అనుకోని శుభవార్తలు. పరిశోధకులు, కళాకారులకు మంచి గుర్తింపు. 4,5 తేదీల్లో మానసిక అశాంతి. మహాలక్ష్మీ అష్టకమ్ పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

పట్టుదలతో అనుకున్న కార్యక్రమాలలో విజయం




సింహంభట్ల సుబ్బారావు

6300674054


సాధిస్తారు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. విద్యార్థులకు విదేశీ అవకాశాలు దక్కవచ్చు. కోర్టు వివాదాలు కొన్ని పరిష్కారమవుతాయి. వ్యాపారస్తులకు లాభాలు. రచయితలు, పారిశ్రామికవేత్తలకు లక్ష్యాలు నెరవేరతాయి. 1,2తేదీల్లో ఆరోగ్య సమస్యలు. కష్టానికి ఫలితం ఉండదు. బంధువర్గంతో విరోధాలు. నృసింహస్తోత్రం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు దిగ్విజయంగా సాగుతాయి. శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. స్థిరాస్తి వివాదాలను చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. వివాహయత్నాలు కలసివస్తాయి. గృహ నిర్మాణ యత్నాలలో ముందడు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు అనుకూల పరిస్థితులు. కళాకారులు, రచయితలకు ఆహ్వానాలు అందుతాయి. 2, 3 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక ఆందోళన. గణేశాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. ప్రముఖుల నుంచి కీలక సమాచారం. భూవివాదాలు క్రమేపీ తొలగుతాయి. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ధార్మిక కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారులకు విస్తరణ యత్నాలు సఫలం. కళాకారులు, పారిశ్రామికవేత్తలు, పరిశోధకులకు శుభవార్తలు. 4,5 తేదీల్లో కుటుంబంలో కొన్ని సమస్యలు. దూరప్రయాణాలు. రాఘవేంద్రస్తుతి మంచిది.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొత్త కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కారం. భూములు, వాహనాలు కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు. నిరుద్యోగుల ఆశలు ఫలిస్తాయి. వ్యాపారులకు లాభాలు. పారిశ్రామికవర్గాలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. కళాకారులు, వైద్యులకు అన్ని విధాలా కలసివచ్చే కాలం. 6,7తేదీల్లో వృథాఖర్చులు. ఆప్తులతో విభేదాలు. లలితాదేవి స్తుతి పఠించండి. ★

# పదరసం-446

### ఆధారాలు

**అడ్డం**

1) జీవనోపాధి (6)

6) సంతాపంగా జండాను సగం దింపడం (4)

8) పొద్దుగుంకు వేళ (3)

9) ఇంటిపెద్ద, సొంతదారు (4)

11) పక్షపాతం (3)

12) ఎండా కాలం (3)

14) సవాలును స్వీకరిస్తే ఇలా అంటారు (1)

15) ఒకరి పక్షాన పాల్గొనేవాడు (4)

18) ఇది తేలినవాడంటే ఢక్కా మొక్కీలు తిని మంచి అనుభవం ఉన్నవాడు (2)

19) నిశ్చితార్థంలో ఇచ్చిపుచ్చుకునేవి (4)

20) పండుగలకు, పబ్బాలకు స్త్రీలు పెట్టుకునే పండే ఆకు(4)

22) మందుతో చెప్పేది, మీకు కాదు (2)

23) ఆల్జీబ్రా తెలుగులో (5)

24) స్త్రీ (2)

**నిలువు**

1) బతికుంటే ఇది తినొచ్చని సామెత (4)

2) దుష్టపన్నాగం (3)

3) తిరగబడ్డ జరీ (4)

4) ఒకరికి చేసే పరిచర్య, శుశ్రూష (2)

5) ఆసరా (2)

6) భూమి (3)

7) ఆదాయం పైకొచ్చింది (4)

9) రకరకాల ప్రశ్నలు వేస్తుంటే, వాటిని ఇలా అంటారు (5)

10) 24 అడ్డం లాంటిదే (3)

13) ఇలావేస్తే విసిరేసి నట్లు (3)


16) అదేశాన్ని పాటించక పోవడం (4)

17) యు.ఏ.ఇ. రాజధాని (4)

18) రాజుగారి కుమార్తె (4)

21) విధానం, పద్ధతి (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగుడ, హైదరాబాద్-27



పదరసం – 446

పేరు : ..........................................................................


చిరునామా: ..........................................................................

..........................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2024 జనవరి 15 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారి పేర్లు ప్రకటిస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.


### పదరసం - 442 సమాధానాలు



**విజేతలు:** వై. హనుమంతరావు, జి.వెంకటేష్‌బాబు, టి.నాగలక్ష్మి, టి.వెంకాయమ్మ, తి.భారతీశర్మ,నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీరాములు విజయకుమార్, మత్స్యరాజవిజయలక్ష్మి, కె.అల్లీరాణి, ఆర్.అంజనీదేవి, కు.నాగచంద్రిక, తాళ్ళూరి సుబ్బారావు, పులిగంటి రాజేశ్వర్‌రావు, ఏ.ప్రదీపుకుమార్, చెరుకు పల్లవీ మహేశ్, కాల్వ పెద్ద నాగయ్య, బరాబరి సుశీలమ్మ, సుంకి స్వాతి, కె.నర్సింగ్‌రావు బోర్లం, పి.నాగేశ్వర శర్మ, ఆర్.సి.వనమాల, రుద్రభట్ల సుగుణ రాజారాం, అప్పాశేషశాస్త్రి, డా. ధన్వంతరి, కాశీభట్ల రామచంద్ర, వై.రాధాకిషన్, కె.సత్యనారాయణ, కె.వి.ఎస్.ఎన్.గణేష్‌కుమార్, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, ఆర్.వి.సి.హెచ్.నాగేశ్వరరావు, దాసం లక్ష్మణరావు, ఎస్.లక్ష్మీశ్రీదేవి, దాసరి సునీత, యర్రమిల్లి విజయలక్ష్మి, యర్రమిల్లి ప్రభాకరరావు, శాంతి ప్రభాకర్మ్, **ఈ వారం విజేత : చింతకుంట దేవలక్ష్మి, నిర్మల్, తెలంగాణ**

సి ని మా

అరుణ



సీనియర్ నటీమణి సుహాసిని ఇటీవల ఓ మాట చెప్పారు. సెన్సార్‌తో సంబంధం లేని ఓటీటీ కంటెంట్‌లో హింస తారస్థాయికి చేరుకున్న తర్వాత అదే కోవలో సినిమాల్లోనూ మోతాదుకు మించిన హింస ఉంటోందని అన్నారు. అంతేకాదు... గతంలో 'తల తీస్తా' అని హీరో కోపంతో చెప్పే సంభాషణల స్థానంలో ఇప్పుడు నిజంగానే తల నరికేసే సన్నివేశాలు వచ్చేశాయని వాపోయారు. ఇటీవల విడుదలైన కొన్ని సినిమాలు చూస్తే ఆమె చెప్పింది అక్షర సత్యం అనిపిస్తుంది. డిసెంబర్ మాసంలో 'ఎ' సర్టిఫికెట్ మూవీస్ ఎక్కువ వచ్చాయి. 'యానిమల్, సహస్ర కాలింగ్, పిండం, సలార్'తో పాటు రాబోతున్న 'బబుల్ గమ్' కూడా అదే కోవకు చెందిన సినిమానే. 18 సంవత్స రాలు దాటిన వారే ఈ తరహా సినిమాలను థియేటర్‌లో చూడడానికి అర్హులు. కానీ సదరు హీరోకు ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని కుటుంబంలోని పెద్దలు తమతో పాటు పిల్లలను కూడా థియేటర్లకు తీసుకుని వెళుతున్నారు. థియేటర్ వర్గాలు సెన్సార్ నిబంధనల ప్రకారం పిల్లలను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు వారితో వాదనకు దిగుతున్నారు. పౌర స్పృహ అనేది లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే... రేపు సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల పరిస్థితి ఏమిటో అర్థం కాకుండా ఉంది.

# హింసను గ్లోరిఫై చేసిన SALAAR


ఇక 'సలార్' విషయానికి వస్తే 'బాహుబలి' తర్వాత వచ్చిన ప్రభాస్ సినిమాలు 'సాహో, రాధేశ్యామ్, ఆదిపురుష్' ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో అతని అభిమానులంతా 'సలార్' మీదనే ఆశలు పెట్టుకున్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ 'కేజీఎఫ్' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపును, ఘన విజయాన్ని అందుకున్న తర్వాత తమ హీరో ప్రాజెక్ట్ సేఫ్ హ్యాండ్స్‌లోకి వెళ్లిందని ఆనంద పడ్డారు.


'సలార్' అనేది పర్షియన్ పదం. ఇందులోని కుర్రాడికి ఓ పెద్దాయన పర్షియన్ రాజు కథ చెబుతుంటాడు. దాంతో అతను తనకు అండగా నిలిచిన స్నేహితుడిని 'సలార్' అని ప్రేమగా పిలుచుకుంటాడు. దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం కచ్ సమీపంలోని ఖాన్సారా అనే ప్రాంతంలో ఇది మొదలవుతుంది. మన్నార్, ఘనియార్, శౌర్యాంగుల అనే మూడు తెగలకు చెందిన ఆటవికులు అక్కడ నివసిస్తుంటారు. ఒక్కో పర్యాయం ఒక్కో తెగ అధికార పీఠంపై కూర్చుంటుంది. అయితే శౌర్యాంగులను అధికార పీఠం ఎక్కనీయకుండా మన్నార్ తెగ దానిని తెగ నరుకుతుంది. ఘనియార్‌లను తన చెప్పు చేతల్లోకి తీసుకునే తానే అధికారాన్ని హస్తగతం చేసుకుంటుంది. బ్రిటీషర్స్ ఆ ప్రాంతాన్ని జయించాలని చూసి చేతులెత్తేస్తారు. చిత్రం ఏమంటే... దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా ఖాన్సారాను భారత ప్రభుత్వం ఏమీ చేయలేక దానికి తన వంతు సహకారం అందిస్తుంటుంది. అంటే అక్కడో పేరలల్ గవర్నమెంట్ తనదైన రాజ్యాంగంతో నడుస్తుంటుందన్న మాట. అలాంటి అరాచక రాజ్యంలో జరిగే హింసను చూసి తట్టుకోలేక పిల్లవాడిగా ఉన్న దేవా (ప్రభాస్)ను తీసుకుని అతని తల్లి (ఈశ్వరీరావు) ఖాన్సారాను విడిచి వెళ్లిపోతుంది. ఖాన్సారాను శాసించే రాజమన్నార్ (జగపతిబాబు) రెండో భార్య కొడుకు వరద(పృథ్వీరాజ్)కు, దేవాకు మధ్య విడదీయలేని స్నేహం ఉంటుంది. తల్లి మాట కాదనలేక దేవా స్నేహితుడిని వదిలి వచ్చేస్తాడు. అయితే ఎప్పుడైనా తన సహాయం కావాలంటే ఖాన్సారాకు వస్తానని మాట ఇస్తాడు. తల్లితో పాటు రకరకాల ప్రాంతాలలో తలదాచుకుని, చివరకు ఎవరికి కనిపించకుండా బర్మా సరిహద్దులోని బొగ్గుగనుల ప్రాంతంలో జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. అలా అజ్ఞాతంలో ఉండే దేవా మళ్లీ ఎందుకు బయటకు వచ్చాడు? ఖాన్సారాకు ఎందుకు వెళ్లాడు? అక్కడ ఆపదలో చిక్కుకున్న తన స్నేహితుడు వరదకు ఎలా సాయపడ్డాడు? అనేది 'సలార్ 1: సీజ్ ఫైర్' కథాంశం.


భారతంలో లేని కథలు మనకు మరెక్కడా కనిపించవని అంటారు. ఈ కథలోనూ అందులోని ఛాయలు చాలానే కనిపిస్తాయి. ఇటీవల వచ్చిన మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్' తరహాలోనే రాజులు, రాజ్యాలు, సామంతులు, వారి మధ్య అనుబంధాలు, కుట్రలు, కుతంత్రలు వంటివి ఇందులోనూ దండిగా ఉన్నాయి. గతంలో సినిమా పాటల పుస్తకాలతో పాటు కథా సంగ్రహం అని ఇచ్చేవారు. అలా ఈ తరహా సినిమాలకు ముందే కథ గురించిన వివరణను చిన్నపుస్తక రూపంలో ఇస్తే చూసే వారి బుర్రలు వేడెక్కకుండా ఉంటాయి. సంక్లిష్టమైన ఈ కథను అంతే సంక్లిష్టంగా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెర మీద చూపించాడు. దాంతో కథ ఏమిటో ఎవరికీ అర్థం కాకుండానే 'సలార్' మొదటి భాగం పూర్తయిపోయింది. ఈ చిక్కు ముడులకు రెండో భాగంలో సమాధానం దొరుకుతుందని ప్రేక్షకులు సమాధానపడుతున్నారు. అయితే ప్రథమార్థంలో పాత్రలను పరిచయం చేసిన దర్శకుడు ద్వితీయార్థంలో స్నేహితుడి కోసం దేవా చేసే మారణకాండను చూపించాడు. ఆ దారుణాలను సున్నిత మనస్కులు తట్టుకోలేరనే దీనికి 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. ప్రభాస్ కనిపించే ప్రతి సీన్ ఇంట్రడక్షన్ సీన్‌లానే ఉంటుంది. ప్రతి పోరాట సన్నివేశం క్లయిమాక్స్ ఫైట్‌లానే అనిపిస్తుంది. మొత్తం మీద నటీనటులు, సాంకేతిక నిపుణుల నైపుణ్యానికి వంక పెట్టడానికి ఏమీ లేదు. అయితే... ప్రేక్షకులను మెప్పించడానికి ఇంత హింసను తెరమీద చూపించాలా? అన్నదే ప్రశ్న. యువత ఇవాళ ఈ సినిమా వెర్రిగా చూస్తుండొచ్చు, సినిమా సరికొత్త రికార్డులను సృష్టిస్తూ ఉండొచ్చు. కానీ కమర్షియల్ సక్సెస్ ఎప్పుడూ 'మంచి సినిమా' అనడానికి కొలమానం కాదనే విషయం గ్రహించాలి. ఫ్యామిలీ ఆడియెన్స్ సైతం ఈ చిత్రాన్ని ఎంతవరకూ ఆమోదిస్తారో వేచి చూడాలి.


వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు









వెల : ₹ 220/- | వెల : ₹ 200/- | వెల : ₹ 390/- | వెల : ₹ 250/- | వెల : ₹ 250/-





















వెల : ₹ 360/- | వెల : ₹ 100/- | వెల : ₹ 200/- | వెల : ₹ 100/- | వెల : ₹ 150/-




వెల : ₹ 799/- | వెల : ₹ 499/- | వెల :₹ 495/- | వెల : ₹ 799/- | వెల : ₹ 549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 08

○ జనవరి 22, 2024 ఇది భారతదేశ చరిత్రలోనే విశిష్టమైన రోజు.

○ అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ శుభ ఘడియ అది.

○ అది ఒక చారిత్రిక ఘట్టం, మనసులో నిక్షిప్తం చేసుకొని, భవిష్యత్ తరాలతో పంచుకోవలసిన జ్ఞాపకం..

○ ఈ ప్రత్యేక సంచికను మన వారసత్వానికి, పోరాటశక్తికి సంకేతంగా పదిల పరచండి.

○ ఆలయానికి జీవం పోసిన ప్రయాణానికి, స్ఫూర్తిగా, గుర్తుగా ఉండనివ్వండి.

○ ఆధ్యాత్మికవేత్తలతో ముఖాముఖీ, ప్రముఖుల వ్యాసాలు, చారిత్రక అంశాలతో సర్వాంగ సుందరంగా ప్రత్యేక సంచిక వెలువడుతున్నదని చెప్పడానికి సంతోషిస్తున్నాం.

○ ఈ సంచికతో పాటు రామచంద్రప్రభువు చిత్రమున్న రమణీయమైన కేలెండర్ మీ ఇంటికి శుభ సంకేతంగా భావిద్దాం.

**త్వరపడండి!**

సంచిక తేది : 15-21 జనవరి, 2024
పుటలు : 68, వెల : 25 రూపాయలు






**అడ్వాన్స్ బుకింగ్ - రాయితీ**

- ☞ 50 నుంచి 99 కాపీల వరకు - రూ. 15/-
- ☞ 100 నుంచి 999 కాపీలు - రూ.12/-
- ☞ 1000 ఆ పైన కాపీలు - రూ.10/-
  రవాణ ఖర్చులు మీవే.

ఈ సంచిక చందాదారులకు
యథావిధిగా అందుతుంది

★ జనవరి 5లోగా అమౌంట్ పంపి కాపీలు బుక్ చేసుకున్నవారికి మాత్రమే పంపబడును.

Bank Details : A/c Name : Jagriti Prakashan Trust, A/c No : 920010061405325,
Axis Bank : Kothapet Branch. IFSC : UTIB0002157

వివరాలకు : 9959997013 / 040-27561453